నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | గురువారం 23-12-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 116 | పేజీలు:6 | వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

సినీ ప్రియుడు
పాటల మాంత్రికుడు
సిరివెన్నెల.

ఒమైక్రాన్ క్రిమి
భయంతో విశ్వమంత
మళ్లీ మాస్కులు.

జావాద్ తుపాను
తీరాల్లో తీతువు రాగం
భయంలో జయం.

పెన్సిల్ రేఖలు
రూపాలకు రూకలు
కళాపిపాసి.

విధిరాతలు
నమ్మకాల నదులు
జారిపోకు.

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజాలు

మనిషిని ప్రేమించేదే
అదేలే మానవతం !
కులమతభేదాలుకావు
భరతజాతి అభిమతం !

ఒకరి పంట మీద ఒకరు
చేస్తుంటే దాడులు !
కాట్లోమసి నోట్లోపడి
అయిపోతాయి బీడులు !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

నిప్పురవ్వలు



ఈ వ్యాపార
త్రాసులో
మధ్యతరగతి వాడే
గలమనాభి!
పైకం ఉన్నవాడే
పైకి–
ఇంకా పై పైకి!!
దరిద్రపు బ్రతుకుల్లో
తూనిక "రాళ్ళ" బరువుతో
ఇంకా క్రిందికి!!



తెలియకనే
కలిశాము–
తెలియకనే
వలిచాము–
తెలుసుకొనే
నడిచాము!

నిరంతర ప్రయాణంలో
ఒకరిని ఒకరు
పరికించి..
గుర్తించే సమయం
ఎవ్వరికీ లేదు–
నీ ఉనికిని నువ్వే చాటాలి!

ప్రళయ్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించిన భారత్

భువనేశ్వర్, డిసెంబర్ 22:: ఉపరితలం నుంచి ఉపరితలంలోని లక్ష్యాలను చేధించే సామర్థ్యంగల బాలిస్టిక్ క్షిపణి ప్రళయ్‌ని భారత్ విజయవంతంగా పరీక్షించింది. డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) అధికారులు ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ క్షిపణి 150 నుంచి 500 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను సక్సెస్‌ఫుల్‌గా చేధించగలదు. అదేవిధంగా 500 కేజీల నుంచి 1000 కేజీల వరకు బరువును మోసుకెళ్లగల సామర్థ్యం ఈ క్షిపణి సొంతం. ఈ ప్రళయ్ క్షిపణి ఘన ఇంధనంతో పనిచేస్తుంది. ఇండియన్ బాలిస్టిక్ మిసైల్ ప్రోగ్రామ్‌లో భాగంగా రూపొందించిన పృథ్వి డిఫెన్స్ వెహికిల్‌ను ఆధారంగా చేసుకుని ఈ ప్రళయ్ క్షిపణిని రూపొందిం చారు. ఉదయం 10.30 గంటలకు ఏపీజే అబ్దుల్ కలాం ఐలాండ్ నుంచి ఈ క్షిపణిని పరీక్షించారు. కాగా, క్షిపణి పరీక్షను విజయ వంతంగా నిర్వహించిన డీఆర్‌డీవో బృం దాన్ని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు.

సదరన్ నేవల్ కమాండ్‌ను సందర్శించిన రాష్ట్రపతి

న్యూఢిల్లీ, డిసెంబర్ 22: రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ సదరన్ నేవల్ కమాండ్‌ను సందర్శించారు. ఆ కమాండ్ కార్యాచరణ ప్రదర్శనను ఆయన పరిశీలించారు. కేరళలోని కొచ్చిలో సదరన్ నేవల్ కమాండ్‌కు ఆయన వెళ్లారు. నౌకాదళానికి చెందిన నౌకలు, విమానాలు ప్రదర్శించిన పోరాట సామర్థ్యాన్ని వీక్షించారు. సదరన్ నేవల్ కమాండ్ నౌకాదళ పరాక్రమం, కార్యకలాపాల తీరును రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ అభినందించారు.

ఉన్నత విద్యలో తెలంగాణ పురోగమనం: గవర్నర్ తమిళిసై

హైదరాబాద్, డిసెంబర్ 22:ఉన్నత విద్యలో తెలంగాణ రాష్ట్రం పురోగమన దిశగా పయనించడం శుభపరిణామం అని గవర్నర్ తమిళిసై అన్నారు. కొత్త రాష్ట్రమైనప్పటికీ ఉన్నత విద్యలో ఎంతో ముందున్నదని కితాబునిచ్చారు. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) అమలుకు రాష్ట్రాలు కేంద్రంతో సహకరించాలి. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న జాతీయ విద్యావిధానంపై రెండు రోజుల సదస్సును గవర్నర్ తమిళిసై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ, కరోనా వైరస్ వ్యాప్తి ఉన్న సమయంలో కూడా నిత్యం జాతీయ విద్యా విధానంపై అన్ని విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, విద్యావేత్తలతో ఆన్‌లైన్‌లో ఎన్నో అంశాలపై చర్చలు జరిపామని చెప్పారు. జాతీయ విద్యా విధానాన్ని అమలుచేయాల్సిన ఆవశ్యకతపై అన్ని వర్శిటీల వీసీలతో చర్చించినట్లు తెలిపారు.

తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలు ఎందుకో జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయడం గురించి సంకోచిస్తున్నాయని అనిపిస్తున్నదని గవర్నర్ తమిళిసై చెప్పారు. ఎన్ఈపీ అమలుకు సహకరించాలని యూనివర్శిటీల తరఫున రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరతామన్నారు. జాతీయ విద్యా విధానాన్ని హడావుడిగా, అసంపూర్ణంగా తీసుకొచ్చింది కాదన్నారు. పలువురు విద్యావేత్తలు, పరిశోధకుల అభిప్రాయాలు, అంశాలను పరిగణలోకి తీసుకున్నారని పేర్కొన్నారు. ఇదే సమయంలో వర్శిటీల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు జరుగాలని సూచించారు. అమ్మాయిల పెండ్లి వయసు 21 గా చేసినందుకు ఈ వేదిక ద్వారా కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు గవర్నర్ చెప్పారు.

కేంద్రమంత్రి గోయల్ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం : మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, డిసెంబర్ 22: కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌పై రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఫైర్ అయ్యారు. ధాన్యం కొనుగోలు అంశంపై కేంద్రంతో చర్చించేందుకు ఢిల్లీ వెళ్లిన మంత్రుల బృందాన్ని ఉద్దేశించి కేంద్రమంత్రి పీయూష్ గోయల్ చేసిన వ్యాఖ్యలపై బుధవారం మండిపడ్డారు. రాష్ట్ర మంత్రులను ఉద్దేశించి గోయల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకమన్నారు. కేంద్రమంత్రిగా కాకుండా రాజకీయ నాయకుడిలా మాట్లాడారని, రాష్ట్రంతో వ్యవహరించే తీరుగా ప్రవర్తించలేదన్నారు.

మంత్రులు 70లక్షల మంది రైతులు, నాలుగు కోట్ల మంది ప్రజల తరఫున ఢిల్లీకి వచ్చారని, వారిని కేంద్రమంత్రి మీకేం పని లేదా? అంటారా అని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలు యావత్ తెలంగాణ ప్రజానీకాన్ని అవమానించడం, 70లక్షల రైతు కుటుంబాల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే నన్నారు. వెంటనే పీయూష్ గోయల్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని, భేషరతు గా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

70లక్షల రైతు కుటుంబాలు ఆగమవుతున్నాయని, నిన్నగాక మొన్న బాయి ల్డ్ రైస్ కొనమని చెప్పారని, రేపు రా రైస్ కూడా కొనమని చెతులెత్తేస్తే మా రైతులు ఏం కావాలని ప్రశ్నించారు. ఓ వైపు రైతుల కళ్లాల వద్ద పడిగాపులు పడుతున్నారన్నారు. మారిచ్చిన 40లక్షల మెట్రిక్ టన్నుల కోటా పూర్తయ్యింది, ఆ తర్వాత కొంటరా కొనరా? అని అడిగేందుకు రైతుల బృందం ఢిల్లీకి వచ్చారన్నారు. ధాన్యం కొనుగోళ్లపై కేంద్రానికి అభ్యర్థన చేసేందుకు వచ్చిన రాష్ట్ర ప్రభుత్వ బృందాన్ని అవమానపరచడం సరికాదన్నారు.

రాజకీయం చేసింది కేంద్రమంత్రేనన్న ఆయన.. మూడు రోజులుగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున బృందం వస్తే కలిసేందుకు మీకు సమ ఓయం లేదా? అని హరీశ్‌రావు మండిపడ్డారు. మంత్రుల బృందాన్ని కలువకుండా.. స్థానిక బీజేపీ నేతలను ఢిల్లీకి పిలిపించుకొని సమావేశమయ్యేందుకు సమయం దొరికిందా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరఫున వచ్చిన బృందాన్ని మొదట కలుస్తారా.. లేదంటే రాజకీయ నేతలను, బీజేపీ నేతలు, కార్యకర్తలను కలిసి.. మాపై బురద జల్లే ప్రయత్నం చేస్తారా? అంటూ ప్రశ్నించారు.

మీరే రాజకీయం చేసుకుంటూ.. మమ్మల్ని రాజకీయం అంటారా? అన్నారు. రాష్ట్రమంత్రులను మీకేం పని లేదా? అని మాట్లాడుతారా.. ఇదో గౌరవ మంత్రి మాటాడే భాషేనా అంటూ కేంద్రమంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ఆరుగురు మంత్రులు వచ్చారంటే.. ఒక రాష్ట్రం తరఫున అత్యున్నత డెలిగేషన్ ఇంకా ఏమైనా ఉంటదా?.. ఎంత ప్రాధాన్యం ఉంటే వారు ఢిల్లీకి వస్తారన్నారు. 70లక్షల మంది రైతుల ఆత్మగౌరవం, ప్రయోజనాలు కాపాడడమే తమ ప్రాధాన్యమని, కేవలం రాజకీయమే మీ ప్రాధాన్యమని విమర్శించారు.

టీఆర్ఎస్ పార్టీ పుట్టుక తెలంగాణ జాతి, ప్రయోజనాల కోసమన్నారు. అనేక త్యాగాల పునాదుల మీద రాష్ట్రాన్ని సాధించామని, రాష్ట్రం రైతుల ప్రయోజనాల కంటే మాకేం ముఖ్యముంటుందని.. అందుకు ఢిల్లీకి వచ్చారన్నారు. మీకు (కేంద్రం) మాత్రం రాజకీయాలే ముఖ్యమ న్నారు. మాట తప్పింది, మాట మార్చింది.. రాజకీయం చేస్తూనే తమపై నిందలు వేస్తున్నారన్నారు.

భేషరతుగా ప్రజలకు క్షమాపణ చెప్పాలి

ఒక ఓటు రెండు రాష్ట్రాలని మధ్యలోనే వదిలిపెట్టిన పార్టీ బీజేపీ అన్నారు. కాకినాడ తీర్మానం చేసి ఢిల్లీలోకి అధికారం చేపట్టగానే మోసం చేసింది మీరు కాదా? అన్నారు. కేసీఆర్ చచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అని ఆమరణ దీక్ష చేపట్టి.. చావు దగ్గర వరకు వెళ్లి తెలంగాణ సాధించిన ఘనత కేసీఆర్, టీఆర్ఎస్ పార్టీదన్నారు.

హయత్‌నగర్‌లో ఒమిక్రాన్ కలకలం.. ఒకరికి నిర్ధారణ

హైదరాబాద్, డిసెంబర్ 22: రాష్ట్రంలో మరో ఒమిక్రాన్ పాజిటివ్ కేసు నమోదైంది. నగరంలోని హయత్‌నగర్‌లో 23 ఏండ్ల యువకుడికి ఒమిక్రాన్ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు వైద్యారోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. దీంతో తెలంగాణలో ఒమిక్రాన్ పాజిటివ్ కేసుల సంఖ్య 25కు చేరింది. హయత్‌నగర్‌కు చెందిన యువకుడు ఇటీవలే సూడాన్ నుంచి హైదరాబాద్‌కు వచ్చాడు. ఒమిక్రాన్ సోకిన యువకుడిని అధికారులు గచ్చిబౌలి టిమ్స్‌కు తరలించారు. ఈ యువకుడి కాంటాక్ట్‌లను గుర్తించి శాంపిళ్లను ఆరోగ్య శాఖ అధికారులు సేకరిస్తున్నారు.

పుస్తకం చదివే అలవాటు కాపాడుకోవాలి-కె. శ్రీనివాస్

డిజిటల్ మాధ్యమాలతో బ్రిటీష్ లైబ్రరీ వంటి పెద్ద గ్రంథాలయాల సమాచారం సైతం అరచేతిలోకి వచ్చిందని, పుస్తకం చదివే అలవాటు కాపాడుకోవాలని ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, ప్రభుత్వ సిటీ కళాశాల గ్రంథాలయ విభాగం సంయుక్తంగా మంగళవారం బుక్‌ఫెయిర్‌లోని చిందు ఎల్లమ్మ వేదికపై "సామాజిక మాధ్యమాల ఉద్భవి–అధ్యయన ఆవశ్యకత' అంశంపై జరిగిన సదస్సులో పాల్గొని మాట్లాడారు.

మానవజాతి సంస్కృతి, వికాసంతో తరతరాలుగా పెనవేసుకున్న ఆధారం, ఆది పుస్తకమని తెలంగాణ గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు అయాచితం శ్రీధర్ అన్నారు. సామాజిక మాధ్యమాల్లోని సమాచారం హోటల్ భోజనం లాంటిదైతే, పుస్తకం అమ్మ భోజనం వంటిదని అభివర్ణించారు.

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ పుస్తక ప్రదర్శనను సామాజిక మాధ్యమాల ద్వారా జనబాహుళ్యంలోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ సోషల్ మీడియా పొలిటికల్ మీడియాగా మారిందని ఆక్షేపించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ సభాధ్యక్షత వహించగా, సిటీ కాలేజీ అధ్యాపకులు కోయి కోటేశ్వరరావు, నీరజ, చేగొని రవికుమార్ పాల్గొన్నారు.

తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్‌గా ఈ రోజు బాధ్యతలు చేపట్టిన జూలూరి గౌరీశంకర్‌ను అభినందిస్తున్న కోట్ల వెంకటేశ్వర రెడ్డి, కె. లక్ష్మణ్‌గౌడ్, బండి సాయన్న.

130 ఏండ్ల చరిత్ర గల నిజాం కాలేజీ ఇటీవల తమ విద్యార్థులకు ఏటా కాన్వొకేషన్ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా గా సాహితీవేత్తల పారిశ్రామికవేత్తలను గోల్డ్ మెడల్ విద్యార్థులకు చేయడానికి విరాళాలు ఆహ్వానించారు. ఒక లక్ష రూపాయలు విరాళం ఇస్తే అది డిపాజిట్ చేసి విద్యార్థులకు దాని పై వచ్చే వడ్డీతో గోల్డ్ మెడల్ తో సత్కరిస్తారు. విరాళ దాతలను ప్రత్యేకంగా ఆహ్వానిస్తారు. అందుకు స్పందించి సామాజిక తత్వవేత్త బి.ఎస్.రాములు ఒక లక్ష రూపాయలు అందజేశారు. అలాగే సుప్రసిద్ధ రచయిత గూడూరి సీతారాం గారి పేరిట వారి కుమారుడు గూడూరు వేణు గారు ఒక లక్ష రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా అభినందిస్తూ ప్రిన్సిపాల్ గారు వారికి పుష్ప గుచ్ఛం అందచేశారు

సిరిసిల్లలో "బాల రసాలం" కావ్యపరిచయ కార్యక్రమం

సిరిసిల్ల జిల్లా గ్రంథాలయంలో అధ్యక్షులైన శ్రీ ఆకునూరి శంకరయ్య ఆధ్వర్యంలో ప్రముఖ కవి డా॥ పడ్డేపల్లి కృష్ణ రచించిన 'బాల రసాలం" (బాల గేయాల సంపుటి) కావ్య పరిచయ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జనపాల శంకరయ్య, బాల సాహితీవేత్త శ్రీమతి కందేపి రాణీప్రసాద్, స్థానిక కవుమూర దేవానంద్, కోడం నారాయణ, కోడం నారాయణ, తిప్పర్తి రమేశ్ ప్రభృతులు .

విజ్ఞాన వ్యాప్తిలో గ్రంథాల పాత్ర ప్రధానం - డా. అయాచితం శ్రీధర్

'వ్యాస గవాక్షం' వ్యాస సంకలనం ఆవిష్కరణ సభలో డా॥ సీతాలక్ష్మి, సి. సీతారాంబాబు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు అధ్యక్షులు డా॥ అయాచితం శ్రీధర్, ఆచార్య చెన్నకేశవరెడ్డి, ఆవిష్కర్త తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు డా॥నందిని సిధారెడ్డి, డా॥ రాయారావు సూర్యప్రకాశ్‌రావు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠశాల విద్య, పూర్వ అదనపు సంచాలకులు పి. లక్ష్మారెడ్డి.

విజ్ఞానాన్ని వ్యాప్తి చేయడంలో గ్రంథాల పాత్ర ప్రధానమైందని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయపరిషత్తు అధ్యక్షులు డా. అయాచితం శ్రీధర్ అన్నారు. మంగళవారం హైదరాబాదులోని రవీంద్రభారతిలో ప్రముఖ రచయిత డా. రాయారావు సూర్యప్రకాశ్ రావు రచించిన వ్యాసాల సంకలనం 'వ్యాస గవాక్షం' ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రచయితలు సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. సాహిత్యాన్ని ఎప్పటికప్పుడు తాజా పరిణామాలతో రికార్డు చేయడంలో రచయిత రాయారావు సూర్యప్రకాశ్ రావు ముందు వరుసలో ఉంటారని అయాచితం శ్రీధర్ ప్రశంసించారు. వర్తమాన సాహితీ ప్రపంచంలో వ్యాస మహర్షిగా సూర్యప్రకాశ్ రావును చెప్పుకోవచ్చని ఆయన అన్నారు.

రాయారావు సూర్యప్రకాశ్ రావు విస్తృత సమాచారాన్ని కలిగి ఉండడమే కాకుండా పరనీయ లక్షణాన్ని కలిగిఉంటాయని గ్రంథాన్ని ఆవిష్కరించిన తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు డా. నందిని సిధారెడ్డి అభిప్రాయపడ్డారు.

చాలామందికి తెలియని అనేక అంశాలు 'వ్యాస గవాక్షం' గ్రంథంలో పొందుపర్చారని ఆయన పేర్కొన్నారు. లోతైన సమాచారం, విశ్లేషణ, స్పష్టమైన వాక్య నిర్మాణం పాఠకుడిని చదివిస్తాయని ఆయన అన్నారు. కాంపిటీటివ్ పరీక్షలు రాసే అభ్యర్థులకు ఉపయుక్తమయ్యే సమాచారం ఈ గ్రంథంలో ఉందని డా. సిధారెడ్డి చెప్పారు. వ్యాసాలతో పాటు కవిత్వం, అనువా దం వంటి ఇతర ప్రక్రియల్లోనూ రాయారావు సూర్యప్రకాశ్ రావు రాణిస్తున్నా రని ఆకాశవాణి వివిధభారతి వాణిజ్య ప్రసార విభాగ పూర్వ అధిపతి చెన్నూరి సీతారాంబాబు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' ను సులభ గ్రాహ్యమయ్యే విధంగా తెలుగులో సూర్యప్రకాశ్ రావు అందిస్తున్నారని ఆయన ప్రశంసించారు. వ్యాసాలను ఆసక్తికరంగా మలచడంలో రాయారావు సూర్యప్రకాశ్ రావు ప్రత్యేకత కనబరుస్తారని సభకు అధ్యక్షత వహించిన తెలుగు విశ్వవిద్యాలయ పూర్వ ఆచార్యులు, ప్రముఖ కవి డా. చెన్నకేశవరెడ్డి అభిప్రాయపడ్డారు. వ్యాస శీర్షికలను కూడా విభిన్నంగా పెట్టడం ఈ వ్యాసాలలో కనబడుతుందని ఆయన చెప్పారు. రచయితలకు సామాజిక దృక్కోణం తప్పనిసరిగా ఉండవలసిన లక్షణమని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠశాల విద్య పూర్వ అదనపు సంచాలకులు పి. లక్ష్మారెడ్డి అన్నారు. ఈ లక్షణం సూర్యప్రకాశ్ వ్యాసా లలో కనబడుతుందని ఆయన పేర్కొన్నారు. జిజ్ఞాసువులైన పాఠకులకు ఈ గ్రంథం చాలా ఉపకరిస్తుందని ఆయన చెప్పారు.

పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు అవసరమైన సమాచారాన్ని ఈ గ్రంథం ద్వారా అందజేశారని లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. తాను పాఠశాల దశ నుండే సృజనాత్మక రచనలు చేస్తున్నానని ఈ సమావేశంలో ప్రసంగించిన 'దర్పణం' సాహిత్యవేదిక అధ్యక్షులు డా. రాయారావు సూర్యప్రకాశ్ రావు అన్నారు.

సాహిత్యంలో విశేష కృషి చేసిన సాహితీ మూర్తుల రచనల విశ్లేషణ 'వ్యాస గవాక్షం'లో కన్పిస్తుందని ఆయన పేర్కొన్నారు. 'దర్పణం' సాహిత్య వేదిక ప్రధాన కార్యదర్శి డా. చీదెళ్ల సీతాలక్ష్మి సమావేశకర్తగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాహిత్యవేదిక సభ్యులు రామకృష్ణ చంద్రమౌళి, గుండం మోహన్ రెడ్డి, నక్క హరికృష్ణ, సంతోష్, డా. కావూరి శ్రీనివాస్, సత్యమూర్తి, నారాయణరావు, అరుణజ్యోతి తదితరులు కార్యక్రమ నిర్వహణలో భాగస్వాములుగా పాల్గొన్నారు. ప్రముఖ రచయితలు ఆచార్య వెలుదండ నిత్యానంద రావు, డా.జె. చెన్నయ్య, డా. గుమ్మన్నగారి బాల శ్రీనివాసమూర్తి, ఉద్దిరాజు ప్రవీణ్ కుమార్, కందుకూరి శ్రీరాములు, తూర్పు మల్లారెడ్డి తదితరులు సభకు హాజరయ్యారు

గూడు వదిలిన 'సాహితీ' గువ్వ - ఎస్ ఆర్.భల్లం ఇకలేరు...

ప్రముఖ కవి, సాహితీ విమర్శకుడు, వ్యాసకర్త, కాలమిస్టు, తొలి నానీ ప్రక్రియ ప్రచారకుడు ఎస్.ఆర్.భల్లం మంగళవారం ఉదయం 4 గంటలకు హైదరాబాద్‌లోని ఒక ప్రవేటు హాస్పిటల్‌లో బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎస్.ఆర్.భల్లంగా తెలుగు సాహిత్యరంగంలో ప్రసిద్ధులైన భల్లం పూర్తి పేరు భల్లం సూర్యనారాయణ రాజు. పశ్చిమగోదావరి జిల్లా పోడూరు గ్రామంలో 1959 జూన్ 1న జన్మించారు. వృత్తిరీత్యా జిల్లాపరిషత్ ఉన్నత పాఠాశాలలో తెలుగు పండితులుగా పనిచేసి పదవీ విరమణ చేసారు. తన తుది శ్వాస విడిచేవరకూ నేటినిజం, ఆదివారం వార్త అనుబంధం, దిక్సూచి వంటి పలు పత్రికలలో తెలుగు భాషకు సంబంధించిన పలు వ్యాసాలు రాస్తూ వచ్చారు. నీటిభూమి, గూడు వదిలిన గువ్వలు, చిగురుకేక, కొల్లేరు, గోపి నానీల సమాలోచనం, జ్ఞానదర్శిని, భట్రాజుల చరిత్ర, శ్రీదేవి మహంకాళమ్మ వారి పుణ్యచరిత్ర స్థల చరిత్ర, ర్యాగింగ్ భూతం, వేకువ పిట్ట వంటి పలు పుస్తకాలు రచించారు. అద్దేపల్లి సాహిత్యంపై పరిశోధకునిగా, నానీల ప్రక్రియ పరివ్యాప్తకునిగా, సి.నా.రె సాహిత్య ఉపన్యాసకునిగా 'గల్లీ నుండి ఢిల్లి దాకా' వంటి పలు ఉపన్యాసాలిచ్చి రికార్డు సృష్టించారు. 'గూడు వదిలిని గువ్వలు' నానీల సంపుటి వెలవరించడం ద్వారా నానీ ప్రక్రియ (తొలి సంపుటి) వారసుడిగా రికార్డు నమోదు చేసుకున్నారు. వర్ధమాన కవులను వెన్నుతట్టి ప్రోత్సహించడంలో సిద్ధహస్తులు. ఎందరో కవులకు తన ముందుమాట రాసిచ్చి ప్రోత్సహించడంలో ముందున్నారు. 'జనత గుండెల్లోన నిదుర లేచిన నవత' వీరి తొలి కవిత ఆంధ్రపత్రికలో ప్రచురితమైనది. ఆ తర్వాత వివిధ పత్రికలలో, రేడియో, దూరదర్శన్‌లలో అనేక కవితలు, పాటలు, గజల్స్ ప్రసారమైనాయి. వీరి చేసిన సాహితీ సేవకు మచిలీపట్నంలోని ఆంధ్రసారస్వత సమితి, తాడేపల్లిగూడెం తెలుగుసాహితీ సమాఖ్య, విజయవాడ 'ఎక్స్‌రే', హైదరాబాద్‌లోని 'రంజని'ల నుండి ఉత్తమ కవితా పురస్కారాలు అందుకున్నారు. ఢిల్లీ తెలుగు అకాడమీ పురస్కారం, ముంబాయి ఆంధ్ర మహాసభ పురస్కారం, విశ్వకవి కవితా పురస్కారం, 2004లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, కిన్నెర ఆర్ట్ థియేటర్స్, సమైక్యభారతి పురస్కారాలు వంటి ఎన్నో మరెన్నో అందుకున్నారు.

గల్లీ నుండి ఢిల్లీ దాకా: చిన్న వయస్సులో తాత గారి ఊరైన కొల్లేరు ప్రాంతంలోని గోకర్ణపురం వెళ్ళినప్పుడు 'దాలిబూచి అనే డెబ్బై ఏళ్ళ వ్యక్తి తారసపడి– 'సినారె' 'ఉదయం నా హృదయం' పుస్తకాన్ని గురించి చెప్పమన్నప్పుడు సినారె గురించి తనకు తెలిసినదంతా చెప్పడంతో ఆ వ్యక్తి సంతోషించి భల్లంను తన సైకిల్‌పై ఎక్కించుకొని చుట్టు ప్రక్కల గ్రామాలన్నీ తిప్పుతూ సినారెపై ఉపన్యాసాలిప్పిచ్చారట. ఆ సమయంలో భల్లం తండ్రిగారు సినారెపై నూరు ఉపన్యాసాలిప్పిస్తే రికార్డుగా ఉంటుందని చెప్పడంతో ఆమాటను స్ఫూర్తిగా తీసుకొని భల్లం సినారెపై 100 ఉపన్యాసాలిచ్చారు. 25వ ఉపన్యాసం విజయవాడలో, 50వ ఉపన్యాసం విశాఖపట్నంలో, 75వ ఉపన్యాసం హైదరాబాద్ రవీంద్రభారతిలో, 100 ఉపన్యాసం ఢిల్లీలో చేసి రికార్డు సృష్టించారు. దీనితో జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా॥ సి.నారాయణరెడ్డితో ఆయనకు ప్రత్యేక అనుబంధ ఏర్పడింది.

నానీ ప్రక్రియ పరివ్యాప్తకులుగా: నానీల ప్రక్రియ సృష్టకర్త ఆచార్య ఎన్.గోపి తరువాత నానీల పుస్తకం 'గూడు వదిలిని గువ్వలు' పేరుతో నానీల సంపుటి వెలువరడం ద్వారా నానీ ప్రక్రియ తొలి వారసుడైనారు ఎస్.ఆర్.భల్లం. అనేక కొత్త కవుల్ని నానీలు రాయడానికి ప్రేరేపించి నానీ ప్రక్రియ చిన్నాన్నగా, నానీ ప్రక్రియకు ప్రచారకుడిగా ప్రఖ్యాత గాంచారు.

సంతాపం: ఎస్.ఆర్.భల్లం మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే ఆయన సాహితీ అభిమానులెందరో ఆయన మృతికి ఫేస్‌బుక్, సోషల్ మాధ్యమాల ద్వారా నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమేపల్లి వెంకట సుబ్బయ్య, చలపాక ప్రకాష్, రచయిత లంకా వెంకటేశ్వర్లు తదితరులు తాడేపల్లిగూడెంలోని భల్లం స్వగృహానికెళ్ళి ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. భల్లం మరణవార్త తెలిసిన వెంటనే ఆచార్య ఎన్.గోపి, నేటినిజం సంపాదకులు బైస దేవదాస్, డా॥నాళేశ్వరం శంకరం, శైలజామిత్ర, కందుకూరి శ్రీరాములు, అరసం నాయకులు పెనుగొండ లక్ష్మీనారాయణ, కవులు అశోక్‌కుమార్, అమ్మిన శ్రీనివాసరాజు, శిఖామణి, కరీంనగర్ వైరాగ్యం ప్రభాకర్, రాధేయ, ఆశారాజు, దాస్యం సేనాధిపతి, రాసాని, కొల్లూరి, శిలాలోలిత, గబ్బిట దుర్గాప్రసాద్, తలతోటి పృథ్వీరాజ్, అంబల్ల జనార్ధన్, పొన్నూరు వేంకట శ్రీనివాసులు, పి.లక్ష్మణ్‌రావు, పాలపర్తి శ్యామలానంద్రప్రసాద్, హనీఫ్, ఎస్.ఆర్.పృథ్వి, శరత్‌చంద్ర, గాదిరాజు రంగరాజు, కొత్తపల్లి మణిత్రినాథరాజు తదితర కవులు, పత్రికా సంపాదకులు, పలు సాహిత్యసంఘాలు తమ సంతాపం వ్యక్తం చేసారు.

– చలపాక ప్రకాష్

భల్లంతో చివరి మాట...

అది డిసెంబర్ 11, ఈ వారం వ్యాసంకు టైటిల్ పెట్టడం మరిచినట్టున్నారు అనగానే "మహాశయాయ పొరపాటు జరిగింది మన్నించాలి" అంటూ ఎంతో నెమ్మదిగా మాట్లాడుతుంటే "ఆరోగ్యం బాగాలేదా అన్న ప్రశ్నకు" హార్ట్ ప్రాబ్లం వచ్చింది రెండు రోజుల్లో బైపాస్ సర్జరీ వుందన్నారు. ఇక రెండు వారాలు నాకు విశ్రాంతే! ఆ తర్వాతే మళ్ళీ వ్యాసం పంపుతా నన్న మాటే చివరిదయ్యింది.

ఎన్నో ఏళ్ళ తర్వాత 'నేటినిజం'లో కాలం రాస్తాను అవకాశం ఇవ్వరాదు అని అడగడం అందుకు నేను సరే అనడం మరుసటి రోజే క్రమం తప్ప కుండా వారం రోజుల ముందే వ్యాసం పంపడం ప్రచురించడం జరుగుతూ వుంది. 'భల్ల

నేటినిజం
సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 23-12-2021

నేటికవిత-కవిత్వ విశ్లేషణ

-శ్రీదాన్యం లక్ష్మణ్
అసిస్టెంట్, నేటికవిత
9440155240

నేటికవితలో ఈ వారం: **'నిండా మునిగాక'** అనే అంశంపై వచ్చిన కవితల్లోంచి ఓ మూడు కవితలపై విశ్లేషణ

-దాన్యం సేనాధిపతి
కవిత్వ విశ్లేషకులు
9440525544

అంతా అయిపోయాక

చీకటిదుప్పటిని ఒంటినిండా కప్పుకొని
నైరాశ్యపు ఆలోచనా తీగలను చుట్టుకొని
వేకువ వేదాంతాన్ని వల్లెవేస్తున్న
నిర్వేదాన్ని పఠిస్తూ గడిచిన నాలుగురోజుల
గతాన్ని నెమరువేస్తూ బ్రతుకును సాగదీస్తున్న
నిరాశ నిస్పృహల కోలాహలంలో
నడిచిపోయిన గతం దూరమెంతో కొలుస్తున్న
మనసును కడిగి శుద్ధి చేసుకుందామంటే
గడిచిన రోజులు వచ్చి
వెక్కిరించి వెళ్లిపోతున్నాయి
గమ్యం చేరలేని ప్రయాణం గతి తప్పి
గోతిలోపడితే
మన చేతిలో ఏముందని పైకిచూసి
దండం పెట్టడమే ధ్యని
కాలాన్ని నమ్ముకున్న కర్షకుడికి
కొనేవారులేక చతికిల పడ్డ జీవనం
నీళ్ళు లేకుండానే నిండా మునిగిన వానికి
చెరువులో నీళ్లు
చెదిరిన బ్రతుకులకు వూరట
అన్ని ఎదురుగా వుండగానే
వైరాగ్యాన్ని పొందిన
మనసుకు సుఖశాంతులెక్కడివి
వొళ్లంతా తడిసేక గొడుగెందుకు
ఉన్నది నీటిలో మునిగాక
పడవెందుకు!?

-కందుకూరి మనోహర్
మల్కాజ్‌గిరి

మల్కాజ్‌గిరికి చెందిన కవి కందుకూరి మనోహర్ గారు నిండామునిగాక అంశంపై అంతా అయిపోయాక శీర్షికతో రాసిన కవితలో అన్నీ ఎదురుగా ఉండగానే వైరాగ్యాన్ని పొందిన మనసుకు సుఖశాంతులుండవని.. వొళ్ళంతా తడిసి పోయాక గొడుగు అవసరం ఉండదని..పేర్కొంటూ.. తమ భావాలను వస్తువు వెలుగులో ప్రకటించే ప్రయత్నం చేశారు. కవి కందుకూరి మనోహర్ గారు ఎత్తుగడలోనే.. తాత్త్వికను ప్రదర్శిస్తూ వైరాగ్యంతో నైరాశ్యాన్ని అక్షరాల్లో ఆవిష్కృతం చేశారు. చక్కని భావుకతతో... ప్రారంభపంక్తులను రాసి కవితను చదవాలన్న ఆసక్తిని పాఠకుల్లో పెంచారు. చీకటి దుప్పటిని ఒంటినిండా కప్పుకుని.. నైరాశ్యపు ఆలోచనాతీగలను చుట్టుకుని వేకువ వేదాంతాన్ని వల్లె వేస్తున్నానంటూ కవితను ప్రారంభించారు. చీకటి దుప్పటి... నైరాశ్యపు ఆలోచనా తీగలు.. వేకువ వేదాంతం వంటి పదబంధాలను ప్రయోగించి కవితా వస్తువుకు పుష్టిని చేకూర్చారు. నిర్వేదాన్ని పఠిస్తూ.. గడిచిన నాలుగు రోజుల గతాన్ని నెమరువేస్తూ బ్రతుకును నిరాశ నిస్పృహల కోలాహలంలో సాగదీస్తున్నానని కవి కొనసాగించారు. గతించిన కాలాన్ని కొలుస్తూ మనసును కడిడి శుద్ధి చేసుకుందామంటే.. గడిచిన రోజులు వెక్కిరించి వెళ్లిపోతున్నాయని వాపోయారు.

అంతా అయిపోయి.. గమ్యం చేరలేని ప్రయాణం గతితప్పి గోతిలో పడ్డప్పుడు.. ఇంకా మన చేతిలో ఏముంటుంది? ఫలితాన్ని అనుభవించడం లేదా పైకి చూసి భగవంతుని తలచుకోవడమే శరణ్యమన్న అర్థం ధ్వనించేలా కవి మనోహర్ గారు కవితను కొనసాగించిన తీరుబాగుంది. కాలాన్ని నమ్ముకున్న రైతన్న ఆశలు అడియాసలైనప్పుడు పొందే వేదనను కవి తమ కవిత ద్వారా గుర్తుచేసే ప్రయత్నం చేశారు. విధి చేతిలో బలయ్యాక పరిస్థితులను ఎదుర్కోవడం తప్ప చక్కదిద్దేందుకు అవకాశముండదన్న సంగతిని ప్రస్తావించారు. నీళ్లులేకుండా నిండా మునిగినవానికి చెరువులో నీళ్లు చెదిరిన బ్రతుకులకు ఊరట అని వ్యాఖ్యానించడంలో కవియొక్క ఔచిత్యాన్ని గ్రహించగలం. అన్నీ ఎదురుగా ఉండగానే వైరాగ్యాన్ని పొందిన మనసుకు సుఖశాంతులుండవని కవి మనోహర్ గారు తేల్చిచెప్పారు. వొళ్లంతా తడిసేక గొడుగెందుకు? ఉన్నది నీటిలో మునిగాక పడవ ఎందుకు? అంటూ ప్రశ్నిస్తూ కవితను ముగించారు. ఆర్ద్రమైన భావాలకు చోటు కల్పిస్తూ అంశాన్ని కవితామయం చేయడంలో కవి సఫలీకృతులైనారు.

అయినా లేచి గెలవాలి

చిరునవ్వుల మల్లెలను
మాలకట్టి జడలో తురుముకుని
వయ్యారంగా అటుఇటు
తిరుగాడాలని ఉంది.
నక్షత్రాలను దింపి దండకుచ్చి
కంఠమునలంకరించుకుని
అందమంతా నాదేనని
గర్వంగా చూడాలని ఉంది.
అరుణోదయ సూర్యబింబాన్ని
వేలితో పట్టుకొని నుదుటన
సిందూరంగా ధరించి
ఆనందించాలని ఉంది.
ఎన్నెన్నో కోరికల గుర్రాలు
ఆశల తీరాలు చేరాలని
పరుగుతిడుతున్న దానికి
పగ్గాలేసి వెనక్కి లాగాను కానీ
ఏదీ కలిసిరాక కోరికల పల్లకీ ఎక్కలేక
నిరాశాసంద్రపు నీటిలో నిండా మునిగిపోయి
బయటకు రాలేక
తలమునకలు అవుతున్నాను.
నిండా మునిగిఉన్న నాకు
చలి లేదేమో కానీ
గుండెనిండా వేడి ఉంది
తేలి బయటకు రావాలని ఉంది.
పడిలేచిన కెరటం నాకాదర్శం
మళ్లీమళ్లీ ప్రయత్నించి
గోడ ఎక్కిన చీమలు నాకు ఆదర్శం
అవే నాకు చూపే మార్గదర్శనం.
ఒప్పుకోను ఎప్పుడూ ఓటమి
నిండా మునిగానని బెదరక
వెళతాను ధైర్యంగా గెలుపు
తలుపులు తెరచుకొని
పలుకుతాను స్వాగతమని
నాకెదురైన గొప్ప విజయానికి

-రమాదేవి
బుక్కపట్నం దిల్‌సుక్‌నగర్,
హైదరాబాద్.

హైదరాబాదుకు చెందిన కవయిత్రి రమాదేవి బుక్కపట్నం గారు నిండామునిగాక అంశంపై అయినా లేచి గెలవాలి శీర్షికతో రాసిన కవితలో ఆమె యొక్క ఆశావహదృక్పథాన్ని చూడగలం.. సమస్యల వలయంలో చిక్కుకున్నప్పుడు వాటి నుండి బయటపడే మార్గాన్ని అన్వేషించి పరిష్కరించుకోవాలే తప్ప నిరాశా నిస్పృహలకు లోను కావద్దన్న అర్థం ధ్వనించేలా కవితను తీర్చిదిద్దారు. అలతి అలతిద పదాలతో చక్కని శైలిలో అద్భుతమైన భావాలకు చోటుకల్పిస్తూ తమ ఆలోచనలను అంశం వెలుగులో అభివ్యక్తీకరించారు.

చిరునవ్వుల మల్లెలను మాలకట్టి జడలో తురుముకుని .. వయ్యారంగా అటుఇటు తిరుగాడాలని ఉందంటూ ప్రారంభించిన తీరు బాగుంది. కవయిత్రి తమ అంతరంగంలో కదలాడే ఆలోచనలకు ఆకాంక్షలకు అక్షరరూపమిస్తూ కొనసాగించారు. నక్షత్రాలను దింపి దండకుచ్చి కంఠమునలంకరించుకుని అదంతా నాదేనని గర్వంగా చూడాలని ఉందని పేర్కొన్నారు. అరుణోదయ బింబాన్ని వేలితో పట్టుకుని నుదుటన సిందూరంగా ధరించాలని ఉందని ఆకాంక్షించారు.

ఎన్నెన్నో కోరికల గుర్రాలు ఆశల తీరాలు చేరాలని పరుగులిడుతున్న దానికి పగ్గాలేసి వెనక్కిలాగాను కానీ ఏదీ కలిసిరాక.. కోరికల పల్లకీ ఎక్కలేక.. నిరాశాసంద్రపు నీటిలో నిండా మునిగిపోయి బయటికి రాలేక తలమునకలవుతున్నానని ఆవేదనను ప్రకటించారు. నిండా మునిగివున్నానాకు చలిలేదేమో కానీ గుండెనిండా గెలవాలన్న వేడి ఉందనీ..బయటకు రావాలని ఉందని చెప్పడం బాగుంది. పడిలేచిన కెరటం నాకాదర్శం మళ్ళీ మళ్లీ ప్రయత్నించి గోడ ఎక్కిన చీమలు ఆదర్శం.. అవే నాకు చూపే మార్గదర్శనం అంటూ కొనసాగించారు.

కష్టాలెన్ని వచ్చినా వాటిని సమయస్ఫూర్తితో పరిష్కరించుకోవాలే తప్ప నిరాశకు గురికావద్దన్న అర్థం ధ్వనించే విధంగా అంశం వెలుగులో తమ కవితను ఓ ఆశావహదృక్పథంతో ముగించి మంచి సందేశాన్ని అందించారు. ఎప్పుడూ ఓటమిని ఒప్పుకోవద్దనీ.. నిండామునిగాక అసలే బెదరవద్దనీ.. ధైర్యంగా గెలుపు తలుపులు తట్టేందుకు యత్నించాలని హితవుపలికారు. నిరాశా నిస్పృహలకు అసలే తావివ్వక మొక్కవోని ధైర్యంతో ప్రతికూల పరిస్థితులను అనుకూలంగా మలుకోవాలన్న కవయిత్రి ఆలోచనలు అభినందనీయంగా ఉన్నాయి. ముమ్ముందు కవయిత్రి రమాదేవి గారి కలం నుండి మరింత గాఢమైన కవిత్వం జాలువారగలదన్న విశ్వాసం ఉంది.

భయమెందుకు...?

ఎప్పుడో మునిగిపోయాను
కర్తవ్యపు సముద్రంలోనికి
రత్నాలు, వజ్రవైఢూర్యాలు వెదుక్కుంటూ
అలా..అలా.. లోలోతులకు
పోతూనే ఉన్నాను....
ఎదో తృష్ణ.. తనివి తీరని తృష్ణ..
బయటికి రావాలనిపించదు..
శోధిస్తూ.. శోధిస్తూ..
అగాథపు అంచులు తాకి
ఆణిముత్యాలను దోసిళ్లనిండా నింపుకొని
జగతినిండా వెదజల్లాలని
కెరటాలై ఎగిసిపడే ఆశలు
అలసిన ప్రతిసారీ..
విజయాలు తమ చల్లని ఒడిలో సేదదీర్చి
మాతనోత్సాహపు జోలపాటపాడతాయి..!
సరికొత్త చరితకు శ్రీకారం చుట్టమని
చెప్పకనే చెబుతాయి

-కాసర లక్ష్మీ సరోజారెడ్డి
జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెంకు చెందిన కవయిత్రి కాసర లక్ష్మీ సరోజారెడ్డి గారు నిండామునిగాక అంశంపై భయమెందుకు? శీర్షికతో రాసిన కవిత ఆద్యంతం కవితాత్మకంగా మలచబడింది. విధి నిర్వహణలో అనేక ఆటుపోటులను ఎదుర్కొంటూ ఎప్పుడో కర్తవ్య సంద్రంలో మునిగిపోయాను అంటూ ప్రారంభించారు.. రత్నాలు.. వజ్రవైఢూర్యాలు వెదుక్కుంటూ అలా అలా లోలోతులకు పోతూనే ఉన్నానని, ఏదో తృష్ణ తనివి తీరని తృష్ణ మనసును ఆవహించినప్పుడు నిండా కోరికల సంద్రంలో మునిగి బయటకు రావాలనిపించదంటూ ప్రారంభించారు. నర్మగర్భంగా కవయిత్రి సరోజారెడ్డిగారు కర్తవ్యపాలనలో.. సంపాదన పల్లకీలో ఊరేగుతున్నప్పుడు ..ఇంకా ఇంకా ఆర్జించాలన్న ఆలోచనే తప్ప .. మరో ధ్యాస ఉండదన్నఅర్థం ధ్వనించే విధంగా తమ భావాలను ప్రకటించే ప్రయత్నం చేశారు.

కోరికల సంద్రంలో మునిగాక.. శోధిస్తూ.. శోధిస్తూ అగాథపు అంచులు తాకి.. ఆణిముత్యాలను దోసిళ్ల నిండా నింపుకుని జగతినిండా వెదజల్లాలన్న తపన ఉంటుందన్న వాస్తవాన్ని గుర్తుచేసిన తీరు బాగుంది. మనిషి ఆలోచనలకు అంతు ఉండదనీ, ఆశలకు ఆకాశమే హద్దు అనీ.. సంపాదన మాయలో పూర్తిగా చిక్కుకున్నాక ఇంకా ఇంకా సంపాదించాలన్న తృష్ణే తప్ప మరొకటి ఉండదన్న అర్థం వచ్చే విధంగా కవయిత్రి సరోజారెడ్డిగారు తమ కవితను కొనసాగించారు. అలసిన ప్రతీసారి ఎగిసిపడే ఆశా కెరటాలకు విజయాలు తమ చల్లని ఒడిలో సేదదీర్చి నూతనోత్సాహపు జోలపాడుతాయని సరికొత్త చేరికకు శ్రీకారం చుట్టమని చెప్పకనే చెబుతాయని చక్కగా ముగించారు. కవయిత్రి లక్ష్మీసరోజారెడ్డి గారు కవితావస్తువును కవితాత్మకంగా ప్రకటించడానికి చేసిన కృషి అభినందనీయంగా ఉంది. శిల్పం విషయంలో చతురతను ప్రదర్శించారు. అభివ్యక్తిలో విలక్షణతను పాటించారు. సంక్షిప్తంగా గుప్తంగా తమ భావాలను అంశం వెలుగులో ఆవిష్కరించడానికి ప్రయోగించిన పదబంధాలు కవితలో చక్కగా ఒదిగిపోయాయి. ఆ చిన్ని చిన్ని పదాలతో కవితను అందంగా మలచడంలో కవయిత్రి సఫలీకృతులైనారు. నిండామునిగాక భయమెందుకు? అంటూ ప్రశ్నిస్తూ.. సమస్యల సంద్రం నుండి బయటపడేందుకు కృషిచేయాలన్న అర్థం వచ్చేలా తమ కవితను తీర్చిదిద్దారు.

ఘంటారవం

కోల్పోయిన బంధాల కోసం
కన్నీరు కారిస్తే ఎలా?
కొనసాగుతున్న బంధాలైనా
కల్మషం కాకూడదు కదా.
ఒక్క నీటి చుక్క
మొక్కల్ని మొలిపిస్తుంది
ఒక్క నింగిచుక్క
దిక్కుల్ని వెలిగిస్తుంది.
అనుమానాల భారాలు
అనైక్యతా దూరాలు
విశ్వాసాల ఆశ్వాసాలు
ఉచ్ఛ్వాస నిశ్వాసాలు.

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

వివిధ తరాల.. వాదాల.. కవితా రూపాల 'పరంపర'

తెలంగాణ సాహిత్య మూలాలను అన్వేషించడం, పదిలపరచడం, భవిష్యత్తరాలకు అందించడం, సృజనాత్మక ప్రతిభను తీర్చిదిద్దడం, విస్మరణకు గురైన సాహిత్యాన్ని వెలుగులోకి తేవడం మరియు తెలంగాణ ప్రతిభా నైపుణ్యాలను ఇతర భాషల్లోకి చాటడం లక్ష్యంగా పనిచేస్తున్న తెలంగాణ సాహిత్య అకాడమీ తాజాగా వెలువరించిన ప్రాతినిధ్య తెలంగాణ కవితల సంకలనం "పరంపర". ఇదివరలో ప్రాతినిధ్య తెలంగాణ కథలను 'అస్తిత్వం' పేరుతో ప్రచురించిన అకాడమీ వెలువరించిన 'పరంపర'లో నూట ఏభయి కవుల కవితలను పొందుపరిచారు. 'పరంపర' అంటే వరుస. పాల్కురికి సోమన నుండి యువ కవయిత్రి మెర్సీ మార్గరేట్ వరకు సృజించిన కవితలను కాలానుగు ణంగా వరుస క్రమంలో పేర్చిన కవిత్వ పొత్తం **'పరంపర'.** ఈ ప్రాతినిధ్య తెలంగాణ కవిత్వాన్ని ఆంగ్లం మరియు హిందీ భాషల్లోకి కూడా అనువాదం చేయించి ఏకకాలంలో ప్రచురించడం విశేషం.

తెలంగాణ ఆదికవి పాల్కురికి సోమ నాథుడు సుమారు వెయ్యేళ్ళ క్రితం రాసిన "బసవ పురాణం'లోని "జాను తెనుగు"తో ప్రారంభమయిన ఈ సంకలనం 'వెయ్యేళ్ళ పరంపర'గా అభివర్ణించారు డా॥ సుంకిరెడ్డి నారాయణరెడ్డి. ప్రాచీన, ఆధునిక సాహిత్యా నికి వారధిగా నిలుస్తున్న 'పరంపర' వెయ్యేళ్ళ తెలంగాణ కవిత్వ ప్రస్థానాన్ని దృశ్యమానం చేస్తుంది. ఈ సంకలనంలోని 150 మంది కవులు, కవయిత్రులు వివిధ తరాల, వాదాల, కవితారూపాల పరం పరగా అగుపిస్తారు. అకాడమీ ఎంచుకున్న ఈ కొద్దిమంది కవులు ఆయా కాలాల వేలమంది తెలంగాణ కవుల గొంతుకలు, ప్రతినిధులు. అందుకే యిది ప్రాతినిధ్య తెలంగాణ కవిత్వం అయింది. పాతతరం కవులతో బాటు కొత్తతరం కవులకు కూడా ప్రాతినిధ్యం యివ్వడం వలన తెలంగాణ కవిత్వ సమగ్ర సంకలనంగా తీర్చిదిద్దడంలో తెలంగాణ సాహిత్య అకాడమీ సఫలీకృతమ యిందనే చెప్పవచ్చు. యిందలి కవిత్వంలోకి ప్రవేశించే ముందు సుంకిరెడ్డివారి పీఠికను తప్పక చదవాల్సిందే.

పాల్కురికి సోమన తర్వాత క్రీ.శ. 1210 సం॥లో జన్మించిన గోన బుద్ధారెడ్డి నుండి పద్దెనిమిదవ శతాబ్దంలో 1890 సం॥లో జన్మించిన గంగులశాయిరెడ్డి వరకు పదిహేను మంది కవుల కవితలు ముందుగా పొందుపరిచారు.

"తెరవు నడిచెడి- తేడిగానికె ఎరుక
గరుక భక్షించెడి-గాడికేమెరుక"
"నానా రుచులు తిన్న- నాలుకకే ఎరుక
వంటశాలల దిరిగే, గంటెకేమెరుక" వంటి దున్న ఇద్దాసు తాత్త్విక పద్యాలు జీవిత సత్యాలను ప్రతిబింబిస్తాయి.

"పల్లెటూరి పిల్లగాడ
పసులగాచే మొనగాడ
పాలు మరచి ఎన్నాళ్ళయిందో ఓ పాలబుగ్గల జీతగాడ
కొలువు కుదిరి ఎన్నాళ్ళయిందో"

యిది 1946 ప్రాంతంలో ప్రజాకవి సుద్దాల హనుమంతు రాసిన పాట. ఆ రోజు ల్లో వెట్టిచాకిరిపై సంధించిన ఆగ్రహాస్త్రం. భూస్వామ్య, దొరలపాలనకు వ్యతిరేకంగా వినిపించిన బలమైన గొంతుక. 'చిల్లర దేవుళ్ళు' చిత్రం తర్వాత, పూర్తిస్థాయి తెలంగాణ, యాస, భాషలతో, 1980 సం॥లో రూపొందిన 'మా భూమి' చలన చిత్రంలో ఈ పాటను వాడుకున్నారు. ప్రసిద్ధ లలిత సంగీత విద్వాంసు రాలు వింజమూరి సీతాదేవి బాణీలు సమకూర్చి కడు కరుణాత్మకంగా ఆలపించిన ఈ గేయం బహుళ ప్రజాద రణ పొందింది. 75 సం॥ల నాటి రైతాంగ పోరాటం కళ్ళకు కట్టినట్టు దృశ్యమానం చేసిన ఈ చిత్రంలో బండి యాదగిరి రాసిన **"నైజాము సర్కరోడా/ నాజీలమిం చినోడా.. గోలకొండ ఖిల్లా కిందా నీ / గోరీ కడ్తం కడకో/నైజాము సర్కరోడా!"** అనే పాటకూడా చోటేచేసుకుంది. 'ప్రజాయుద్ధ నౌక" గద్దర్ మొట్టమొదటి సారి స్వయంగా పాడి, నటించిన చిత్రం "మా భూమి". మూస చిత్రాలకు భిన్నంగా నిర్మిం పబడి చరిత్ర సృష్టించిన తొలి

తెలంగాణ చలన చిత్రం యిది. సాయుధ పోరాటం నేపథ్యంలో నిర్మించిన ఈ చిత్రంలోని పాట లు, దృశ్యాలు ఆ రోజుల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపాయి. హైద్రాబాద్‌లో ఏక బిగిన ఒకే థియేటర్‌లో 365 రోజులు మరియు ఆంధ్రా ప్రాంతమైన విజయవాడలో 100 రోజులు ప్రదర్శించబడి.. ప్రతిభ ఎన్నటికీ భాష, ప్రాంత ప్రాతిపాదికగా వివక్షకు గురి కాదని నిరూపించిన ఫక్తు తెలంగాణ చిత్రం. పై రెండు పాటలు 'పరంపర'లో పొందుపరచ బడ్డాయి. ఆ తరానికి అవసరమైన సాహిత్యం యిది.

దిగంబర కవులుగా ప్రసిద్ధికెక్కిన జ్వాలాముఖి, నిఖిలేశ్వర్ మరియు చెరబండ రాజు గారల కవితలను ఆస్వాదించవచ్చు. శవ రాజకీయాలు, ఆక్రమణదారుల కుట్రలు, మతోన్మాదం ప్రబలిపోతున్న సమాజాన్ని జ్వాలాముఖి మన కళ్ళముందుం చుతే, నిఖిలేశ్వర్ తన చిన్నపుటి జ్ఞాపకాల కొండను త్రవ్వి తన 'మధురానుభూతుల జల"లో మనను ఓలలాడించారు. వివిధ వృత్తుల్లోని శ్రామికుల చెమటధారల్ని ఒడిసిపట్టి "ఏ కులమబ్బీ.. మాదే మత మబ్బీ" అన్న ప్రశ్నను సంధిస్తారు చెరబండరాజు.

ఎవరికైనా తను పుట్టి పెరిగిన ఊరు అపురూపమే. ఆ ఊరితో పెనవేసుకున్న బంధం జీవితాంతం విడదీయలేనిది. ఆ అనుబంధాల్ని పంచుకున్నారు డా॥ఎన్.గోపి, కందుకూరి శ్రీరాములు, సుంకిరెడ్డి నారాయణరెడ్డిగారలు తమ కవితల్లో...

ఆయన అక్షరాలు అగ్నికణాలు.. కవిత్వం పీడితుల పక్షం. రాసింది తక్కువే అయినా వాసిలో ఈ కవి మినీ కవిత్వం ఆలోచనాత్మకం. భావ స్ఫూరితం. విప్లవాత్మక భావావేశం అతని స్వంతం. అతనే అలిశెట్టి ప్రభాకర్.

"ఈ దీర్ఘ కాలిక యుద్ధ వ్యూహంలో
పీడితుడే నా అస్త్రం- అణ్వస్త్రం
శత్రువు నా పాద ధూళి" అంటు తన ఆఖరి శ్వాస వరకు బాధితుల తరఫున పాలకులపై కవితాస్త్రాలను సంధించి పిన్న వయస్సులోనే అసువులు బాసిన ధన్యజీవి ప్రభాకర్. **"మరణం నా చివరి చరణం"** అంటు నినదించిన అలిశెట్టి కవిత చదవొచ్చు.

"పరవళ్ళు తొక్కే గోదావరి
నది నాకు భావస్ఫోరకం" అంటున్నాడు నిర్మల్ కవి డా॥ దామెర రాములు. క్షణం తీరిక లేని వైద్య వృత్తిలో వుండి కూడా కవిత్వంతో సేదతీరే ఉద్యమ గొంతుక రాములుది.

"ఎన్ని పోరాటాల ఫలితమో
తెలంగాణ దేహంనిండా బుల్లెట్ల గాయాలే!"

అంటున్న ఆశారాజు కవిత చదువు తుంటే తరతరాల పరంపరగా తెలంగాణ సాగిస్తున్న ఉద్యమాలు, పోరాట పటిమ మనోఫలకంపై సాక్షాత్కరిస్తాయి. తెలంగాణ అంటేనే పోరాటాల గడ్డ.

"కూటి వేటకై వెళ్ళే వలస పక్షుల
బొంబాయి బస్సు..
బస్సులో వున్నది జనం కాదు
అస్తవ్యస్త జీవితాల వ్యధాభరిత కన్నీళ్ళు"

బ్రతుకు తెరువు కోసం ఉన్న ఊరిని, తనవారిని వదిలి బొంబాయికి వలస వెళ్తున్న నేతన్నలు, రైతన్నలు, శ్రామికుల వెక్కిళ్ళు అవి. ముంబయి కవి సంగెవేని రవీంద్ర **"బొంబాయి బస్సు"** నుండి ఒలికించిన కన్నీళ్ళు యివి.

"మా ఊరంటే
నా ఏడేడు తరాల పురాగాథ" అంటున్న కవి మామిడి హరికృష్ణ "మా ఊరి పురాణం" శ్రవణం చేద్దాం రండి.

కాళోజి, సినారె, దాశరథి, కూరెళ్ళ, కోవెల, తిరుమల, అమ్మంగి, నాళేశ్వరం, పెన్నా, యాకూబ్, జూలూరు, జూపాక, ఏనుగు, యిలా మహామహుల కలం నుడి వెలువడిన భావావేశాలను ఆస్వాదించ వచ్చు. ఆ తరం.. ఈ తరం.. ఒకటా.. రెండా.. మొ త్తం 150 కవితలు. దేనికదే ప్రత్యేక మైనది. విశిష్టమైనది. ఎన్నని ఏరగలం? చదివి అనుభూతించాల్సిందే తప్ప.

ప్రముఖ చిత్రకారుడు కాపు రాజయ్య గారి కుంచె నుండి వెలువడిన ముఖచిత్రం సంపుటికి కొత్త అందాలను అద్దింది.

డా॥నందిని సిధారెడ్డిగారి ప్రధాన సంపాదకత్వంలో వెలువడిన ప్రాతినిధ్య తెలంగాణ కవిత్వం 'పరంపర' సాహితీ ప్రియులందరు చదివి దాచుకోవాల్సిన అపురూప గ్రంథం.

ప్రతులకు:తెలంగాణ సాహిత్య అకాడమీ
కళాభవన్, రవీంద్రభారతి ప్రాంగణం,
హైదరాబాద్-500 004.
వెల:250/-

- రమణ వెలమకన్ని
సెల్: 9866015040

పుస్తక సమీక్షలు

చక్కనైన 'చంద్రమౌళి చంద్రికలు'

108 కవితలున్న ఈ సంపుటిలో దాదాపుగా అన్నీ సామాజిక అంశాలు చోటు చేసుకున్నాయి.

శ్రీరామ రామ రామ అనే శీర్షికతో ప్రారంభించిన వీరి కవిత్వం, ద్వితీయ విఘ్నం కలగకుండా రెండవ కవిత కూడా మహా శివరాత్రిపై రచిస్తూ , శ్రీశ్రీ, ఉగాది అమ్మ , చెల్లి, తాజ్ మహల్, ఓటు నోటు, ఆమె నాలోకం, మగువలకు నా అభినందనలు, జై ఆవకాయ, మహాత్ముడు, మా తాత గొడుగు, మానవుడా తప్పు దిద్దుకో , ఆమె నవ్వు వంటి అనేక విషయాలను వస్తువులుగా తీసుకుని మంచి భాష, భావం ఉట్టిపడేలా రచించిన తీరు ప్రశంసనీయం.



కవి తనను ఆలోచింపజేసిన, ఆవేదనకు గురిచేసిన, ఒకింత ఆశ్చర్యాన్ని కలగజేసిన, ప్రశ్నను తలెత్తేలా చేసినా వెంటనే తనలోని ఆ సంబంధిత సంఘటనను అక్షరీకరించడం పరిపాటి. కానీ తనలో ఇన్ని అంశాలను రేకెత్తించిన ఆ విషయాలను తాను సమాజానికి చెప్పదలచుకున్నాడా? అయితే ఎలా చెప్పాలనుకున్నాడు? సమాజం ఇంతేనా? లేక సమాజాన్ని ఆ కోణంలో చూడకూడదనా? లేదా మన అక్షరాలతో సమాజంలో కాస్తయినా బాగుపరచాలనా? అనేది ఎంతో అవసరం. ఎందుకంటే కవి తన భావాలతో ఎంతో మంది జీవితాలను ఆలోచింపజేసిన సంఘటనలు అనేకం మనం చూస్తూనే ఉన్నాం. ఓదార్పు పొందిన సంఘటనలను మనం వింటూనే ఉన్నాం. అందుకే కవి మనసుకు ఊరట కలిగించే వైద్యుడు అని ఖచ్చితంగా చెప్పవచ్చు. ఇలా జరుగుతోంది. అలా జరుగుతోంది? ఆ దేశం ఇక బాగుపడదు. ఆ మనిషి ఇక పనికిరాడు అని చెప్పడానికి, విషయాన్ని వాక్యాలుగా చేసి పుంఖాను పుంఖాలుగా రాయడానికి కవిత్వం అనే పేరు పెట్టక్కర్లేదు. వ్యాసంలా విపులంగా రాసినా చాలు. అలా కాకుండా వస్తువును సంఘటితం చేస్తూ, సమాజాన్ని తట్టి లేపి చైతన్య పరచాలంటే ఖచ్చితంగా అది కవితగానే ఉండాలి. లేదా పాటగానైనా రూపం సంతరించుకోవాలి. ఆ విషయాన్ని పూర్తిగా తెలుసుకున్న కవి రామకృష్ణ చంద్రమౌళి.. వీరి కవితా పంక్తులు కొన్ని పరిచయం చేసుకుందాం..

"అదొక చిత్రవిచిత్ర ప్రపంచం/ అనిర్వచనీయమైన అయోమయం" అంటూ ఆ రైలులోని కోలాహలాన్ని, కూలీల పోరాటాన్ని, విడిపోతున్న జంటల అనిర్వచనీయమైన విషాద వదనాల్ని వివరిస్తారు.

"ప్రకృతి పురుషుల సంగమం/ తాళం చెవుల సహజీవనం/ తాళం ఎంత పటిష్టమైనా / తాళం చెవితో అది పరిపూర్ణం" అంటూ తాళం చెవితో స్త్రీ పురుషుల జీవితాన్ని తెలియజేస్తారు.

"ఇన్నాళ్ళ నా నిరీక్షణకు /ఫలము ఒక్కటి దక్కిందని/ ఎల్లలెరుగని సంతసం/ నింగివరకు చేరిపోయె" - ప్రియుడి లేఖ అనే అంశాన్ని తెలిపారు.

"భయం భయంగా బతకడమంటే / నిత్యం మృత్యువుతో పోరాటమే" -ధైర్యానికి జీవం పొయ్యి అనే కవితలో..

పోగొట్టుకున్నది తిరిగి పొందాలని ఉంది అనే కవితలో **"గడిచిన కాలంలో నేను / పొందిందేమిటి?/ పొగొట్టుకున్నదేమిటి/ తరచి చూస్తే నిట్టూర్పులే మిగులుతాయి"** అనే వాక్యాలలో మనకు తాత్త్వికతను ద్యోతకం చేస్తారు. అసలు మనిషి జీవితంలో ఆధ్యాత్మికత, తాత్త్వికత అనే అంశాలు ప్రతి చోటా దర్శనమిస్తాయి. కొందరు గమనిస్తారు. మరికొందరు గమనించలేరు అంతే..

"గడిచింది అర్ధ శతాబ్ద కాలం/ నా ఆటోగ్రాఫ్ పుస్తకం/ మా మాస్టారి సంతకంతో సందేశం/ నాకు ఇప్పటికీ శిరోధార్యం" - ధైర్యంగా ఉందాం అనే కవితలో గురువును తలుచుకోవడం ఎంతో ఆదర్శవంతంగా ఉంది.

"నిచ్చెన నీకు స్ఫూర్తి దాయకం/ ఎప్పుడు మరవకు దాని మర్మం" అంటూ నిచ్చెన కవితలో ప్రతి మెట్టుకు గల విలువను వివరించిన తీరు ఎంతో అలరించిందనే చెప్పాలి.

ముఖ్యంగా నేనూ -వెన్నెల అనే కవిత్వం బాల్యాన్ని యౌవనాన్ని, వృద్ధాప్యాన్ని వివరించిన తీరు ఎంతో చక్కగా ఉంది "ఆరు బయట ఆవరణలో/ నిండు చంద్రుడు బాల్యం'' '' ఒక స్త్రీ సాంగత్యంలో తెలుసుకున్న సత్యాలు యౌవనం" "అందరూ తనతోనే ఉన్నా ఏదో భయంతో వృద్ధాప్యం అనే తీరులో రచించారు. జీవితంలో ఎంతగా అనుభవాల్ని, ఆనందాల్ని పొందినా మిగిలేది మనకు తెలిసేది మనం అశాశ్వతమనే విషయం అంటూ తెలియజేసిన తీరు చదివించేలా సాగింది.

ఇలా ఒక్కటి కాదు అనేక అంశాలు చక్కని సమయస్ఫూర్తితో ఒక స్నేహితున్ని ఓదార్చే హస్తంలా, బిడ్డలను హెచ్చరించే తండ్రిలా, కష్టమొస్తే నేనున్నాను అనే స్నేహంలా ప్రతి కవితా చదవరులను అనిపిస్తాయి. కవి రామకృష్ణ చంద్రమౌళి ఉబుసుపోక రచించిన విషయాలు కావు ఇవి. తన కవితతో ఏ ఒక్కరినైనా ఆనందింపచేయాలనే తపనతో రచించినవి.

కవిత్వం రాయాలనేది ఒక పని కాదు. ఒక తపన. కవిత్వం రాయాలనేది ఎవరి మెప్పు పొందడానికో కాదు. ఒక బాధ్యత. కవిత్వ ఏ ఒక్కరి స

అమాయకపు గుట్టన్న కథలు
(పిల్లల హాస్య కథలు)

రైలు ప్రయాణం

గుట్టన్న రైలు ప్రయాణం చేద్దామని వెళ్ళాడు. వాడు అంతవరకు రైలును చూసి ఎరుగడు. అందరూ అంటుంటే రైలు గురించి విన్నాడు .

రైల్వే స్టేషన్ కు వెళ్ళిన గుట్టన్న తనకు టిక్కెట్ ను ఇమ్మన్నాడు. ఆ రైల్వే గుమస్తా 'ఎక్కడికి 'అని అడిగాడు . 'ఇక్కడికే'అని అన్నాడు గుట్టన్న. అప్పుడు ఆ గుమాస్తా ప్లాట్ ఫారం టికెట్ ను ఇచ్చాడు. అది తీసుకున్న గుట్టన్న స్టేషన్ లోపలికి ప్రవేశించాడు. ఇంతలో ఒక గూడ్స్ రైలు బండి వచ్చి ఆగింది .అది చూసిన గుట్టన్న అక్కడున్న ఒక మనిషితో "అయ్యా! అన్ని డబ్బాలకు తలుపులు వేసి తాళాలు వేశారే. నేను ఎలా డబ్బా లోపలికి వెళ్లడం? అందులో ఉన్న వారికి ఊపిరి ఆడుతుందా! వారు స్టేషన్ లో ఎలా దిగుతారు? "అని ప్రశ్నించాడు? అప్పుడు అతడు "ఇది ప్రయాణీకుల రైలు కాదు. గూడ్స్ బండి ."అని అన్నాడు." గూడ్స్ అంటే ఏమిటి? అని గుట్టన్న తిరిగి ప్రశ్నించాడు. " పెద్దపెద్ద వస్తువులు తీసుకొని పోయే రైలు" అని అన్నాడు ఆ పెద్దమనిషి. " ఓహో! అలాగా! అని దీర్ఘాలు తీశాడు గుట్టన్న.

వెంటనే ఆ రైలు కదిలి వెళ్ళిపోయింది .అప్పుడు మరొక రైలు వచ్చింది . గుట్టన్న దానిని ఎక్కి లోపలికి వెళ్ళాడు .ఆ పెట్టె చాలా క్రిక్కిరిసి ఉంది. అందులో చాలామంది నిలబడే ఉన్నారు. వారిని తోసుకుంటూ గుట్టన్న లోపలి వెళ్ళాడు. " ఓహో! రైలు అంటే ఇలాగ ఉంటుందా" అని తిరిగి దిగడానికి వస్తున్నాడు .ఇంతలో రైలు కదిలింది. గుట్టన్న" ఆపండి! ఆపండి!" అని అరవసాగాడు. అందులోని వారు 'అరవకు. నోరు మూసుకో 'అని చెప్పారు." అయ్యా! నేను ఎక్కడ దిగాలి" అని వారిని అడిగాడు గుట్టన్న." వచ్చే స్టేషన్ లో దిగు" అని వారన్నారు. సరే నన్నాడు గుట్టన్న.

ఇంతలో తినుబండారాలు వస్తే తీసుకొని తిన్నాడు గుట్టన్న. ఆ తెచ్చిన వ్యక్తి డబ్బులు ఇమ్మని అంటే వాడికి తన ఫ్లాట్ ఫారమ్ టికెట్ చూపించి" నేను టిక్కెట్ తీసుకున్నాను. కనుక మీరు నన్ను అతిథిగా భావించి ఉచితంగా ఇచ్చారని అనుకున్నా!" అని అన్నాడు. వెంటనే ఆ తినుబండారాల వాడు గుట్టన్నను శాపనార్థాలు పెడుతూ వెళ్ళాడు. ఇంతలో టికెట్ కలెక్టర్ వచ్చి టిక్కెట్ చూపించమన్నాడు. గుట్టన్న ప్లాట్ ఫారం టిక్కెట్ ను చూపించాడు. టిక్కెట్ మాస్టర్ నవ్వుతూ "ఇది ప్లాట్ ఫారమ్ టికెట్ .రైల్వే టికెట్ కాదు" అని అన్నాడు. గుట్టన్నకు అది ఏమిటో అర్థం కాలేదు . "అయ్యా! నేను రైల్వే స్టేషన్ లోనే టికెట్ తీసుకున్నానండీ! కావాలంటే వారిని అడగండి. వారు నాకు ఇదే టికెట్ ఇచ్చారు" అని అన్నాడు. అప్పుడు ప్రక్కనున్న వ్యక్తి వాడి అమాయకత్వానికి నవ్వుకొని అది రైలు ప్రయాణం చేయడానికి పనికి రాదని చెప్పాడు.అతడు వెర్రిబాగులాడని ఆ ప్రయాణీకుడు దయతో అతని టిక్కెట్ డబ్బులు తానే టికెట్ కలెక్టర్ కు చెల్లించాడు. అప్పుడు గుట్టన్న వచ్చే స్టేషన్ లో తాను దిగి పోతానని, రైలు ఆపమని ఆ స్టేషన్ మాస్టర్ ను వేడుకున్నాడు .ఆ మాస్టారు నవ్వుకుంటూ 'సరే ' అని మరొక పెట్టె లోనికి వెళ్లాడు .

ఇంతలో రైలు స్టేషన్ లో ఆగింది. గుట్టన్న టిక్కెట్ తీసుకున్న ప్రయాణీకుడు అతని టిక్కెట్ తీసుకొమ్మని అరుస్తున్నా వినకుండా గుట్టన్న రైలు దిగి బయటకు వెళ్లాడు. అక్కడ మరొక అధికారి గుట్టన్నను టికెట్ అడిగాడు.అప్పుడు గుట్టన్న " ఎన్ని సార్లు టిక్కెట్ అడుగుతారండీ" అని అంటూ తన దగ్గర ఉన్న ప్లాట్ ఫారం టికెట్ ను చూపించాడు. అది ఈ స్టేషన్ ది కాదని ఆ అధికారి అన్నాడు." అయ్యా! నేను ఎక్కిన రైలు, దిగిన రైలు ఒక్కటే .అటువంటప్పుడు ఈ టికెట్లు కూడా వేరుగా ఉంటాయా! మీకు రాత్రి సరిగా నిద్ర లేదు కావచ్చు "అని అన్నాడు.

ఆ మాటలకు అధికారికి కోపం వచ్చి అతనిని ఒక ప్రక్కగా నిలబెట్టాడు. అక్కడ ఉన్న ఒక వ్యక్తి గుట్టన్నను చూసి "వీడు వెర్రిబాగుల వాడు "అని అధికారికి చెప్పాడు. అతడు గుట్టన్నను వదిలి పెట్టాడు. ఆ వ్యక్తి తన ఊరివాడేనని తెలుసుకొన్న గుట్టన్న అతడిని ప్రతిమిలాడి బస్సుఖర్చు కొరకు కొన్ని డబ్బులు తీసుకొని తన ఊరి బస్సును ఎక్కి తిరిగి తన గ్రామానికి చేరాడు . మరెప్పుడూ గుట్టన్న రైలు ప్రయాణం చేయలేదు.



-సంగనభట్ల చిన్న రామ కిష్టయ్య
9908554535

పునీత్
(నానీలు)

అతని దేహం
పార్థివమైంది
కళ్ళు మాత్రం
సజీవంగా మిగిలాయి.

కాలం కాటుకు
గుండె నిలిచింది
చేసిన మంచి
ఎన్నో గుండెల తడిపింది.

ఆస్తి రాలేదు
అతని వెంట
అనాథల ప్రేమ
కాటికి తోడు వచ్చింది.

దానం విలువ
తెలిసినవాడు
విద్యాదానంతో
చిరంజీవి అయ్యాడు.

నటుడి కొడుకుగా
పెరగలేదు
పేదల మనిషై
పేరొందాడు.

పునీత్ అంటే
నటుడు కాదు
ఎందరో దిక్కులేని వారికి
దేవుడు

-శింగరాజు
శ్రీనివాసరావు
9052048706

ప్రపంచ మహిళా దినోత్సవం



"ప్రపంచ మహిళా దినోత్సవం" రోజుగూర్చి
చెప్పుకోవడానికేముంది గర్వకారణం..?
కుప్ప తొట్టిలో..
కుక్కల పాలయిన
ఆడ శిశువు
కట్నం కారణంగా
కట్టుకొన్న వాడి చేతిలో
కాలి బూడిదైపోయిన
కాళ్ళ పారాణి ఆరని ఓ అమ్మాయి
ముసలోడి కామానికి గురైన.
ముక్కు పచ్చలారని మూడేళ్ళ పాప
ప్రేమను తిరస్కరించిన
నేరానికి..
ప్రేమికుడి చేతిలో
బలి అయిపోయిన ఓ యువతి
కాసుల కోసం
కన్న కొడుకు చేతిలో
కత్తిపోట్లతో
కడతేరిపోయిన తల్లి (స్త్రీ)
సాధారణమైపోయిన
సామూహిక మానభంగానికి
లోనై..
నడిరోడ్డు మీద
నగ్నంగా పడి ఉన్న
మతిస్థిమితం లేని మహిళ
ఇలాంటి సంఘటనల మధ్య
జరుపుకొన్నాం..
"ప్రపంచ మహిళా దినోత్సవం"
ఆనందంగా..
"శుభాకాంక్షలు" చెప్పుకొంటూ

- లయన్ కె.సి. లలిత

మేఘం కరుణించింది!



ఆశలు ఆగమై
బతుకులు దీనమై
కన్నీరే శరణ్యమే
కుమిలిపోతున్న
పల్లె వదనంలో
సింగారించుకొంటుంది
ఏదో ఒక కొత్త కళ
అవును నిజమే!
మేఘం కరుణించింది
చిటపట చినుకుల
వానమ్మ
నేలతల్లి ఒడిలోకి చేరి
నేస్తమై
పాతాళ గంగమ్మతో
జతకూడిన సంబరాల
నడుమ
జలకాలాడిన మా పల్లె సీమల్లో
గతాన్ని గుర్తు చేస్తూ..
మళ్లీ
పలస పక్షుల
పలకరింపుల సందడిలో
చెరువుల్లో చెలిమల్లో
వాగుల్లో డొంకల్లో
నిండుకొచ్చిన జలకళ!
ఆత్మహత్యల రైతన్న
గుండెల్లో ఊరపై
మేఘం కరుణించింది!
మళ్లీ..
మా పల్లె యింట
సిరుల పంటలతో
జీవ కళ నింప
మేఘం కరుణించింది!

- పలస వెంకటేశ్వర్లు

ఓటరన్న మేలుకో

ప్రజాస్వామ్యంలో ఒటే పాశుపతాస్త్రం
అభివృద్ధికి గీటురాయి ఓటు హక్కు
నిస్వార్థంగా వినియోగించే ఓటు హక్కు
ప్రలోభాలకు లొంగకు తాయిలాలు నమ్మ కు
మద్యం డబ్బు మత్తులో అసలే పడవద్దు
ఆత్మ ద్రోహానికి పాల్పడ్డ వద్దు
ఆత్మ ప్రబోధం అనుసారం వేయి ఓటు
పవిత్రమైన హక్కును కాలరాయకు.
ఓటు హక్కు వృధా చేయకు
ఓటుతోనే తలరాతను మార్చుకో
అమూల్యన ఓటు వినియోగించుకో
ఓటు హక్కు బాధ్యత అని తెలుసుకో

-యాదవరనీ
చంద్రకాంత్ గౌడ్
9441762105

మెలకెత్తాలి..!

అక్షరాలను గుప్పిట పట్టి
గుండెకు హత్తుకుంటే...
చీకటిని చీల్చే కిరణాల కత్తులై
వెలుతురు సామ్రాజ్యానికి
పునాది రాళ్లవుతాయ్!.

అక్షరం పదునెక్కిన ఆయుధమైతే
అవినీతి గుండెను
తుత్తునియలుగా చేసే
గండ్రగొడ్డలై గర్జిస్తుంది!

అక్షరాన్ని శరాఘాతం చేసి సంధిస్తే
తిమిర రాక్షసిని
కుప్పకూల్చే రామ బాణమై
శత్రు సంహారం చేస్తుంది!.

అక్షరాన్ని నమ్మిన వారికి
ఎల్లవేళలా తల్లిలా కాపు కాచే
మాతృ దీవెనై
వరాలను వర్షిస్తుంది!.

అక్షరంతో చెలిమి చేస్తే
నిరక్షర కుక్షి నాలుకపై
చదువుల తల్లి చేతి చలవచే
బీజాక్షరాలు లిఖించబడతాయ్!

అక్షరాన్ని చూస్తే
దురహంకార దురాగతాలు
తోకముడిచి తుర్రుమంటాయ్!.

అక్షరానికి కాస్త చోటిస్తే
అనుక్షణం కాపు కాచే
వీర సైనికునిలా రక్షణ కవచం పరిచి
నిన్ను సజీవుణ్ణి చేస్తుంది!

అందుకే... అక్షరాన్ని పొదివి పట్టుకో
మనుషుల మధ్య
మెలకెత్తడం నేర్చుకో..!

-వంగర. పరమేశ్వరరావు
9491400534

బాలలము

బాలలము మేము
ఆడే పాడే పిల్లలము.
అల్లరిపనులతో అలరిస్తాం
చిలకతో పలుకులు పలుకుతాం
కోయిలతో రాగాలు తీస్తాం
అమ్మ ఒడిని బొమ్మలము మేము.
జాతిపిత వారసులం
చాచా నెహ్రూ గులాబీలం
గురువుల ప్రియ శిష్యులం
నాన్న కంటి వెలుగులము మేము.
మాటల మతాబులం
భారతమ్మ ఇంట
పాలు పెరుగు గువ్వలం
భావి భారత పౌరులం

-లతా శ్రీ, 9666779103

ఎలుక...చేప (కథ)

ఓ చెరువులో చేప,దానికి సమీపంలో ఓ చెట్టు కింద కలుగులో ఎలుక నివసించేవి.ఇవి ప్రతి రోజు కలుసుకుని సంతోషించేవి.కష్ట, సుఖాలు చెప్పుకునేవి. రాను రాను చేప,ఎలుక సంతానం పెరిగింది.తమ సంతానం వృద్ధి చెందడంతో ,అవి తమ కళ్ళ ముందు తిరుగుతుంటే చేప,ఎలుక ఆనందించేవి.

ఒక రోజు వేటగాళ్ళు ఆ చెరువులో ని చేపలను చూసి " రేయ్ ఈ చెరువులో కావలసినన్ని చేపలు ఉన్నాయి, ఇక్కడ వలవేసి తర్వాత ఆ బావి దగ్గరకు వెళదాం " అన్నాడు. ఆ మాటలు వింది చేప. ఆ రోజు చాలా విచారంగా ఉంది చేప. చేప కళ్ళల్లో కన్నీళ్ళు చూసి ఎలుక కారణం అడిగింది.విషయం అంత చెప్పింది చేప. " మిత్రమా నువ్వేమి దిగులుపడకు రేపు వాళ్ళు రాని తప్పించుకునే ఉపాయం ఉంది లే " అని ధైర్యం చెప్పింది. చేప దిగులుతో " ఏమో మిత్రమా నేను,నా సంతానం వాళ్ళ వలలో చిక్కుకుంటున్నాం,నిన్ను చుడటం ఇదే చివర" అని చెరువులో కి వెళ్ళింది. మరుసటిరోజు వేటగాళ్ళు వచ్చి వల వేశారు. చేపలన్నీ వలలో చిక్కుకున్నాయి.ఇదంతా ఎలుక చూస్తోంది. వేటగాళ్ళు వల లాగి భుజాన వేసుకుని వెళుతుంటే చేపలను చూసి ఎలుక కన్నీళ్లు పెట్టుకుంది.వేటగాళ్ళు బావి ఒడ్డున వల పెట్టి "ఈ లోగా భోజనం చేద్దాం తర్వాత నీ వల ఈ బావిలో విసురుదాం " అన్నాడు. సరే అను కుని దూరంగా భోజనానికి కూర్చున్నారు ఇద్దరు. వెంటనే ఎలుక తన సైన్యంతో ఆ బావి దగ్గరకు చేరుకుంది.వలలో ఎగిరెగిరి పడుతున్న చేపలను చూసి "భయపడకండి ఈ వలను నిమిషాల్లో నా సంతానం కొరికి వేసి మీకు విముక్తి కలుగ చేస్తాయి.మీరు వెంటనే ఎగిరి ఈ బావిలోకి వెళ్ళాలి సరేనా " అంది. సంతోషం తో తలలు ఆడించాయి చేపలు.

ఎలుక తన సైన్యంతో నిమిషాల్లో వలను కొరికి వేశాయి, ఒక్కొక్కటి వెంటనే ఎగిరి నీళ్ళల్లో పడుతున్నాయి..వేటగాళ్ళు వచ్చి చూసే సరికి వల అంతా పిగిలిపోయి ఉంది. చేపలు ఎమైనాయో వారికి అంతు పట్టలేదు. ఎలుక చేసిన సహాయానికి కృతజ్ఞతలు చెప్పింది చేప.

-కనుమ ఎల్లారెడ్డి
93915 23027

గోదా... వరి

ఏ వరిది ఎవరికి ఎరుక
రగిలే మార్కెట్లు కాక!
కన్నబిడ్డల యట్లు కాపు కాసి
పురిటి నొప్పుల బాధల కొరిసి
పంటల బ్రతికించు కాపు
ఆకలి బాధలు బాపు!
ధాన్యపు రాశుల మదులు జుసి
బాధలన్నీ మరుచు!
వరుణుడు కరుణిస్తే
గోదా.. వరి సాగు!
సాగు లేక బ్రతుకు
బాట లెట్లు సాగు!
అన్నదాత యని బిరుదు
పంటకు వెల కట్టుకోలేని సాధువు!
అన్య ధరల నింగి చూపు!
అన్నదాత ధరలు అవని చూపు!
రైతు రాబడులు
నాణ్యత తక్కెడలో
బక్కచిక్కి పోతున్నవి!
అద్దాల అంగట్లో సరుకులు
ధరల పాకెట్ల మెరుపుల్లో
బరువెక్కి పోతున్నవి!
ఏ వరి ధర ఎవరికెరుక!
నిర్ణయించేది మరొకరు కనుక!

-పి.బక్కారెడ్డి
9705315250

చిత్రకారుడు

మదిలోన మెదిలే భావనకు..
రూపమును తీసుకొస్తావు..
హస్తలాఘవ నైపుణ్యముచే..
అందముగా తీర్చిదిద్దుతవు..

రంగుల రమణీయ చిత్రాలను..
హంగులతో చిత్రీకరిస్తవు..
చూపరుల దృష్టినాకర్షించి..
తమవైపు మల్లించుకుంటవు..

సమాజ మార్పుకోరుకునేటి..
సైకత శిల్పాలను వేస్తవు..
అచేతన స్థితిలోనున్న ప్రజల..
చైతన్యవంతులను చేస్తవు..

చిత్ర చిత్రమునందు ప్రతిభ..
పదును పెట్టుకుంటు పోతవు..
ప్రతి చిత్రానికి ప్రాణం పోసి..
ప్రజల మదిలో నిలుస్తున్నవు..

-పసుల.శంకర్
9542181301

మట్టి మనిషి మా నాన్న

అతను మబ్బుల్లోనే నిద్ర లేచి
పగలంతా పాదముద్ర లతో అలసి పోయి
నిశీది రాత్రి లో సేద తీరుతున్న
పుడమి తల్లిని తట్టి లేపుతాడు
"పేదరికం " అనే కొండచిలువ చుట్టేసిన
మా నాన్నని పూట కోసం
సదా సర్కస్ ఫీట్లను వేస్తాడు.

పనిని అమ్మ లా ఆప్యాయంగా
ఊయలేసి ఊపుతాడు మా నాన్న
కష్టాల కావళ్ళను భుజాలపై మోస్తూ
ఎర్ర టెండలో ఎముకల గూడును కదిలించి
కొలిమిలో కొరకాసు లా కాలుతూ
మా కంచం లో
బువ్వపూలు పూయిస్తాడు మా నాన్న.

తుండు గుడ్డ ను తలకు చుట్టుకొని
మట్టి పరిమళాన్ని ఎదకు రాసుకొని
అవని పై సుద్ద పోసి అర్రలుగా మార్చే
మా నాన్న మంచి పురోహితుడు
ఇటుక ఇటుక ను పేర్చి ఇండ్లను నిర్మించే
మా నాన్న మంచి ఇంజనీర్
మాటల తీరును బట్టి మనుషులను
అంచనా వేసే మంచి సైకాలజిస్ట్ మా నాన్న

లైన్ దారాన్ని పట్టుకొని అక్రమంగా ఉన్న
గోడను సక్రమంగా చేసే మా నాన్న
నా నిరాశల నావకు
ఆశల తెరచాపలు పరుస్తూ నా జీవిత
చక్రాన్ని మలుపు తిప్పాడు మా నాన్న
ఆయన స్వేద వస్త్రంతో ముఖము
తుడుచుకొని నేను
సరస్వతీ పుష్పంగా పూసాను.

కడుపులో కల్మషాల కంపు లేని
కడిగిన ముత్యం మా నాన్న
ఆయన పెదవుల పర్వతాల పై నుండి
నిత్యం నవ్వుల జలపాతాలు
దూకుతూనే ఉంటాయి
గటక తిని , గంజి తాగిన మా నాన్న కు
సూది మందు సుతారం తెలియదు
ఆయన నడకే ఆయనకు దివ్య ఔషధం
ఆయన సుదూరపు ఆలోచన లే
నా తనువుకు వెలుగు రేఖలు

- తాటిపాముల రమేష్
7981566031

భారతమ్మ

పంచమ వేదమై పరిఢవిల్లుచునున్న
భారతమును వ్రాసె వ్యాసమునియు
పద్దెంది పర్వాల పర్వత మెక్కియు
ఆదికావ్యముగను నవతరించె
కావ్యమ్మునంతయు కలిసికవిత్రయుల్
అనువదించె తెలుగులందముగను
సంస్కృత మందుచె సంస్కారవంతంగ
వెలుగెఁన్ స్వతంత్రంగ తెలుగునాట

నన్నయాదిసభలు నడయాడె నట్టింట
తిక్కన కృతులన్ని తిరిగెఁభువిన
ఎఱ్ఱన హరివంశ మెంతొఘనతపొందె
భారతమ్మయెంత భాగ్యమాయె.

-నవీన్ గొర్రెంక
9618039501

'గజేంద్ర మోక్షం'లో మానవీయ కోణం..

పుస్తక సమీక్ష

భాగవతంలో "గజేంద్ర మోక్షము" కథ బహుళ ప్రాచుర్యం గాంచినది. 'త్రికూటము' అనే పర్వత సానువుల్లో దట్టమైన అడవులు కొలనులు నానా జాతి ప్రాణులున్నాయి. అక్కడి ఏనుగులు దిగ్గజాలను సైతం ఓడించగలిగే పరాక్రమం గలవి. ఒకనాడు ఒక గజరాజు తన భార్యలతో వాహ్యాళికి వెళ్ళి అడవినంతయు చిందర వందర చేసి, దప్పిక గొని ఒక కొలనులోదిగి, తన బలగర్వముతో కొలను నంతయు చీకాకు పరచుటయే గాక. కొలనులోని ప్రాణులకు వేదన కలుగచేస్తాడు. ఆ కొలనులో నివాస ముంటున్న ఒక మొసలి గజరాజు ముందు కాలిని పట్టుకుంటుంది. నీటిలోకి లాగచూసే మొసలి, బయటపడాలన్న ప్రయత్నంతో గజరాజు ఇద్దరూ సమ ఉజ్జీలై తలప డుతాయి. భాగవత కథ ప్రకారము రెండూ వెయ్యేళ్ళు పోరాడుతాయి. స్థాన బలిమితో మకరి, విజృంభిస్తుంది. నీర సించిన గజరాజు విష్ణువును వేడుకుం టాడు. మొరవిన్న ఆ పురుషోత్తముడు హుటాహుటిన వచ్చి మకరిని సంహ రించి కరిరాజును రక్షిస్తాడు.

మూలకథ ప్రకారము 'హుహు' అనుగంధర్వుడు శాపవశాత్తు మొసలియై, విష్ణు చక్ర నిహతితో శాప విముక్తుడవుతాడు. ఇంద్రద్యుమ్నుడు అను ద్రవిడ దేశరాజు అగస్త్యుని శాపంతో ఏనుగులా మారుతాడు. శ్రీహరి దర్శన భాగ్యంతో మొసలి, స్పర్శన భాగ్యంతో ఏనుగు-రెండూ పునీతులవుతాయి.

రచయిత ఆచార్య అనుమాండ్ల భూమయ్య తెలుగు భాషాభిమాని పూర్వ ఉపకులపతి పొ.శ్రీ.తెలుగు విశ్వవిద్యా లయం. పలు పద్య, గేయ, విమర్శ రచనలతో తెలుగు కళామతల్లి సిగపూవై ప్రకాశిస్తున్నారు. 18 గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. పలు పురస్కారా లను కైవసం చేసుకున్నారు.



పౌరాణిక గాథలలోని పాత్రలలో ఆధునిక భావా లను పొదిగి, ఆ పాత్రలతో అత్యంత ఆధునికంగా సమకాలీన సంభాషణలను పలికించి, సరస జనరంజకము గావించుట వీరికే చెల్లినది. వీరి రచనా వైదుష్యాన్ని మరో సాహితీ ప్రముఖుడి మాటలలో- "విభిన్నమైన ప్రక్రియల్లో, వైవిధ్యమైన కోణాల్లో తన రచనలను పాఠకులకు సాక్షాత్కరింపచేస్తాడు. తాత్త్వికత అంతుర్ముఖీనత, అనుభూతి మమత, ఆలోచనాత్మకత అతని రచనల్లోని అంతఃసూత్రాలు. ఆధ్యాత్మిక భావధార అతని సాహిత్యంలో నిండైన నిరంతర స్రవంతి. ఆత్మను దర్శింపచేసే ప్రభోదాత్మకం అడుగడుగునా గోచరిస్తుంది. విశిష్టమైన కళాత్మక చింతన దృశ్యమానమవుతుంది. కవిత్వం లయాత్మకంగా ఉండి గానయోగ్యతను సంతరించుకుంటుంది. పౌరాణిక పాత్రలను కొత్త కోణంలో ఊహించి అద్భుతంగా ఆవిష్కరింప చేయటం- తద్వారా పాఠకులను ఆలోచనల లోతుల్లోకి తీసుకెళ్ళటం అతని రచనల్లోని పరమార్థం. సంభాషణాత్మక ధోరణిగల అతని రచనలు ఆత్మీయతా ముద్రను కలిగి, చదువరులకు సుబోధకమౌతాయి." ఎంత గొప్ప కితాబు!

గ్రహించిన వస్తువుపై పట్టు, కవిత్వంలో పటుత్వం- వెరసి రచనా వ్యాసంగం తేనెపట్టు అయి, చదువరుల మనసు దోచేస్తాయి. రచయిత ఆలోచనారీతి, ఆవిష్కరింపబడిన 'కొత్త కోణాని'కి పాఠకుడు అచ్చెరువందుతాడు.

నిజానికి భాగవతకథలు-అందునా, గజేంద్రమో క్షము కథలోని 'సిరికిం జెప్పడు', 'లావొక్కింతయు లేదు', 'అలవైకుంఠపురంబులో' లాంటి పోతన పద్యాలు తెలుగు వారి నాలుకల మీద అనునిత్యం అవసరాన్నిబట్టి ఆనంద లాస్యం చేస్తాయి. వీటన్నిటి అర్థసారము గజేంద్రునిపై జాలి, శ్రీవిష్ణువుపై భక్తి. ఒక్కొ సందర్భాన మకరిపై కోపము వచ్చుట కూడా సహజం. కాని భూమయ్యగారి కళాత్మక చింతన వారిని మన అందరిలా ఆలోచించనీయలేదు. న్యాయవాద వృత్తిలో ప్రతివాది తరఫున ఆలోచించి, తన వాదనాపటిమతో ప్రతివాదిని గెలిపించినట్లు మకరి పక్షాన నిలుచున్నారు. 123 పద్యాలలో మకరి అంతరంగాన్ని పాఠకులనే న్యాయాధికారి ముందుంచి కేస్‌ను గెలుచుకున్నారు. పాల్కురికి సోమన అభిమానియైన మన భూమన ఈ కృతిలో, బలవంతుల చేతుల్లో బలియైపోతోన్న ఒక బలహీనుడి పక్షాన నిచిన దళిత వాదిగా, అధిక్షేపకుడిగా, అద్వైతవాదిగా తన ఆలోచనలు మన ముందుంచుతు న్నారు. 'రవి గాంచనిది కవి గాంచును" అనే నానుడి వీరి యెడ వందశాతమూ సాకారమైనది.

స్థాలీపులాక న్యాయంగా- భూమ య్య కవిత్వంలోని సొగసులు, కరి, హరి-ఇరువురిది ఒక పక్షము. మకరిది ఎదురు పక్షము. భౌతికంగా ఏనుగు బలవంతుడు. పరాత్పరుడైన హరిబలము చెప్పనక్కర లేదు.

ఎదుటి పక్షము మొసలి ఒంటరి. బలము తక్కువ వాడు. "బలము కలవానికే కద! బలము కలుగు! వారు బలమగుచుండు రవసరమునకు"! (ప.55) అంటూ బక్కవానికి ఏ ఒక్కడు బలము నీయరు" అంటూ వాపోతుంది మకరి. గజరాజు కొలను చీకాకు పరుస్తుంటే.. జలచరములు విలపిం చాయి. ఆ విలాపం 'చేట చెవులున్నా' ఏనుగులకు వినబడలేదా?' అంటూ నిలదీయుట, విష్ణువు భార్య లక్ష్మీదేవి. ఆమె కమలాలయం కరులు తమ వికృతకరములతో కమలాలను ధ్వంసం చేస్తుంటే 'అమ్మవారికి' కూడా 'నా మొఱవినపడలేదే! అని విలపించుట (ప.23) 'నన్ను దునుమాడుటకు వైకుంఠమే తరలి వచ్చింది. నేనింత బలవంతుడనని తెలిసిం' (ప.34) లాంటి వాక్యాలు పాఠకుడిని ఆలోచిం పచేస్తాయి. ఆనందింపచేస్తాయి.

పదమాధుర్యము: ఒకే అక్షరము మళ్ళీ మళ్ళీ వాడి పద్య సౌందర్యము పెంచుట. కంటి వైకుంఠ మీ కంట కంటినయ్య!(ప.34) నీటగలిసిన మాదు కన్నీటి వరద (పే.40) లెక్కలోనికే రావు మా లెక్కలేవీ (ప.51)లాంటివి

అధిక్షేపము: నా కొలనులోకి వచ్చి తప్పు చేసినది. కరి శిక్ష వేసింది నాకు. ఇదేం న్యాయం? పేదవారు పెద్దలకంటికి ఆనరా? (39) అదేమిటో- ధర్మశాస్త్రాలు కూడా అధర్ముల వేపు చేరుతాయి. ఇదంతా తమ (పరమా త్ముని) లీలగా తీసుకోవాలి (49) కాబోలు.

తాత్త్వికత: ఎరుపు తెలుపు నలుపు పూలు రజ, సత్త్వ, తామస గుణాలకు ప్రతీకలు. అవి మౌన గురువులు (21). అందమైన పూవులు నీ సృష్టియే! వాటిని క్రూరముగా చిదువుతోంటే వారించ వద్దా? (19) నేను నిరాయుధుడను, నీకు చక్రము గద లాంటి ఆయుధాలెన్నో ఉన్నాయి. నన్ను సంహరిస్తున్నావు న్యాయ సూత్రాలు నీకు అవసరము లేదా (35). కండబలమే ధర్మబలముగా నిర్వచిస్తోంటే బలహీనులు ఎలా బ్రతుకుతారు? (53)

బలముడిగి, తనువు దస్సిన గజరాజును రక్షించుటకు వచ్చినావు. సరే! నన్ను ఎందుకు దునుమాడుతున్నావు? (77) సమాజ స్పృహగల రచయితగా ప్రకృతి సమతుల్యత కూడా ప్రస్తావిం చటం ఎంతో సందేశాత్మ కంగా, సమంజసంగా ఉంది (114).

చివరకు మకరి పంచ ప్రాణాలు పంచ భూతాల్లో కలుస్తాయి.అది సమసిపోతూ సంధించిన ప్రశ్నలకు జవాబులు హరి ఇవ్వవలిసిన బాధ్యత ఉందని ముగించటం బావుంది. తన గురువైన కళా ప్రపూర్ణ కీ.శే. దివాకర్ల. వేంకటావధానిగారికి ఈ రచన అంకితమిచ్చి, గురువు యెడ తన గౌరవ భావాన్ని చాటుకున్నారు భూమయ్య గారు. సందర్భానుసారంగా వాడిన జాతీయాలు, మనసుకు హత్తుకు పోతాయి.

రచయిత శ్రీ అనుమాండ్ల భూమయ్యగారు కాదు! కాదు!! 'భూసారం'గారు- (భూమయ్య రచనా సర్వస్వాల సమాహార రససారం) ఏటికి ఎదురీది, క్రొత్త ఆలోచనలను మనలో ప్రవేశపెట్టారు.

వైవిధ్యమైన ఆలోచన, భావ వ్యక్తీకరణ క్రొత్త కోణపు చూపు, నిజాన్ని నిర్భీతిగా ప్రకటించే నిర్మలత్వం, సరళశైలి-ఇవన్నీ ఈ కావ్యాన్ని రసిక హృదయాలను రాగ రంజితం చేస్తూ, నాలుగు కాలాలపాటు నిలిచి ఉండేలా చేస్తాయి.

విద్యార్థులకు పాఠ్యాంశంగా, నిర్ణయించదగిన రచన ఇది.

ప్రతులకు:ఎ. మనస్విని దేవి
ప్లాటు నెం.401,
సాయి రాఘవేంద్ర రెసిడెన్సీ
స్వరూప్‌నగర్, రోడ్ నెం.5, ఉప్పల్
హైదరాబాద్-500 039.
సెల్: 8897073999

- కూర చిదంబరం
సెల్: 8639335675

నే వెళతాను

మనసు సంద్రంలో
కలతల తుఫాను చెలరేగినప్పుడో
వయసు నదిలో
సమస్యల రాళ్లు అడ్డుతగిలినప్పుడో
నే వెళతాను
చిన్నప్పటి జ్ఞాపకాల పడవనెక్కి
హాయినిగొలిపే ఆనందపు తీరానికి.

మాకు తెలియకుండానే
మా బాల్యం
పాదరసంలా పరుగెత్తింది
నదీ ప్రవాహంలా ఉరకలెత్తింది
చెట్టూ పుట్టా
కొండా కోనా
వాగూ వంకా
ఒకటేమిటీ..! దశావతారమూర్తివలె
అన్నింటా మేమే
అంతటా మేమే.

చాటుమాటుగా
కంకులు కాల్చుకున్నా
చెట్టు మొదళ్ళలో
సీతాఫలాలు దాచుకున్నా
డాబ్బా లారీలు తయారు చేసి
అల్లనేరేడు పండ్లు ఆసాతంమోసినా
కలివిడిగా తినేవాళ్ళమే కానీ
విడివిడిగా కాదు
బాల్యం నేర్పిన ఐక్యతా పాఠమది.

చిర్రగోనె ఆడి
చింతబరిగెలతో దెబ్బలు తిన్నా
కోతికొమ్మచ్చి ఆడి
మూతిపండ్లు విరగ్గొట్టుకున్నా
గోళీలాట ఆడి
గోడకుర్చీ వేసినా
గాయాలూ నొప్పులూ శరీరానికే కానీ
మనసుకు కావు.

కథాపుష్పాలను ఎదజేబులో వేసి
శరీరాన్నే కాదు
మనసునూ పరిమళభరితం చేసిన అమ్మ
పద్యమకరందాన్ని చెవిలోపోసి
హృదయాన్నే కాదు
జీవితాన్నే రాగరంజితం చేసిన నాన్న
బ్రతుకు పాఠాన్ని చెప్పి నాకేకాదు
సమాజానికే నడకలు నేర్పేగురువులు
సంతోషపు గుళికలను పరిచయంచేసి
చదువు లక్ష్యమే కాదు
జీవితపు గమ్యాన్నీ నిర్దేశించిన స్నేహితులు
ఒకరేమిటీ..!
ఒకటేమిటీ..!
తలుచుకుంటే అన్నీ మధుర జ్ఞాపకాలే
పరికించి చూస్తే అంతా ఆనందమయమే
అందుకే.... నే వెళతాను
చిన్నప్పటి జ్ఞాపకాల పడవనెక్కి
హాయినిగొలిపే ఆనందపు తీరానికి

వినోదాలు

తిండి ఎక్కువై కొందరు..
చేస్తున్నరు వినోదాలు..
తిండిలేక మరికొందరు..
పడుతున్నరు బాధలు..
వారెవ్వా వినోదాలు..
ఉన్నొడికి రోజు పండుగలు..

శిశువు చేష్టలన్నీయు..
తల్లికి వినోదాలగును..
తల్లి జోలపాటలు..
శిశువును నిద్రపుచ్చును..
తల్లి,బిడ్డల బంధము..
వారికెంతో అనందమిచ్చును..

చిత్రాలు చూస్తు కొందరు..
వినోదాన్ని పొందుతారు..
పనిలోని ఫలితం చూస్తు..
సంభ్రము పొందింకొందరు.
వారెవ్వా వినోదాలు..
రకరకాలుగా పొందును జనులు.

పంట పండించు రైతుకు..
సేద్యమందుండు కైళము..
సరిహద్దున సైనికుడికి..
సేవనుండు సంతసము..
వారెవ్వా హ్వాయలు..
సేవయందు పొందు కర్షక,సైనికులు..

వినోదాలు,వినోదాలు..
విందులో కల్గునందురు..
విలాసము,విలాసము..
విపరీత బుద్ధి అంటరు..
వారెవ్వా వినోదాలు..
మనిషి నైజముకానవాళ్లు.

-పసుల.శంకర్
9542181301

బస్తీవాసులకు అండగా ఉంటాం: కార్పొరేటర్

హుస్సేన్‌సాగర్ నాలా పక్కనే ఉన్న గాంధీనగర్ డివిజన్‌లోని అరుంధతినగర్, సబర్మతి నగర్ బస్తీవాసుల ఇళ్లను తొలగించకుండా అండగా ఉంటామని కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్ హామీ ఇచ్చారు. నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణంలో భాగంగా ఈరెండు బస్తీలలో చాలా ఇండ్లు తొలగిస్తామని జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఇటీవల నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో బస్తీ సంఘాల నాయకులు మెరుగు శ్రీనివాస్‌యాదవ్, జి. నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో సోమవారం కార్పొరేటర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. బస్తీవాసులకు అన్యాయం జరగకుండా చూస్తామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నగర యువ నేత ఎ. వినయ్‌కుమార్, బస్తీ నాయకులు జీవై గిరి, సిహెచ్.రాజు, లక్ష్మణ్‌యాదవ్. అంజద్ పాల్గొన్నారు.

సంస్కరణల్లో మహోపాధ్యాయుడు సంత్ గాడ్గేబాబా

సంస్కరణల్లో మహోపాధ్యాయుడు సంత్ గాడ్గే బాబా అని తెలంగాణ రాష్ట్ర బీసీ కమీషన్ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్ త్యాగరాయ గానసభల ఆధ్వర్యంలో సోమవారం సాయత్రం గాన సభ కళాసుబ్బారావు కళావేదిక లో సంత్‌గాడ్గే బాబా వర్ధంతి సభ, స్వచ్ఛభారత్ లఘుచిత్ర ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర బి.సి. కమీషన్ ఛైర్మన్ డా॥ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు మాట్లాడారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, రఘుపతి వెంకయ్య అవార్డు గ్రహిత ఎన్ గోపాలకృష్ణ, శివసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. సుదర్శన్, తిరుమల వెంకటస్వామి, రచ్చ శ్రీనివాస్, కవి రఘుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మత్తువీడాలి యువత

భావిభారతపౌరులు
శక్తి,యుక్తిగలయువకులు
మాదకద్రవ్యాలమత్తులో
సేదతీరుతున్నారులోకంలో

అంతటా యాదేచ్ఛగా
ఈడ్రగ్స్ అను మహమ్మారి
దావణంలా విస్తరించింది
అందరినీకాలరాజేస్తుంది.

స్కూల్,కాలేజీ,క్లబ్బు,పబ్బు
హోటల్లనిఅంతాటావిస్తరించిఈమత్తుమాఫియపై
అందరికీచేరువఅయ్యింది

జీవితాల్నిబుగ్గిపాలుచేస్తుంది.
బతుకులను కుంగదీసి
ఆత్మహత్యలకు ఎగదోసి
అత్యాచారం,అఘాయత్యం
లవంటిపైఉసిగొల్పుతుంది.
మేధాశక్తినిచిదిమేసి
భవిష్యత్ ను ప్రశ్నార్థకంచేసి
మానవమనుగడఛిద్రంచేసి
జగతికిసవాల్ విసురుతుంది.

ప్రజలు,ప్రభుత్వాలు
మేల్కొనిఉద్యమిస్తేనే
యువతభవితభద్రం.
ఇదిగ్రహించాలియువత
చరిత్రలోమిగిలిపోవొద్దు
శూన్యంగా, హీనంగా!
శక్తి,యుక్తి,మేధాసంపత్తితో
చరితలిఖించాలిధీటుగా!!

-ఎన్.. రాజేష్
9849335757

మలిగే దీపాలు!

దుర్భర పరిస్థితులు పెను శాపాలై
బంగారు బాల్యాన్ని మసి చేస్తున్నాయి!

చిదిమితే పాలు గారే పసి వయసులో
విధి వంచితులై బలి అవుతున్న
దేశ భవిష్యత్తు బీజాంకురాలు!

పేదరికం పెను రక్కసి చేతిలో
బాల కార్మికులై విలవిల్లాడుతున్నారు!

ఆటపాటల కేరింతల వయసులో
కొండరాళ్లను కొట్టే సమ్మెటలవుతున్నారు!

బడిలో అక్షరాలు దిద్దాల్సిన చేతులు
యాచన కోసం తాకట్టుకెళ్లి
కాసుల గలగలలో అలిసిపోతున్నాయి!

రేపటి దేశ పౌరులై ఎదగాల్సిన వీరు
గుప్పెడన్నం కోసం బతుకు గోనె సంచి మోస్తూ
నిస్సహాయులై రోడ్లెక్కుతున్నారు!

చందమామ గేయం పాడాల్సిన గాత్రాలు
ధర్మం చేయమని అర్థిస్తూ జీరబోతున్నాయి!

దుర్మార్గుల చేతిలో బలి పశువులై
అవిటితనం, అంధత్వాలతో
చిత్రవధ అనుభవిస్తున్నారు!

లేలేత అమాయక పిన్న వయస్సులో
దురాశాపరుల దురాగతాలను చవి చూస్తూ
వెట్టి చాకిరీ ఉచ్చులో చిక్కు కుంటున్నారు!

అన్యాయ బాల కార్మిక దురంతాల మధ్య
కొడిగడుతున్న దీపాలవుతున్నారు!

చట్టాలెన్ని వున్నా
బతుకు చట్రంలో బందీలై
వెతల కోతలకు సాక్ష్యాలవుతున్నారు!

-వంగర.
పరమేశ్వరరావు
9491400534

సుదూర తీరాల విశ్వ వినువీధిలో దయాస్పోరా కథా కిరణాలు

పుస్తక సమీక్ష

దయాస్పోరా సాహిత్య ప్రక్రి, ప్రధాన వస్తువైన 'స్థానికత' ఇతివృత్తంగా, రాసిన కథలు, కవిత్వం ఒక సంకలనంగా ప్రచురించాలనే వినూత్న ఆలోచనను, 'దయాస్పోరా తెలుగు కథానిక-2021' సంకలన కర్తలు వంగూరి చిట్టెన్‌రాజు, కె.గీత, శాయి రాచకొండ, 15వ సంక లనంగా సఫలీకృతం చేయడం అభినంద నీయం. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా (హ్యూస్టన్, టెక్సాస్) జ్యోతి వలబోజు, జె.వి. ప్రచురణలు వెలువరించిన ఈ తెలుగు కథానికల సంకలనం 99వ ప్రచురణలో అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, యుకె, సౌదీ అరేబియా, దేశాలలో నివసిస్తున్న తెలుగు రచయితలు, రచయిత్రుల కథలను సంపాదకులు భిన్నమైన స్వదేశీ, విదేశీ భావ సంస్కృతి సమ్మిళితంగా వైవిధ్య భరిత కథాంశాలను ఎంచుకొని, ప్రవాస కథా సంపుటిగా వెలువరించారు.

అరుణ శర్మ నిమ్మగడ్డ (సిడ్నీ ఆస్ట్రేలియా) రచించిన, తొలి కథగా ఈ సంకలనంలో చోటు చేసుకొన్న 'అదే గమ్యం' కరోనా నేపథ్యం, విధి యిచ్చిన తీర్పుగా, సోఫియాను కనుమరుగు చేయటంతో బావ, మరదళ్ల వైవాహిక బాంధవ్యం కొనసాగింది ముగింపు ముందుగానే నిర్ధారించుకొని కథ నడిపిన చతురత కథలో స్పష్టమౌతోంది.

నెల్లుట్ల నవీన్‌చంద్ర (టొరంటో, కెనడా) 'అఅ+అఅ' మంచు తుఫాన్ నేపథ్యంలో చిక్కుకున్న తెలుగు గృహిణి ప్రభకు, ఉద్వేగ, ఆందోళన కారణంగా తనకు తోడుగా ఆ సమయంలో ఒకే బెడ్‌పై వుండటం వలన పరస్పర స్పర్శకు వివశులైన కథనం ఆసక్తి కరంగా వుంది. భారతీయ సంప్రదాయం ప్రకారం యిద్దరూ ఆడవారైనా, మగవారైనా దంపతులుగా వ్యవహరించడం కాబట్టి స్నేహితురాలు జానెట్‌తో అటువంటి కలయిక ప్రభను ఆత్మహత్యకు ప్రేరేపిస్తుంది. సున్నిత హృదయాన్ని ఈ కథ వ్యక్తీకరిస్తోంది.

కొండపల్లి నీహారిణి (సియాటెల్ అమెరికా) ప్రయాణంలో పదనిసలు' కథలో, జీవితంలో ముఖ్య దశలన్నీ ఇండియాలోనే గడిపి, ప్రపంచమే ఇల్లు అనేంతగా పిల్లలు జీవిస్తున్న ఈ రోజులలో అక్కడ ఒక విహారయాత్ర అనుభవాన్ని జీవిత పాఠంగా తాను ఇండియాను మిస్ అవటం లేదని ఈ కథ స్పష్టం చేస్తోంది.

ఉమాదేవి పోచంపల్లి గోపరాజు (రిచ్‌మండ్ హ్యూస్టన్ అమెరికా) తన ఆఖరు చరణం కథలో, దేశం కాని దేశంలో అమ్మ ను ఆస్టిన్‌లో వృద్ధాశ్రవంలో చేర్పించినం దుకు పశ్చాత్తాపంతో, బాధపడుతున్న దంపతులకు, ఆ తల్లి, జీవితం మలుపు తిరిగిందని, సాంత్వన పరచటం ఇతివృత్తం గా రచించారు.

సత్యం మందపాటి (ఆస్టిన్-టెక్సస్, అమెరికా) తన 'ఆశా నిరాశాంతలో..', కరోనా మహమ్మారితో పోరాటంలో దేశం, రంగు, కులం మతాలకు అతీతంగా, మానవాళికి శ్వాస అందిం చిన ఆశ పేరు గల నర్సువంటి వారి మానవతా విలువల త్యాగాలను, కథారూపంగా చిత్రీకరించారు.

డా॥కె. గీత (మోర్గన్ హిల్స్-కాలిఫోర్నియా, అమెరికా) తన 'ఇవాక్యుయేషన్' కథలో, కాలిఫోర్నియాని చుటుముట్టే కార్చిచ్చు కారణంగా, రిస్క్‌జోన్‌లో వున్న ఇల్లు ఖాళీ చేయవలసిరావటం, కరోనా కష్టకాలంలో దంపతుల వేదనను వాస్తవ వేదనా భరితంగా కథగా అందించారు.

పాణిని జన్నాభట్ల (లెక్సింగ్టన్ ఎమ్ఎ (బోస్టన్ శివారు) 'ఎందుకీ అగాధం?' కథలో యోగా, మెడిటేషన్, (భరత నాట్యం) తీవ్ర ప్రభావంతో ఒక అమెరికన్ గృహిణి సారా తన భర్తని, కూతురిని కూడా వదిలి ఇండియాలో ఆశ్రమవాసిని కావటంగా, కథ నడిపించారు. ఏది తప్పో, ఏది ఒప్పో నిర్ణయించే వివేకం, మనుషుల మనసుల పొరల్లో దాగిన నిజాలు వెలికితీయడం అసంభవమని తేల్చిన ఈ కథలో 'శ్రీ' భారతీయ గృహిణిగా మానవతా విలువలకు అద్దం పట్టింది.

డా॥కె. మీరాబాయి (సాన్‌రామన్-కాలిఫోర్నియా- అమెరికా) విద్యార్థులు చదువుకుంటూ వీక్ ఎండ్ పార్ట్ టైమ్ పనులు చేయటం 'ఎందుకోసం' వివరిస్తోంది. స్వంత సంపాదనతో అమ్మ నాన్నలకు పెళ్ళిపోజు కానుక యిచ్చిన అపర్ణ, అమ్మమ్మ మంగమ్మకు అమెరికాలో యువతీ యువకుల ఉద్యోగ బాధ్యతా విలువలు చెప్పే ఆధారంగా రచయిత, కథ నడిపించారు.

రమాదేవి చెరుకూరి (డిట్రాయిట్, అమెరికా) 'ఒక రోజు' కథలో దైనందిన జీవితాలలో ఇంటర్నెట్, ఐ పాడ్ ఆర్ టాబెట్‌లు పిల్లలకు నిత్యావసర ప్రాధాన్యతగా మార్పు చెందుతున్న కథ చదివింప చేసారు. చిన్నతనంలో, ఇళ్ళల్లో పేదపిల్లలు బుడ్డి దీపాల దగ్గర కాకుండా, వీధి కరెంటు



దీపాల దగ్గర చదువుకోవడం, కథలో ఇంటర్నెట్ సౌకర్యం లేక, పార్కింగ్ లాట్‌లో హెూమ్‌వర్క్ చేసుకొంటున్న ఒక సంఘటనతో పోల్చి కథను రక్తి కట్టించారు.

ఖాళీదాస్ (మురళీ శ్రీరామ్ టెక్కలకోట) (డాలస్-టెక్సస్ అమెరికా) తన 'కల కానిది' కథలో, ఏ దేశంలో వుంటే ఆ దేశ సంస్కృతి, వినోదాలు అలవరుచుకుని అక్కడి సమాజంలో ఇమిడిపోవాలని కథారూపక సందేశం అందిస్తారు. కొత్త ఇంటి గృహ ప్రవేశం, నగర దర్శనార్థం కాదు, పార్కింగ్, వంటి కలలు, ఆశలను ప్రతిబింబింప చేస్తాయి. మన సంస్కృతిని మరువకుండా, అమెరికా సంస్కృతిలోని మంచిని తిరస్కరించకుండా అమెరికన్ కలను సాకారంచేసుకోలని రచయిత ఈ కథ ద్వారా తీర్మానింప చేసారు.

ఆర్.శర్మ దంతుర్తి (ఎలిజిబెత్ టౌన్-కెంచుక, అమెరికా) 'కామెర్లు' కథ, ఒక వాస్తవిక సంఘటన కథారూపంగా హృదయాలను కదిలిస్తోంది. ఒక నల్లముస్లిం శరణార్థికి, అమెరికాకి రానిచ్చే ఇమ్మిగ్రేషన్ తిరస్కరించిన అధికారికి అనంతరం ప్రాణభిక్ష పెట్టిన ఒక వైద్యుని కథనం ఇది. నల్లవాడని వర్ణవిద్వేషం, రేసిజంతో వికృతంగా, అమానవీయంగా వ్యవహరించిన అధికారికి తెల్లకామెర్లు సంక్రమించిందని, దారుణమైన రేసిజానికి మందు అమెరికన్‌ల చేతులలోనే వుందని ఈ కథ సందేశం అందిస్తోంది. ఆ నల్లముస్లిం వైద్యుడు అమెరికా రావడానికి సహాయం చేసిన శ్రీనివంగా తెలుగు' వానిగా, ఇండియన్ అమెరికన్, కావటంతో ఈ కథలోని ఫ్లాష్, అద్భుతంగా ఆకట్టుకొం టోంది.

మంచెం విజయలక్ష్మి (విల్డ్ పైర్-యు.కె) కథ 'క్వీన్ డయానా'లో ప్రతి సన్నివేశం వాస్తవమే. ఈ సంపుటిలో చోటు చేసుకొన్న యునైటెడ్ కింగ్‌డమ్ తెలుగు రచయిత్రి కథ యిది. డెబ్బైపైన వయసు పైబడిన వాకింగ్ క్వీన్ డయానా, స్పూరిదాయకంగా, రచయిత్రి మలచి రచించారు.

తాడికొండ శివకుమారశర్మ (వాషింగ్టన్ డిసి, అమెరికా) 'గంటారావం' కథలో, బెల్లువే మీద 'మెర్సిడెడ్ ఎస్‌ఫైవ్ ఫిఫ్టీ' డ్రైవ్ చేస్తున్న రాజు, ప్రయాణ కథనంలో ఉత్కంఠ కలిగించే కథనంలో ఇల్లీగల్ ఇమ్మిగ్రెంట్స్ కష్టాలు స్పష్టమవుతున్నాయి. నల్లరంగు చెండు ఎస్యూవీలు తన కారుని ఫాలో అవటం, అనుమానించిన డ్రైవర్ రాజు ఎటువంటి ఇబ్బంది లేకుండా గమ్యం చేరటంతో కథ సుఖాంతమవుతుంది.

ప్రజ్ఞ వడ్లమాని (సియాటిల్, అమెరికా) 'చలో అమెరికా' కథ,అన్ని పనులు మనమే చేసుకోవాలి, ఇంట్లో అంతా వాళ్ళ పనులలో వాళ్ళు ఉంటారు. అక్కడ మాకు బోర్ అనిభావించే ఇండియా నుంచి అమెరికా వెళ్ళి వచ్చిన తల్లిదండ్రుల అభిప్రాయాలకు అనుగుణంగా వుంది. రెండుసార్లు వెళ్ళివచ్చిన తల్లిదండ్రులు శైలజ, కుమార్‌లు యిక వెళ్ళకూడదని నిర్ధారణ చేసుకొంటారు. కాని కోడలు ప్రియ గర్భవతి, అవటంతో కథ మలుపు తిరుగుతుంది.

మల్లి కేశ్వరరావు కొంచాడ (మెల్‌బోర్న్ ఆస్ట్రేలియా) 'జరాగి చూడు' కథలో, స్వదేశం వదిలి ఆస్ట్రేలియాలో స్థిరపడిన వీరభద్రరావు దంపతులు, అక్కడ తెలుగువారిలో సఖ్యత, మానవ సంబంధాలు సక్రమంగా లేక పోవడం, గమనించటం ఇతివృత్తంగా సాగింది.

కనకదుర్గ జింగరి (పెన్సిల్వే నియా-అమెరికా) 'జీవిత ప్రవాహం' కథలో శ్రేయా, సురేష్ దంపతులు, తమ గృహ సమీపంలో వున్న లొరేన్, క్రైస్తవ కుటుంబంతో సాన్నిహిత్యం, ఆ కుటుంబ కష్టసుఖాలు కథగా రూపొందించారు.

ఉమాభారతి కోసూరి (హ్యూస్టన్ టెక్సస్) 'త్రిశంకు స్వర్గం' కథలో రేణు భర్త, రాఘవ మరణించటం, కొడుకులు రాం,భరత్ తల్లిని పట్టించుకోకపోవటం, దురదృష్టవశాత్తు రేణు డిమెంషియా, ఆల్జిమర్స్ వ్యాధులకు గురి కావటంతో ఆమె జీవితం త్రిశంకు స్వర్గం కావటం, స్నేహబంధంతో తార, ఆమెను నిరంతరం కాపాడటం కథగా నడిపించారు.

మహమ్మద్ అమ్జద్ అలీ (జెడ్డా సౌదీ అరేబియా) 'దేశంలో భార్య, విదేశంలో పరిచారిక!' కథలో హైదరాబాద్ ముస్లిమ్ యువతి జరీనా, సౌదిపెళ్ళి, ఆమెకన్న పంచరంగుల కలలు కల్లలుగా జీవన విషాదం వాస్తవ కథనం సృష్టించారు.

సంధ్య యల్లాప్రగడ (అట్లాంటా, అమెరికా) రచించి 'నొప్పిగా ఉంది కదూ!!!' కథలో ఎనిమిదేళ్ళ తిషి, న్యూక్లో ఎదుర్కొంటున్న 'బుల్లీయింగ్' అవమానాన్ని, శ్వేతజాతి పిల్లలకు తెలిసేటట్టుగా స్నేహితులతో ప్రేమగా వుండాలని హేళన చేయకూడదని తెలియచెప్పే క్లాస్‌రూమ్ ప్రయోగం కథగా నడిపించారు.

రాధిక మంగిపూడి (ముంబై, ఇండియా) 'సింగపూర్ పని మనిషోపాఖ్యానం' కథలో, 70 ఏళ్ళ వయస్సులో బతుకు తెరువు కోసం కాయకష్టం చేసుకొంటున్న ఆ వృద్ధ మహిళ కథనం చమక్కులతో ఆసక్తికరంగా చదివింప చేసింది. మానవత ప్రతిబింబింప చేసింది.

మాచిరాజు సావిత్రి (ఎడ్మంటన్ కెనడా) ' సక్సెస్ స్టోరీ'లో మూర్తి, సుధాకర్, సరస్వతమ్మ ముగ్గూరూ అమెరికాలో వున్న అవకాశాలను విజయవంతగా ఉపయోగించుకొని జీవితాలను మలుచుకొన్న తెలుగువారిగా, కథ నడుస్తుంది. స్వదేశం రాక, మళ్ళీ అమెరికా తిరుగు ప్రయాణంలో ఆ ముగ్గురు అనుభవించిన కథనాల కారణంగా తీసుకొన్న దృఢ నిర్ణయాలు రచయిత్రి, నిజాయితీ ధోరణిలో ఆదర్శవంతంగా ప్రతిబింబింప చేసారు.

శ్రీధర్ రెడ్డి బల్లా (క్యూ పెర్టినో, అమెరికా) 'మాతృప్రేమ' కథలో, తొంభై ఏళ్ళ వయసువున్న అమెరికన్ మహిళ, కారు నడుపుకొంటూ కొడుకును కలవడానికి శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి లాస్ ఏంజిల్స్‌కు వెళ్ళటం ప్రధాన ఇదివృత్తం. తెలంగాణ పలుకుబడితో ఆ మహిళ పట్ల, ప్రయాణం పట్ల శ్రీను తల్లిదండ్రులు స్పందించిన మానవ విలువలు కథకు జీవం అందించాయి.

దీప్తి పెండ్యాల (హ్యూస్టన్, అమెరికా) 'ముసుగు' కథలో శరత్, క్రిస్టీల కుమార్తె శర్వాణీ విషయంలో, తండ్రి శరత్ ప్రోగ్రెసివ్‌గా వర్ణ వివక్షకి వ్యతిరేకంగా తనకు వున్న 'ఇమేజ్'పై ముసుగు కప్పుకొని వ్యవహరించటం, పెళ్ళికి గ్రేసన్ పట్ల ప్రతీకూల ఆలోచనలు రచయిత్రి అద్భుతంగా ఆవిష్కరించారు.

పూడిపెద్ది శేషుశర్మ (వాషింగ్టన్ డిసి అమెరికా) వేపుపువ్వు కథలో, చిన్నప్పటి పెంపకం సక్రమంగా లేకపోతే వికృత వ్యక్తిత్వం ఎల్లా రూపుదిద్దుకొని, మనుషులు సంసారంలో అశాంతి, నరకాన్ని సృష్టిస్తారో సత్యం పాత్ర చెప్తుంది. అమెరికన్‌ని పెళ్ళి చేసుకొన్న కూతురు, మరొక అమెరికన్ స్నేహితునితో జీవన సన్నిహితుడైన కొడు కుల జీవితాలను శాసించే హక్కు తమకు లేదని, తల్లిదండ్రులు అనుకూలంగా వ్యవహరించాలని వేపపువ్వు కథ స్పష్టం చేస్తోంది.

జి.ఎస్.ఎస్. కళ్యాణి (కాలిఫోర్నియా, అమెరికా) 'వ్యత్యాసం' కథ, ఏ పనిలో అయినా విజయం సాధించాలంటే, భగవత్కృపతో పాటు మానవ ప్రయత్నం అవసరమని కాత్యాయని విశ్వసిస్తుంది. నమ్మకానికి, చాదస్తానికి ఉన్న వ్యత్యాసం, భార్యతో పాటు భర్త కూడా గ్రహించేటట్టు సనాతన సంప్రదాయ విలువలకు ఈ కథ అద్దం పడ్తోంది.

సుభద్ర వేదుల (న్యూజెర్సీ, అమెరికా) రచించిన 'హెూం ఆటోమేషన్!' కథలో. ఇంట్లో ఉండే లేట్లూ, ఫాన్లూ, స్విచ్‌లు రిమోట్ లేదా మొబైల్‌తో కంట్రోలు చేయటం స్పెషల్ ప్రాజెక్ట్ చేపట్టిన మనుమడితో, వత్తులపని ఆటోమేషన్ ప్రస్తావించిన బామ్మ తెల్లవారేసరికి అనాయాస (ఆటోమేటిక్) మరణం చదువరుల గుండెలను స్పృశిస్తుంది.

శ్యామలాదేవి దశిక (న్యూజెర్సీ, అమెరికా) 'శ్రీలక్ష్మి' కథలో, నలభై ఐదేళ్ళ దాంపత్య జీవితంలో. భర్త అహంభావంతో తన ఉనికిని పట్టించుకోకపోయినా, ఆమెకు యివ్వవలసిన గౌరవాన్ని ఇవ్వక పోయినా, గుండెల్లో నిండు సంతోషంతో ఆఖరి ఉత్తరం రాసిన భార్య వ్యక్తిత్వాన్ని జీవించి వుండగా గ్రహించలేని భర్త దౌర్భాగ్యాన్ని ఈ కథ తెలియచేస్తుంది. భర్త హరిమూర్తి కారణంగా అమెరికా వచ్చి బయట ప్రపంచాన్ని చూడగలిగానని, ముత్యాల్లాంటి పిల్లల్ని, ఇంతటి సౌభాగ్యాన్ని పొందిన తను ఎంతో అదృష్టవంతురా లినని ఆమె రాసిన ఉత్తరం కథకు అద్భుతమైన ముగింపు అయింది.

రాధిక నోరి (ఫ్లోరిడా, అమెరికా) రాసిన 'మరోనూరు' కథలో అరవై ఏళ్ళు దాటిన తర్వాత మళ్ళీ పెళ్ళి చేసుకోవటమే కాక పది వసంతాలు వైవాహిక జీవితం పూర్తి చేసుకొన్న శుభ సందర్భం జరవుకొని, ఒంటరితనం డిప్రెషన్ లేకుండా జీవితం గడుపుతున్న వృద్ధ దంపతుల కథ, ఆదర్శప్రాయంగా వుంది.

వంగూరి చిట్టెన్‌రాజు (హ్యూస్టన్, టెక్సస్), అమెరికా క్యూపన్ల కథ ఈ సంకలనంలో ఆఖరి కథగా చోటు చేసుకుంది. అతి తక్కువ ధరలకు వస్తువులు లభిస్తే, కొనటానికి తాపత్రయపడే భారతీయ మనస్తత్వంపై ప్రముఖ హాస్య రచయిత చిట్టెన్‌రాజు తనదైన చమత్కార శైలిలో కాగితం కూపన్లు తగ్గి కంప్యూటర్ క్యూపన్ల వచ్చి పడిన కథనాన్ని, హాస్యకథగా గిలిగింతలు పెట్టారు.

'దయాస్పోరా తెలుగు కథానిక-2021, సంకలనంలో సుదూర తీరాలలో స్థిరపడి, ఆ స్థానిక ప్రాంతాల కుటుంబాలతో కలిసి పోయి, తాము పుట్టి పెరిగిన జీవన సంస్కృతి, సంప్రదాయ విలువలతో అక్కడి జీవిత విధానాలపై ఎల్లా స్పందిస్తున్నదీ, కథల రూపంగా రచయితలు, రచయిత్రులు ప్రతిభావంతంగా వ్యక్తీకరించారు. తెలుగు సాహితీ రంగంలో కొత్త భావనలకు, కథా కల్పనా వాస్తవిక ఆలోచనా రచనా తీరు తెన్నులు ఈ కథలు ప్రతిబింబింప చేస్తున్నాయి.

ప్రతులకు: జె.వి. పబ్లికేషన్స్
సెల్:80963 10140

-జయసూర్య
సెల్: 9440664610

హైకూలు

తారతమ్యత
తణుకులాడదులే
స్నేహబంధాన.

స్నేహ నీడన
తరతమ భేదము
పాకులాడదు.

కృష్ణ కుచేలే
చక్కనైన చుక్కాని
మిత్రబంధాన.

ద్వాపారంలోనే
దర్శించాము స్నేహము
శిఖర సమం.

సుధామునికి
సుందర ఆహ్వానము
సుదర్శునుచే

బంగరు ఊసు
బాల్యమిత్రుల ఆట
కృష్ణ సుధామ.

అటుకులనే
ఆప్యాయంగా అర్పించే
అచ్యుతునకు.

స్నేహ సపర్య
చెంతనుండి అందించే
చక్రాధరుడు.

కీర్తనీయము
మాధవ సుధామల
స్నేహ బంధము.

మానవీయము
మాధవ సుధామల
మైత్రీబంధము.

-నగునూరి రాజన్న
8332963129

మరణమా!

జన్మ దుఃఖం జరా దుఃఖం పునఃపునః
దుఃఖ మయమైన పుట్టుక- మించిన వేదన
మరొకటి లేని మరణం
కానీ తప్పనిది.. తప్పించుకోలేనిది
అంతులేని బాధల బరువు
క్రుంగదీస్తూన్న జీవితం ముందు
అది ఎంత మధురం
సంకుచితం సంతరించుకున్న
విలువలు లేని ఈ లోకంలో
మనిషిని మనిషి మాయముసుగులో
తేనెకత్తితో కోసి పడేసే
అరాచక వ్యవస్థలో
స్వార్థం స్వారీ చేస్తూన్నప్పుడు
బలవంతుడు రాజై రాజ్యాక్రమణ
పర్వానికి తెరలేపుతున్నాడు
నీతి విలువల్ని ఖననం చేసి
మానవీయతను కాల్చి పడేసి
దాడి చేసి దోచుకొనే ఆటవిక
సంస్కృతికి ఊపిరులూది
కులమత వైరుధ్యాలు.. జాతి వైషమ్యాలు
వేర్పాటు వాదాలు.. భాషా బేధాలు
అతివాద తత్వాలు..
దురాక్రమణ అంకాలు
నాగుపాములై పడగ నీడల్ని కాయించి
సామరస్య సరోవరానికి
వక్ర భాష్యం చెబుతూంటే
మౌన భాష్యమైన మానవీయత
మూగగా రోదిస్తోంది
బ్రతికినంత కాలం
క్షణక్షణం చస్తుంటే
ఆ చావు ముందు
ఓ మరణమా నీవెంత మధురం.
కానీ అణగారిందనుకొన్న
ఆశావాదం వెన్నుతట్టినపుడు
ఎడారిలో నీటి చలమల్ని తవ్వుకొనే నేను
బాధల బరువులోను
బ్రతుకు బంధాన్ని కాంచాను.
మరణ శాసనం శాసిస్తూన్నా
అగ్ని పర్వతాన్ని అధిరోహింప గల్గే ఓర్పు
గతినీ గమనాన్నీ నిర్దేశిస్తోంది
నీవు మధురమని భ్రమపడ్డనాకు
అంధకారంలో వెలుగురేఖని
ప్రసరించి ప్రసన్నుణ్ణి జేసింది.

- వడలి రాధాకృష్ణ

బాల్యం

బాల్యం ఒక వరం
దేవుడిచ్చిన బహుమానం
ఎప్పటికి మరవలేము మనం
ఆ పసిప్రాయం ఆ అమాయకత్వం.

అమ్మ చేసే గారాబం
నాన్న చూపించే అభిమానం
ఎన్నటికీ మరపురాని జ్ఞాపకం
ఆ అందమైన వర్షాకాలం
ఆ కాగితపు పడవలు నీళ్లలో వేయడం
నీళ్లలో గెంతులు వేయడం
ఉయ్యాల లో ఊగడం
చీకులు చింతలు లేని జీవితం.

కాలం మారింది తరం మారింది
ఎటుచూసినా నలుగుతున్న పసితనం
రక్షణలేని బాల్యం
సమస్యల సుడిగుండంలో చిన్నతనం
హాని తలపెడుతోంది స్వంత బందుగణం
లేతప్రాయంలోనే
చాకిరీలో దిగబడిన జీవనం

చాచా నెహ్రూ పుట్టినదినాన్ని స్మరిద్దాం
చిన్న పిల్లలను ఎంతగా ప్రేమించాడో
ఈ దినాన గుర్తుచేసుకుందాం
శాంతి కపోతాలను ఎగురవేద్దాం
దేశం కోసం
చాచా చేసిన త్యాగం తలుచుకుందాం
ఒక చిట్టి గులాబీని కోటుకు తగిలిద్దాం
విరిసిన విరియని మొగ్గ లాంటి పసితనం
మన చంటిపిల్లలను మనమే రక్షించుకుందాం
కొత్త రోజులు రావాలని
మనసారా కోరుకుందాం
కాపాడుకుందాం మన రేపటి తరాన్ని
ఎందుకంటె నేటిబాలలే రేపటి పౌరులు



-అరుణ డేనియల్
9000606889

అవును రైతే గెలిచాడు

రైతు గెలిచాడు
అవును రైతే గెలిచాడు.

ఏడాది పాటు అలుపెరుగని పోరు
సాగు చట్టాల లోపాలను ప్రశ్నిస్తూ
సాగిన పోరు..రైతు పోరు
చివరకు రైతే గెలిచాడు.

ఏడువందల మంది
ప్రాణాలు బలిగొన్న వెనక్కి తగ్గని పోరు
కార్లతో తొక్కించి, తుపాకులతో కాల్చి
ముళ్ల కంచెలతో, బారికేడ్లతో అడ్డగించి
అణగదొక్కిన ఆగని పోరు
"వాటర్ గన్నులతో" తరిమేసినా
మడమతిప్పని పోరు..రైతు పోరు
చివరకు రైతే గెలిచాడు

ఎండలు మాడ్చేసినా
చలి గాడ్పులు వణికించినా
ప్రాణాలే ఫణంగా పెట్టిన పోరు
ముసలి, ముతక.. ఆడ,మగా
కలసి కదం తొక్కిన పోరు..రైతు పోరు
చివరకు రైతే గెలిచాడు

హలాలతో పొలాలను దున్నడమే కాదు
కడుపు కాలితే రాజధాని నడిబొడ్డున
హక్కులకై కవాతుచేసే పోరు..రైతుపోరు
అధికారముందికదా అని
అణిచివేత చట్టాలను తెస్తామంటే
తాటతీసిమరి
అనుకున్నది సాధించినపోరు..రైతుపోరు
చరిత్రను తిరగరాసిన పోరు
చరిత్రను సృష్టించిన పోరు
చివరకు రైతే రాజయిన పోరు
అవును రైతే గెలిచాడు

-డా॥ పాక వెంకటేశ్వర్లు
9849436891

కుప్పల తిప్పలు

మడిలో ముత్యాల గొలుసులు
వరి చేను నిండా ఆశల రాసులు
అరుగాలం చెమట చెలిమెలు
అవిశ్రాంత సాగుబడి పోరాటాలు !

దిగులును దిగుమతి చ

మన చదువుల మహా తల్లి

తరాలు మారినా తొణకని
విజ్ఞాన వటవృక్షమై
జ్ఞాన సంపదను అందరికీ పంచుతూ..
కాంతులు విరజిమ్మే అమరజ్యోతియై
రీవిగా దర్పంతో వెలుగులు విరజిమ్ముతోంది!
అక్షర పిపాసకులకు అమృతమూర్తి అమ్మలా
చదువుల చల్లి అన్నాన్ని
కడుపారా నింపుతోంది!
ఈ ప్రాంగణంలోని పచ్చని వృక్షాలపై
వాలిన జ్ఞాపకాల పక్షులు
తీయని కుహూ నాదాలను
అనుక్షణం ఆలపిస్తూనే ఉన్నాయి!
విడిపోయిన స్నేహ కరచాలనాలు
ప్రేమగా గుండెలకు హత్తుకొని
ప్రపంచ వీక్షణాన్ని క్షణంలో
కనుల ముందు సాక్షాత్కరింపజేస్తున్నాయి!
ఆటపాటల హుషారు జోరులో
కాలానికి సంకెళ్లు వేసిన
నేస్తాల తీపి కబుర్లు
గాలిలో గిరికీలు కొడుతూ
ఎన్నో ఊసుల మూటలు
ముడి విప్పుతూనే వున్నాయి!
జీవితంలో నిలబడే
వ్యక్తిత్వానికి ఊపిరిలూదిన
గురువుల ఆశీర్వచనాలు ఫలించి
బంగారు భవిష్యత్తుకు
రహదారులు పరిచి
ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దుతూనే వున్నాయి!
ఈ సరస్వతీ విజ్ఞాన సామ్రాజ్య పుడమిలో
ప్రతి మట్టి కణం
మధుర గాథలను ఆవిష్కరించే
గంగా ఝరీ జీవ మాధుర్య
అమృత దొంతర రెపరెపలెన్నో!
అంతరాల అడ్డుగోడలను కూల్చి
నిప్పులాంటి నిఖార్సైన
మనిషిగా నిలబెట్టిన
ఆదర్శ భావ భాగ్యోదయ సుప్రభాతాలెన్నో!
ఉద్యమాల మహాజ్వాలలకు అగ్నిని రగిల్చి
అన్నుదన్నుగా వెన్నంటి నిలబడి
భుజం తట్టి గుండెల నిండా ధైర్యం నింపిన
ధీర చరిత రణస్ఫూర్తి
సంగ్రామ సంఘటనలెన్నో!
ఎన్నో మధుర జ్ఞాపకాల
కూడలియై వెల్లొందుతుంది!
మహా సముద్రాన్ని తోడి పోసినట్లుగా...
తవ్వి తీసిన కొద్దీ కంచికి చేరని
కథగా మిగులుతూ...
కళ్ళు మిరుమిట్లు గొలిపే కాంతులీనుతూ...
గొప్ప గొప్ప వ్యక్తిత్వ సముదాయ కూడలియై
అబ్బురపరిచే ఘనాపాటీల
పరిచయ అమృతాన్ని ప్రసాదిస్తూ...
చదువుల విలువల చాటే
అమర వాణీ ప్రబోధ ప్రాంగణాలయం!

-వంగర.
పరమేశ్వరరావు
9491400534

కలం కన్నీరు కారుస్తోంది

మండే సూర్యుని తో చెలిమిని చేసుకొని
పుడమి తల్లి ని ఎదలో కొలుచుకొని
కాడి మేడిని పలుగు పారను
ఆయుధాలు గా మలచుకొని
సరిహద్దు లో సైనికుడి లా
కథనరంగమై కదిలే కర్షకులను చూస్తాంటే
ఇవాళ నా కన్నెందుకో కన్నీళ్ళు కారుస్తోంది.

చెమట చుక్కలను చిందిస్తూ
ఎండిన డొక్కలను ఎగదోసుకుంటూ
బురద నుండి బువ్వను తీసి
ప్రపంచానికి పట్టెడన్నం పెట్టే రైతు
ఇప్పుడు కళ్ళం లోనే కన్ను మూస్తాంటే
ఇవాళ ఎందుకో నోటి కాడ
ముద్ద నోట్లోకి వెళ్ళనంటూంది

గిట్టుబాటు ధర కోసం అరిచి గీ పెట్టినా
ఏరి కోరి ఎన్నుకున్న ఏలికలు
పాషాణా లై పక్కకు పోయి
రాజకీయ రంగులను అద్దుకొని
మైకుల ముందు పులు లై
ప్రవచనాలను పలుకుతుంటే
ఇవాళ నా మనసెందుకో
చిరాకు పడుతూంది

ఆరుగాలం కట్టబడి ఆరబోసిన ధాన్యం
వాన నీళ్ళ తో వియ్యమందుకుంటాంటే
ఆశల స్తంభాలు కూలిపోయి
కన్న కలలన్నీ చెదిరి పోయి
చంటి పిల్లాడిలా గుక్క పెట్టి ఏడుస్తుంటే
ఇవాళ నా గుండె చెరువై
నా తనువంతా కొలిమి లా రగులుతాంది.

కాలం గాయం చేసినా
నకిలి విత్తనపోడు నట్టేట ముంచినా
ధైర్యాన్ని గుండె ల నిండా నింపుకొని
పుడమిని చీల్చుకొని పుట్టే మొక్క లా
నాగేటి సాళ్ళలో నడుస్తుంటే
రైతన్నను చులకనగా చూసే మనుసులను
చూస్తాంటే
ఇవాళ నా కలం
కన్నీరు కారుస్తోంది

-తాటిపాముల రమేష్
7981566031

అమృతోత్సవ భారతికి అక్షరహారతి...

పుస్తక సమీక్ష

మన దేశం డెబ్బది ఐదు వసంతాల స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా కిన్నెర సంస్థ ఆధ్వర్యంలో కిన్నెర సంస్థ వ్యవస్థాపకులు శ్రీ మద్దాళి రఘురాంగారి సంపాదకత్వంలో అమృతోత్సవ భారతికి అక్షర హారతి పడుతూ ఓ కవితా సంకలనాన్ని వెలువరించారు. భరతమాతకు శ్రద్ధాభక్తులతో ప్రముఖ 75 మంది కవులు, కవయిత్రులు రాసిన కవితలతో కొలువుదీరిన "అమృతోత్సవ భారతి" కిన్నెర వారి 130వ గ్రంథంగా వెలువడటం ముదావహం. 1980వ సం॥ నుండి కిన్నెర పబ్లికేషన్స్ ద్వారా గ్రంథ ప్రచురణలో మద్దాళి రఘురాంగారు చూపుతున్న చొరవ.. అందిస్తున్న సేవలు అభినందనీయం. రఘురాంగారు స్వయంగా రచనలు చేస్తూ.. పుస్తకాలను ప్రకటిస్తూ వివిధ ప్రక్రియల్లో పలువురు ప్రముఖుల 130 గ్రంథాలను తమ పబ్లికేషన్స్ ద్వారా ఇప్పటివరకు ప్రచురించడం ప్రశంసనీయం.

బంకించంద్ర ఛటర్జీ, కలం నుండి జాలువారిన వందేమాతరం.. రవీంద్రనాథ్ టాగోర్ రచించిన జాతీయగీతం వెలుగులో.. భాతరమాతకు అమృతోత్సవ వేళ.. దేశమంతా వేడుకలు జరుపుకుంటున్న సందర్భంలో.. అమృతోత్సవ భారతి పేరున కవితా సంకలనాన్ని వెలువరించి రఘురాంగారు తమ దేశభక్తిని చాటుకున్నారు. సంకలనకర్తగా.. కావ్యకర్తగా.. కార్యకర్తగా అందరి మన్ననలు అందుకుంటున్న మద్దాళి రఘురాంగారు సందర్భానుసారం సామాజిక చైతన్యం కోసం వివిధ గ్రంథాలను వెలువరించారు. ఇప్పుడు 75 మంది ప్రముఖ కవులు, కవయిత్రులతో భరతమాతకు అక్షరాంజలి ఘటించేందుకు వీలుకల్పిస్తూ "అమృతోత్సవ భారతి"ని పాఠక లోకానికి అందిస్తున్నారు.

దాశరథి కృష్ణమాచార్యులుగారి స్వాతంత్ర్య మాసం కవితలో ప్రారంభమై.. మద్దాళి రఘురాంగారి అమ్మా! భారతీ! వందనం కవితతో పూర్తయిన ఈ గ్రంథంలో డా॥సి. నారాయణరెడ్డి, కరుణశ్రీ, భోయి భీమన్న, గుంటూరు శేషేంద్రశర్మ, ఎన్. గోపి, ఆచార్య తిరుమల, ఆచార్య కొలకలూరి ఇనాక్, డా॥ ఎల్లూరి శివారెడ్డి, డా॥ అనుమాండ్ల భూమయ్య, సుద్దాల అశోక్‌తేజ, డా॥ వోలేటి పార్వతీశం, డా॥ ముక్తేవి భారతి, రజరాజు, రాధశ్రీ, డా॥ తెన్నేటి సుధాదేవి, డా॥ ఏనుగు నర్సింహారెడ్డి, మౌనశ్రీ మల్లిక్, డా॥ రామాచంద్రమౌళి, డా॥ అయా చితం, డా॥ కొండపల్లి నీహారిణి, డా॥ టి. గౌరీశంకర్, డా॥ ఎండ్లూరి సుధాకర్, డా॥ వడ్డేపల్లి కృష్ణ, శైలజామిత్ర, డా॥సి. భవానీదేవి, పెరుగు రామకృష్ణ, రమణ వెలమకన్ని, చీకోలు సుందరయ్య, పొత్తూరి సుబ్బారావు. శారదా అశోకవర్ధన్, ఎస్.ఆర్. భల్లం, కొండ్రెడ్డి, డా॥ పత్తిపాక మోహన్, అయినంపూడి శ్రీలక్ష్మి, సుధామ, రాజేశ్వరి దావాకర్ల తదితర సాహితీ దిగ్గజాల కవితలతో ముస్తాబైన ఈ గ్రంథం ప్రతీ ఒక్కరు చదివి స్ఫూర్తినొందదగింది.

ప్రతి గ్రంథాలయంలో ఉండదగింది. తినతిండి లేనివాడు కనిపంచబోని నాడు ఆర్జించుఉన్న స్వేచ్ఛ.. అసలైన స్వేచ్ఛయగును అంటూ దాశరథిగారు రాసిన కవిత గ్రంథం తెరవగానే అందరినీ ఇట్టే ఆకట్టుకుంటుంది. ప్రగతి పథంలో సమతారథం" శీర్షికతో కరుణశ్రీగారు రాసిన కవితలో.. నీవూ నేనూ కలిస్తే మనం.. మనం మనం కలిస్తే జనం జనమంతా ఒకటైతే ప్రయోజనం.. అందుకే సమతా సూత్రాల నియోజనం అంటూ అందరికీ ప్రేరణను కల్పించారు. బోకి భీమన్నగారు తమ కవిత ద్వారా దేశం ముందడుగు వేయాలని కాంక్షిస్తే.. ఈ నేల పండించుకున్న స్వాతంత్ర్యాన్ని ఇకముందు మనం పందించవలసింది దళిత జీవుల అభ్యుదయ రథాన్ని అంటూ డా॥సి. నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ' నాదేశం వెన్నుముక' పేరుతో గుంటూరు శేషేంద్రశర్మ గారు తమ కవితను కాగితాల పడవల్లో కలలు ప్రయాణాలు చేస్తున్నాయం టూ ప్రారంభించారు. మూడు అక్షరాలు కలిస్తే ప్రణవమనీ.. మూడు రంగులు కలిస్తే పతాకమంటూ0 జాతిని రసాత్మక వ్యాక్యంగా.. దేశాన్ని ఓ నిఘంటువుగా అభివర్ణిస్తూ ఆచార్య తిరుమలగారు తమ కవితను రూపుదిద్దారు. డా॥ఎన్.గోపిగారు 'ఫ్రీడమ్ ఫైటర్' శీర్షికతో రాసిన కవిత ఆసక్తికరంగా మలచబడింది.



పరాయి జండాను దించి.. గగనాన్ని చుంబించిన భారతీయ పతాకం నింగిచుక్కల జమా ఖర్చులు.. నేల ఇసుక రేణువులకు అప్పజెప్పింది అంటూ 'జాతీయ పతాకం' శీర్షికతో డా॥ కొలకలూరి ఇనాక్‌గారు తమ కవితను రూపుదిద్దారు.

దేశం కోసం అమరులైన దేశభక్తులను స్మరించుకుందాం.. వారి ఆశయ సేవలో తరిద్దామంటూ డా॥ ఎల్లూరి శివారెడ్డిగారు పేర్కొంటే..

'విముక్త భారతి' శీర్షికతో డా॥ అనుమాండ్ల భూమయ్యగారు రాసిన కవితలో... స్వతంత్ర్య భారతావనిని.. ఆత్మశక్తితో వెలుగొందే అతీత మహోన్నత శక్తిని.. అన్యుల పాదాక్రాంతం కాని ఊహాతీత అమృత శక్తిని.. నేను విముక్త భారతిని.. స్వతంత్ర్య భారతావనిని అంటూ భరతమాత స్వగతాన్ని అక్షరాల్లో అవిష్కృతం చేశారు.

కనీసం.. స్వర్ణోత్సవాల నాటికైనా నా దేశ వలస కూలీలు.. కాలుకదపకుండా ఉంటారా? రాజా మీ పరిపాలన బాగుండాలి. మీ అధికారం కొనసాగాలి.. కొకపోతే ఇది ప్రజాస్వామ్యమని గుర్తించాలంటూ హితవు పలికుతూ డా॥ ఎండ్లూరి సుధాకర్‌గారు తమ కవితను రాశారు.

అమృతోత్సవ సాక్షిగా.. మహనీయుల, మహాత్ముల, త్యాగధనులు స్మృతుల్ని అభిషేకించడానికి.. మరే అభిషేకజలం కోసం వెతుక్కోకుండా నా కంటి కొనల నించి.. కన్నీటి ధారలనిస్తాను అంటూ డా॥ పెరుగు రామకృష్ణగారు రాస్తే.. ఇదే ఇదే స్వతంత్ర్య దివ్యభారతం.. అదే అదే సువర్ణరాగ కేతనం" అంటూ 'అమృత భారతి' పేరుతో డా॥వై. రామకృష్ణారావు గారు తమ కవితను ఎత్తుకున్నారు.

రక్తి, యుక్తి, భక్తి, ముక్తి సకల సంపద్వంత ధామం నా దేశం సర్వ జన గణమనోభిరామం అంటూ కవి సుధామ గారు తమ స్వాభిమానాన్ని చాటుకున్నారు.

విశ్వమంతా విస్తుపోయేలా.. సప్తవర్ణాలు ఏకం చేస్తూ.. నమగ్రీవమై వినవస్తున్నది. జన్మనిచ్చిన జనని యశోగీతిక అంటూ డా॥ వోలేటి పార్వతీశం గారు రాశారు. మనసంతా మహా త్రివర్ణం అంటూ డా॥సి. భవానీదేవిగారు రాస్తే.. నీ దేశంలో జరుగుతున్న విధ్వంసాలకు వ్యతిరేకంగా నిలిచి.. నెత్తురు గొంతుకతో అను వందేమాతరం అంటూ డా॥ సుద్దాల అశోక్ తేజగారు పిలుపునిచ్చారు.

జలియన్ వాలాబాగ్, హోహోకారాలు.. రక్తధారలను తప్పించుకోని దైన్యాలను.. దిక్కుతోచని బేలతనాన్ని.. గుండె ఎగిసి కారే కన్నీరును.. ఆర్ద్రంగా డా॥ ఏనుగు నర్సింహారెడ్డిగారు తమ కవిత ద్వారా గుర్తు చేశారు.

దేశమంటే ఎగిరే త్రివర్ణ పతాకం చిరునామా అని అయినంపూడి శ్రీలక్ష్మిగారు పేర్కొంటే.. మనదేశం ఈ డెబ్బది ఐదు ఏళ్లలో సాధించిన ప్రగతిని కీర్తిస్తూ డా॥ వడ్డేపల్లి కృష్ణగారు రాశారు. ఇది నిరంతర అనంత యాత్ర అంటూ రామాచంద్రమౌళి గారు రాస్తే త్రివర్ణ కపోతం పేరుతో రజరాజుగారు తమ భావాలను అక్షరాల్లో బంధించారు. స్వతంత్ర్య భారతి కాదిది.. నముజ్వల భారతం అంటూ డా॥ అయాచితం నటేశ్వర శర్మగారు తమ కవితను తీర్చి దిద్దారు.

అమృతాన్ని అందరికీ అందిస్తున్న ఈ భారతదేశం నిజంగా 'అమృత భాండమే' అంటూ డా॥ రాధశ్రీగారు పేర్కొంటే.. ముప్పన్నెల జెండాను రూపొందించిన పింగళి వెంకటయ్యను స్మరిస్తూ కవి రమణ వెలమకన్నిగారు తమ కవితనను రాశారు.

భారత వటవృక్షం.. పలుపక్షుల గూళు అంటూ వైజయంతి పురాణపండ తమ కవితను ప్రారంభిస్తే.. అమరుల త్యాగాల చరితను హిమాలయ గీతాలనడుమ అంటూ డా॥ పత్తిపాక మోహర్‌గారు తమ కవితను కొనసాగించారు.

నేను భారతీయుడను అంటూ డా॥ ఫణీంద్ర నా దేశం ఓ నిరంతరం శబ్ద చైతన్యం అంటూ వద్దిపర్తి రామకృష్ణగారు శ్రీవత్సగారు, ప్రవుల్లభారతి పేరుతో డా॥కొండపల్లి నిహారిణిగారు తమ కవితల్ని రాసి గ్రంథానికి శోభను కూర్చారు.

మహాద్వైతం పేరుతో మరుమాముల దత్తాత్రేయ శర్మగారు మాతృవందనం పేరుతో డా॥ టి. గౌరీశంకర్‌గారు నేటి తరానికి ఒకమాట అంటూ డా॥ తెన్నేటి సుధాదేవిగారు తమ కవితల్ని తీర్చిదిద్దారు.

ఓట్ల ఆయుధంతో దుష్ట పాలకుల దనుమాడుదామంటూ కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డిగారు నా త్రివర్ణ పతాకాన్ని చూసినప్పుడే నాకు కంటి చూపుందని తెలుస్తుందని అంటూ మౌనశ్రీ మల్లిక్‌గారు తమ కవితను రాశారు.

నా దేశం నా ప్రాణం.. భరతమాత నా కన్న తల్లి అంటూ డా॥ శరత్‌జ్యోత్స్నా రాణిగారు భరతమాతకు అభినందన వందనాలు సమర్పించారు.

జగతికి దేశ ఔన్నత్యాన్ని చాటేందుకు పునరంకితమవ్వడం మనందరి కర్తవ్యంగా భావిద్దామంటూ పిలుపునిస్తూ గుండెల మీద పతాకం ఎగరాలంటూ చీకోలు సుందరయ్యగారు ఆకాంక్షించారు.

'చిరునవ్వుల యుద్ధం' శీర్షికతో శివకుమార్‌గారు పేరిశెట్ల రాస్తే.. అక్షర సైనికులకు అభినందనం సమర్పిస్తూ గురజాడ శోభాపేరిందేవిగారు తమ కవితల్ని తీర్చిదిద్దారు.

తెరుచుకున్న గవాక్షాలు నిండు పున్నమి. కాంతులతో అమృతోత్సవ భారతిని ఆహ్వానించాయంటూ పొత్తూరు సుబ్బారావుగారు రాస్తే.. మనసంతో గమనం అంటూ వేదం సూర్యప్రకాశం గారు తమ కవితను రూపుదిద్దారు.

ఇలా.. మన భారతదేశ 75 సంవత్సరాల స్వాతంత్ర్యదనోత్సవ సందర్భంగా 'అమృతోత్సవ భారతి' పేరుతో మద్దాళి రఘురాంగారు తమ సంపాదక త్వంలో వెలువరించడాన్ని అందరం స్వాగతిద్దాం.. అభినందిద్దాం... భారత స్వాతంత్ర్య అమృతోత్సవేళ అందరికీ శుభాకాంక్షలు తెలియజేద్దాం.

ప్రతులకు: కిన్నెర పబ్లికేషన్స్
2-2-647/153,
ప్లాట్ నెం.101& 102
మద్దాళి గోల్డెన్ నెస్ట్,
సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ,
హైదరాబాద్-500 013.

- దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

కార్టూన్లు

చూడ్డానికి చిత్రముగానున్న..
చూపరులా ఆకర్షించును..
చలన కౌశలం మెండైతేనె..
చిత్రాన భావము పొందించును.

వ్యంగ్యమైన చిత్రాలైనా..
సందేశమెంతో ఒదిగుండును..
చూడచక్కని బొమ్మలైనా..
చూపరుల మనసు మెల్కోల్పును..

నిమ్మలంగా ఆలోచిస్తే..
మర్మమంతయు మదిన దోచును..
నిగూఢ అర్థమును కల్గుండి.
నిజాన్ని బయట పెడుతుండును..

ప్రజా సమస్యలు తెలుపుతూ..
పాలకులను నిలదీస్తుండును..
సమస్యలేవైనా సర్కారుకు..
ప్రజల పక్షాన తెలుపుతుండును..

మస్తిష్కానికి పని చెబుతూ..
మనుషులను కదిలిస్తుండును.
మానవాళికి ఉపయోగపడుతు..
మేల్కొనేలా చేస్తుండును..

-పసుల.శంకర్
9542181301

ఆ చేతుల్ని

ఆ చేతుల్ని ఎలా మరవగలను
చేతివేళ్ళను కూడా-
తమలపాకుల్లా సుకుమారంతో
జాజితీగల్లా సువాసనల్తో లేవు
నున్నగా సన్నగా లేవు
ఎరఎర్రని గోరింటాకుతో లేవు
పోనీ అరచేతులు అద్దాల్లా మెరుస్తున్నాయనీ
కాదు-
ఆ చేతులే వేరు-
ఆ చేతుల్లో
ఓ గొప్ప సృజన
ఓ గొప్ప ఆవిష్కరణ దాగుంది-

ఒడిలో పిల్లాడు చెంద్లకై దేవులాడుతున్నాడు
పైట పదేపదే జారిపోతోంది
ఆ వొంపువైపు తోడేళ్ళ గుంపు-
ఆమెకి అవేమి లెక్కలేదు
అంగట్లో కూర్చుంది-
మెదడు నుండి ఏ సంకేతం లేదు;
వెదురుబుట్టకు రూపాన్నిస్తుంది
ప్రాణంపోస్తోంది
వెలకట్టని చేతులు
శ్రమని నిలబెట్టిన చేతులు-
గతకాలపు జ్ఞాపకాలన్నీ చేదైనా
దుఃఖపు సుడులేవో తిరుగుతున్నా
అవమానం భరిస్తోంది
బతుకును జయిస్తోంది-

-కోటం చంద్రశేఖర్
9492043348

అనాథైన పోస్ట్ బాక్స్

సుదూర మనుషులనే కాదు..
మనసుల్ని కూడా కలుపగల..
మహా మంచి వార్తల వారధి..
బాధలు, అనుబంధాలు..
శుభ, అశుభాల వార్తలు..
సుఖ దుఃఖాల కబుర్లు..
నిండు మనసుతో మోస్తూ..
అందరి మనసు దోచేసి..
ఉత్తరాలతో కడుపు నింపుకున్న..
మర్యాదెరిగిన నాటి సారథి
నరలోక వార్తల వితరణశీలి
మా ఊరి ఎర్ర పోస్ట్ డబ్బా !

నిత్యం పోస్ట్‌మాన్ రాకకై..
వేయి కళ్ళతో ఎదురు చూసే..
ముసలి ముతక జీవులు..
పిల్లల క్షేమ సమాచారాలు..
ఉద్యోగ నియామక లెటర్లు..
మంచి చెడుల మతలబులు
ప్రేమగా గడప దాకా చేర్చే..
పేద ధనిక బేధం చూపని..
సమానత్వమే తన తత్వమన్న..
బడుగు బలహీనుల చుట్టం..
నాటి ఆత్మీయ అమృత నేస్తం !

మా ఊరి కూడలిలో..
రాజ ఠీవీతో తలెత్తుకొని..
అందరు తన వాళ్ళని ఎంచి..
ఎండకు ఎండి వానకు తడిసి..
సదా నోరు తెరిచి పిలిచి..
కార్డు,కవర్లను ఆహ్వానించి..
తన కడుపు నింపుకొన్న..
మా పోస్ట్ బాక్స్ హృదయం..
ఆకాశమంత సువిశాలం..
భూదేవంత శాంతి సహనం !

కాలం ఎంత పని చేసింది ?
మా ఊరి పోస్ట్ డబ్బా..
గతాన్ని నెమరేసుకుంటూ..
తుప్పు పట్టి చిక్కి శల్యమై..
పండు ముసలి ఒరిగినట్లు..
ఓ పక్కకు ఢీనంగా వాలిపోయి..
తాళం తీసే నాధుడే కరువై..
క్షేమాన్ని అడిగేటోళ్లు లేక..
ఎర్ర రంగు ఎలిసి పోయి..
డబ్బాకు రంధ్రాల గాయాలై..
ఉత్తరాల జాడ కరువై..
రందితో మూలన కూర్చొని..
దిక్కు మొక్కు లేదంటూ..
అనాథలా అంతరించి..
ఎక్కి ఎక్కి ఏడుస్తోంది !

- మధుపాళీ
9949700037

అమృతనం-అన్వేషణ

గర్భసంచిలో తిరిగే పిండం
గిలిగింతలు పెట్టినప్పుడు
అమ్మగా తాను పొందే అనుభూతిని
కొలిచే సాధనమేమై ఉంటుందో
పరిశీలిస్తున్నా

తల్లితనం పొందే పోరాటంలో
ఎన్ని "డాల్స్" నొప్పిని తాను భరించిందో
మరెన్ని ఎముకలు విరిగితే
మాతృత్వాన్ని తాను చవిచూసిందో
లెక్కించే పరికరమేమైనా ఉందా
ఆలోచిస్తున్నా.

స్తన్యమిచ్చి..
బిడ్డను సాకడంతోనో
బుజ్జగించి..
గోరుముద్దలు తినిపించడంతోనో
తన బాధ్యతల బరువు తీరిపోతుందా

ఎదిగే బిడ్డను ఎదపై మోస్తూ
పసికందును ప్రయోజకున్ని చేసే దిశలో
దిశా-దశా నిర్దేశం చేస్తూ
తానెన్ని పోరాటాలు చేస్తుందో
ఎన్ని ప్రవాహాలకు ఎదురీది నిలుస్తుందో

అక్షరమొక్కటే..
వాన్ని లక్ష్యపు కక్షలోకి చేర్చేదని
తెలిసినపుడు
బుజాలపై బిడ్డ..ప్రవాహానికి ఎదురీత
భారమని ఎలా భావిస్తుంది

అందుకే..
అమృతనాన్ని కొలవడానికి
ఆ కమ్మదనాన్ని ప్రమాణీకరించడానికి
కొలమానమేదైనా ఉందా అని
అన్వేషిస్తున్నా !

-డా: పాక వెంకటేశ్వర్లు
9849436891

పల్లె చిరునామా!

గాలికి గంధం పూసినట్టు
ఉండే పచ్చదనాల పరిమళం.

ఆ పచ్చని గుణాన్ని నవ్వుల్లో
మాటల్లో నింపుకున్న సహజగుణం

ఉదయాలకు సడి అద్దే
ఎద్దుల గంటలు
హృదయాలకు పరవశమద్దే
లేగల గెంతులు....

ఏమైంది ఆ ఆనంద నందనాల
పల్లెతనపు ధీమా!
టెక్నాలజీ వన్నెల్లో
చిక్కుకుని గింజుకుంటున్నది
పల్లె చిరునామా!

ఇప్పుడంతా పట్నం వాసన
వేస్తూ పల్లె కూడా
అంతా హంగామా!

గుట్టలు,చెట్లు,పొలాలు,చెరువులు
అన్నీ అక్రమార్కుల కబంధ
హస్తాలలో....

ఇప్పుడు మచ్చుకైనా కనబడని
పల్లెతనపు మధురిమ
స్మృతులలోనే ఆ వైభవాల
సరిగమ...



- వెల్ముల జయపాల్ రెడ్డి
9441168976

రైతు పోరు పోరు గెలుపు

బోలో బోలోరే జై జై బోలోరే
జై జై బోలోరే బోలో బోలేరే
రైతు పోరుకు పోరు గెలుపుకు ॥బోలో'॥

మూడు నల్ల చట్టాలను చెల్లనివ్వమని
రద్దు చేసే వరకు మా యుద్ధమాగదని
ప్రాణాలను ఫణంగ పెట్టి ఉద్ధమానికి
ఊపిరి ఊదీ పోరాటానికి ప్రాణం పోసి
విజయ కేతనం ఎగర వేసిన
పోరు స్ఫూర్తి చాటి చెప్పిన ॥బోలో'॥

నిందలెన్నో మోపినగాని నిలబడ్డారు
కుట్రలెన్నో పన్నినగాని ఎదిరించారు
పొలాలు దున్నే హలాలు దండుకు
అందరు అండా దండా నిలువగ
మోడీ షాల మెడలను వంచి
కాడి మేడీ సాధించిన గెలుపుకు ॥బోలో'॥

అమరులైన రైతుల కలలు తీరాలన్నా
కోరుకున్న రోజులు మనకు రావాలన్నా
పోరు తప్ప మరో దారి లేనే లేదని
మరో మారు రుజువు చేసిన రైతు పోరు
భూమిని నిలబెట్టిన విజయం
వ్యవసాయాన్ని కాపాడిన గెల్పుకు ॥బోలో'॥

-ఉప్పెన
8106073661

చిలుక

అందమైన తోటలోన
రంగురంగుల చిలుక
దోరమగ్గిన జామపండు
తినరావ ఏం అలక
మాతోటి చెలిమి చేయ
బెదురెందుకో తెలపక.

పచ్చని తోట నాకిష్టం
చిగురాకుల ఊయల నాకిష్టం
పచ్చని పెరడు నీకుంటేను
నీవు పిలవకనే నేనొస్తాను
నీతోటి చెలిమి చేస్తాను
కొమ్మన ఊయల ఊగుతూ
కబుర్లెన్నో నే చెబుతాను

-లతా శ్రీ
9666779103

నాన్న, నన్ను క్షమించు...!! (కథ)

చొక్కా లేక మాసిన గడ్డంతో, ముళ్ళు పొదల ఉన్న తల వెంట్రుకలతో, తిండి లేక ఎండి కండ కరిగిన అస్థిపంజరం లాంటి తనువుతో, పట్టుమని 26 ఏళ్లు నిండని ఓ యవ్వన కుర్రాడు కూటికోసం రోడ్డు పక్కనున్న మురికి కాలువలో ఏదో ఓ పని చేస్తూ ఉన్నాడు..

అప్పుడు అతనికి ఆరు అడుగుల దూరంలో decent గా dignity గా వేషధారణ ధరించి, కాళ్లకు బూట్లు తగిలించి, ఈ సువాసనను భరించలేక ముక్కును ఓ గుడ్డతో మూసుకుని, ఇతని వైపు దీటుగా, సూటిగా చూసి అసహ్యించుకుని, చక్రాల తగిలించిన మానవ యంత్రము వలె పరుగులు తీస్తున్నాడు.. అతన్ని అలా చూసిన ఈ కుర్రాడికి తన పాత జ్ఞాపకాలు భూమి మీద పడిన వర్షపు చినుకుల స్పర్శకు మొలకెత్తుతున్న విత్తనం వలె గుర్తుకొస్తున్నాయి...

నాన్న!!

నువ్వు మండే ఎండలో రక్తపు స్వేదాన్నీ చిందించి అలసిన యంత్రముల బలిసిన వారి కింద, బానిస పనులు చేస్తూ, నీ మాసిన బ్రతుకును తలచి చింతిస్తూ, నీ కష్టాన్ని మా ఇష్టాలకు ఖరీదుగా కడుతూ, నీ బరువెక్కిన భారమైన బ్రతుకు వలె మా భవిష్యత్తు కాకూడదని, ఎలాగైనా మా తలరాతలు మార్చాలని, దానికి మార్గం చదువు ఒకటేనని గ్రహించిన నీవు.

ప్రైవేట్ కాలేజీలో చదివితే తొందరగా ఉద్యోగాలు వస్తాయని

మీ షావుకారి కొడుకు ఎక్కడో పట్టణంలో ప్రైవేట్ కాలేజీలో చదువుతున్నాడని, స్తోమత లేకున్నా ఆర్థిక ఇబ్బందులున్నా నన్ను మారుమూల ప్రాంతం నుంచి పట్టణానికి పంపించావు నేను గొప్పొన్ని అవుతానని ఆశతో, ఆశయంతో చెల్లి పెళ్లి కోసం పొదుపు చేసిన పైసలు కట్టి నన్ను ప్రైవేట్ కళాశాలలో చేర్పించావు.

బలిసిన వారి బాబులు వారి కొడుకులకు కోరిందన్ని కొనిచ్చారని, వారి ముందు నాకు అవమానం జరుగుతుందేమోనని గ్రహించి మెతుకులు తినే సమయంలో కూడా కష్టపడి ,చదువు కోసమే కదా అని కోరినదన్ని కొన్ని తెచ్చావు ఈ కొరువు పెట్టే కొడుకు కోసం, నీ నిద్రను త్యాగం చేసి నాకు ప్యాకెట్‌మనీ ఇచ్చావు. నీవు ఎండలో కష్టపడి నన్ను నీడలో చదివించావు, నీ పాదాలను నాకు బూట్లుగా అల్లావు, నీ కాళ్ళను నా మోటార్సైకిళ్లు గా చేసావు, నీ తనువును నాకు మెత్తటి పరుపు గా చేసావు, కష్టం తెలియక కాయం కరిగింపక నన్ను రాజకుమారుని వలె పెంచావు..

ఇన్ని ఇచ్చిన నీకు నేనేమిచ్చాను?!

పాఠాలు వినక, కళాశాలకు సరిగ్గా పోక, స్నేహితులతో విహారయాత్రలు తిరుగుతూ నీ పైసలుతో స్వర్గ సుఖాలు అనుభవించాను. మందేస్తూ .చిందే స్తూ సినీ థియేటర్‌లో సిటీ కొడుతూ, సిగరెట్ వెలిగిస్తూ తాత్కాలిక సుఖాలకు పుప్పుటి కోసం పూలు చూట్టు తిరిగే తేనేటిగలా బానిసయ్యాను..

కొవ్వెక్కి లవ్వంటూ చేతులు మొత్తం కోతలు వేసుకుని ఆమె చుట్టూ తిరిగాను, ప్రశ్నించిన అమ్మను తిడుతూ నిందించిన చెల్లిని కొడుతూ, నిలదీసిన నీకు కన్నీటిని బహుమానంగా అందించి ఆ కన్నీటికి కాలువ తీసి అందులో నీ ఆశయాలను పాతి పెట్టాను...

నీ కష్టం మొత్తం కాలిన ఇనుము పై పడి ఆవిరైన పన్నీటి బిందువయ్యింది, కడలి ఉదకము నందు కలిపిన పంచదార, తేనె అయ్యింది.. ఆరోజు నేను చేసినది తప్పని చెప్పిన అర్థం కాలేదు. దానికి ప్రతిఫలం ఈరోజు ఈ స్థితిలో దుఃఖాన్ని అనుభవిస్తుంటే అర్థమయ్యి ప్రయోజనం లేదు. ఎందుకంటే నా జీవితం ఇప్పటికే అర్థమై వ్యర్థమయ్యింది కదా. కాలిన బొగ్గు మళ్ళీ తన పూర్వపు కర్ర ఆకారము పొందునా.

నన్ను ఈ జన్మకు క్షమించు నాన్నా! నిన్ను మోసం చేస్తూ నన్ను నేను మోసం చేసుకున్నందుకు కాలం నాకు కఠిన శిక్షే వేసింది.

నా అనే వారు దూరమయ్యాక తెలిసింది, నడి సముద్రంలో ఈత రాక నగ్నంగా మునిగిన నిజం నేనని. మళ్లీ జన్మంటూ ఉంటే నీ కొడుకు గానే పుట్టి నా తప్పును సరిదిద్దుకునేందుకు

ప్రయత్నిస్తానాని ఆలోచిస్తూ.. పాపాలతో కూడుకున్న ఆ మురుకి కాలువలో తనవంతు ఒక కన్నీటి బొట్టును చిందించి అందులో కలిపేశాడు. ఇంతలో తన పక్కనున్న స్నేహితుడు "అరేయ్ భోజనానికి సమయమయ్యింది, అసలే ఈ రెండు రోజుల నుంచి పని లేక నీకు భోజనం లేదు కదా ! ఉదయమే ఆకలన్నావుగా రా వెళ్దాం"

తొలితరం కవి "బలిజేపల్లి"



కవితాకళానిధి శ్రీబలిజేపల్లి లక్ష్మీకాంతకవి హరిశ్చంద్ర నాటక రచయితగా అందరికీ తెలుసు. మరికొన్ని ఇతర నాటకాలు రాసారనీ తెలుసు. అయితే ఆయన సుమారు 20 సినిమాలకు పైగా పాటలు, మాటలు రాసారన్న విషయం మాత్రం చాలా కొద్ది మందికి మాత్రమే తెలుసు. అదీ సినిమా పాటలపై పరిశోధనచేసిన వారికి, లేదా సినిమా సాహిత్యం పై అంతో ఇంతో అభిరుచి- అభినివేశం ఉన్నవారికి మాత్రమే తెలుసు. అయితే ఆపరిశోధకులు కూడ కేవలం బలిజేపల్లిని స్పృశించి వదలిపెట్టారేగాని, వారి సినీసాహిత్యంపై సమగ్ర చిత్రణ చేయలేదు. అలాచేయటం అసాధ్యంకూడ. ఎందుకంటే సముద్రమంతటి సినీసాహిత్యంలో ప్రతికవినీ సమగ్రంగా విశ్లేషించటం అసాధ్యం.అందుకే సినీకవిగా బలిజేపల్లిని గూర్చి నేను పరిశీలించి నంత మేరకుఒక చిన్న ప్రయత్నం మాత్రం ఇది.

బలిజేపల్లి లక్ష్మీకాంతకవి 23-12-1881 న బాపట్ల తాలూకా ఇటి కంపాడులో జన్మించారు.30-06-1953 న కాళహస్తిలో నిర్యాణం చెందారు. తండ్రి నృసింహశర్మ. తల్లి ఆదిలక్ష్మమ్మ. లక్ష్మీకాంత కవి కర్నూల్‌లో మెట్రిక్యులేషన్ చదివారు. చిన్నప్పటి నుండీ తన మేనమామ గారైన చెన్నకృష్ణయ్య గారి వద్ద సంస్కృతాం ధ్రాలను బాగా అధ్యయనం చేసారు. కవిత్వంపైనా సంగీత సాహిత్యాలపైనా మంచి అభిరుచిని పెంపొందించుకొన్నారు.

కర్నూల్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో హెడ్ గుమస్తాగా కొంతకాలం పనిచేసారు. ఆతరువాత గుంటూరు హిందూకాలేజ్‌లో తెలుగు పండితునిగా పనిచేసారు. ఆపై ఉద్యోగంవదిలి సంస్థానాలను సందర్శించి, అవధానాలు చేసారు.1920 లో చల్లపల్లి రాజావారి సహాయంతో గుంటూరులో "చంద్రికా ముద్రణాలయం" న్ని స్థాపించారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని కారాగారశిక్షను అనుభవించారు.1926లో ఫస్ట్ కంపెనీ పేరిట గుంటూరులోనే నాటక సమాజాన్ని స్థాపించారు.

బలిజేపల్లి 1.బుద్ధిమతీ విలాసం (1905), 2. ఉత్తరరాఘవం(1910), 3.సత్యహరిశ్చంద్రీయం(1912), 4. సాత్రాజితీయం(1914) అనే నాల్గు నాటకాలు రాసారు. శివానందలహరి శతకం, స్వరాజ్య సమస్య అనేపద్యకృతి, బ్రహ్మరథం,మణిమంజూషవంటి నవలలు,రాసారు.అయితే వీరి గ్రంథాలన్నిటిలోకి "మాగ్నమ్ ఆఫ్ ది ఓపస్" సత్యహరిశ్చంద్రీయ నాటకమనే చెప్పాలి. అదేవీరికి తెలుగునాట అజరామరమైన కీర్తి ప్రతిష్ట లను సాధించి పెట్టింది.

శ్రీచిత్తజల్లు పుల్లయ్యగారి ప్రోత్సాహంతో బలిజేపల్లి చిత్రసీమలోకి అడుగుపెట్టారు. 20 సినిమాలకు మాటలు,పాటలు,పద్యాలు రాసారు.కొన్ని సినిమాలలో ప్రధానపాత్రల్ని పోషించారు. మరికొన్ని సినిమాలలో అతిథిపాత్రలలో కనిపిస్తారు. చక్కని ఆహార్యం, దానికి తగ్గ కంఠస్వరం వీరికి జన్మతః లభించాయి.వీరు పాటలురాసిన సినిమాలక్రమం ఇది.

1) లవకుశ(1934) 2)హరిశ్చంద్ర1 (1935) 3) కృష్ణజరాసంధ(1938) 4) వర విక్రయం(1939) 5) మళ్ళీపెళ్ళి(1939) 6) విశ్వమోహిని(1940) 7) భూకై లాస్ (1940) 8) జీవన్ముక్తి(1942) 9) బాల నాగమ్మ(1942) 10) గరుడగర్వ భంగం (1943) 11) సీతారామ జననం(1944) 12) తాసిల్దార్(1944) 13) భక్తతులసీ దాస్(1946) 14)ముగ్గురు మరాఠీలు (1946) 15) బ్రహ్మరథం(1947) 16) రక్షరేఖ (1939) 17) శ్రీలక్ష్మమ్మకథ(1950) 18) మాయారంభ (1950)19) సంక్రాంతి (1952) 20) హరిశ్చంద్ర2(1956).

1934లో తీసిన లవకుశ సినిమాకోసం బలిజేపల్లి మొత్తం 21పాటలు రాసారు.కొన్ని పద్యాలుకూడ రాసారు.కొన్ని పద్యాలు కంకంటి పాపరాజు ఉత్తరరామాయణం నుండి తీసికోవటం జరిగింది. ఇందులో చాకలివ్యక్తికి అతని భార్యతో అత్తమామలతో, జరిగిన వాదోపవాదాల్ని పాత్రోచితభాషలో ఒకమంచి పాటరూపంలోకి ఇలాతెచ్చారు.

"సూరిగాడు నీకాసి సూసినసూపు నీకొల్లు
పులకరింపులతో యెత్తించె కైపు..
నీసైగలు నేచూడలేదో ఆతోటవైపు
తలుసుకుంటె సాలు తరుగుకు పోతున్నాది
మనసు తెగుసుకు పోతున్నాది.."

అంటూ అనుమానంతో వేగిపోయే వాడిమనసు ఎలా సలసలా కాగిపోతుందో ఈపాటలో వ్యక్తంచేస్తారు కవి. అలాగే చివరలో యాగాశ్వాన్ని బంధించిన కుశలవులకు - లక్ష్మణునకు జరిగిన వాగ్వాదం ఒక సీసమాలికలో భలే వ్యంగ్యంగా, అధిక్షేపాత్మకంగా సాగిపోతుంది.

అద్దంకి శ్రీరామ్మూర్తి హరిశ్చంద్రునిగా 1935 లోను, ఎస్.వి. రంగారావు హరిశ్చంద్రునిగా 1956 లోను, వచ్చిన రెండుసినిమాలకూ పాటలతోబాటు బలిజేపల్లి హరిశ్చంద్ర నాటకంలోని పద్యాలనుకూడ తీసుకోవడం జరిగింది.

కృష్ణజరాసంధ సినిమాకు బలిజేపల్లి 20 పాటలురాసారు.ఇందులో 12 పద్యాలు కూడ ఉన్నాయి.అయితే పద్యాల్ని వేలూరి శివ రామశాస్త్రి గారు రాసారు. జరాసంధునిచే చెరపట్టబడిన రాజులు,రాణులు తమని చెరనుండి రక్షించమని "రమామనోహర నీదయరాదా/నుమునీచెరబాపగ" అంటూ బాధతో వేడుకొనే పాటను బలిజేపల్లి ఎంతో ఆర్తితో రాసారు.

శ్రీకాళ్ళకూరి నారాయణరావుగారు రాసిన వరవిక్రయ నాటకం శ్రీ సి.పుల్లయ్య గారి దర్శకత్వంలో చలనచిత్రంగా రూపొం దింది. సినిమాలో చాలావరకు సంభాష ణలు, పద్యాలు కాళ్ళకూరివారివే. ఈ సినిమా కోసం బలిజేపల్లి మొత్తం18 పాటలు రాసారు.కట్నమిచ్చి పెళ్ళిచేసు కోవటం ఇష్టంలేని కాళింది యొక్క వ్యధని **"స్వాతంత్ర్య మే లేదా? /ఈస్త్రీ జాతిలో నే జని యింపనేలా/"** అంటూ స్త్రీస్వాతంత్ర్య రాహిత్యాన్ని కాళింది ముఖతః చెప్పిస్తారు కవి. అలాగే ఆరోజుల్లో గాంధీ చరకా ప్రభావాన్ని కూడా ఒకపాటలో వర్ణిస్తారు.

వై.వి.రావు - కాంచనమాల నాయికా నాయకులుగా నటించిన "మళ్ళీపెళ్ళి" చిత్రానికి కవి 14 పాటలు,2 పద్యాలు రాసారు. బలిజేపల్లి ఇందులో వకీలుపంతులు పాత్రలో నటించారుకూడ.

"ఆనందమేగా వాంఛనీయము/అవని బ్రతుకే ఆశావహము/ భావిసుఖమే జీవితాశ/- అంటూ కమల,లలిత అనే స్నేహితురాండ్రపై చిత్రించిన పాట ఆరోజుల్లో ప్రేక్షకుల్ని బాగా అలరించిందంటారు.

"విశ్వమోహిని" ఒక సినిమాతార జీవితాన్ని చిత్రించే సినిమా.ఈ సినిమా కోసం బలిజేపల్లి మొత్తం 14పాటలు రాసారు.

"భూకైలాస్" సినిమాకి మాటలు పాటలుకూడ బలిజేపల్లే రాసారు.మొత్తం15 పాటలు,2 పద్యాలు, 1చూర్ణిక రాసారు. ఇందులో మండోదరి చెలులతో కలిసి పాడిన "సుమదోలీ కేళీ హోళీ" అనేపాట ఆరోజుల్లో విస్తృత ప్రచారాన్ని పొందింది.

"జీవన్ముక్తి"లోని వస్తువు ఒకపంచమజాతికి చెందిన కుటుంబం మహాభక్తితో అనేక అవరోధాల్ని దాటి శ్రీమహా విష్ణువు దయకు పాత్రులు కావటం. వీరిభక్తిని గేలిచేస్తూ వీరినెన్నో కష్టాలకు గురిచేసే రాజగురువు పాత్రను బలిజేపల్లే పోషించారు. ఇందులో కవి మొత్తం 18 పాటలు,1పద్యం రాసారు. ఇంచుమించు పాటలన్నీ భక్తితత్త్వ ప్రబోధకములే.

బాలనాగమ్మ సినిమాకోసం బలిజేపల్లి 14 పాటలు,2 పద్యాలురాసారు. ఇందులో భూలక్ష్మి ఇచ్చిన మాటప్రకారం పాముకాటుకు గురికావటానికి వెళుతూ బాధతో తన ఏడుగురు ఆడపిల్లల్ని ఉయ్యాలలో వేసి ఊపుతూ "లాలీ..లాలీ.. మిముజూచే వారెవరో? ఉయ్యలలూగే వారెవరో?" అంటూ పాడిన పాటను కవి ఎంతో కరుణరస భరితంగారాసారు. బలిజేపల్లి ఇందులో బాలనాగమ్మ తండ్రి నవభోజరాజుగా నటించారు. కార్యవర్తి రాజుగా బందా కనకలింగేశ్వరరావు, బాలవర్ధిరాజుగా మాస్టరు విశ్వం, బాలనాగమ్మగా కాంచనమాల, సంగుగా పుష్పవల్లి నటించారు.

ఇక "గరుడగర్వభంగం" చిత్రం కోసం కవి 9 పాటలు,4 పద్యాలురాసారు. "సీతారామజననం"లో దైత్యగోపాలం, బలిజేపల్లే ఇరువురూ కలిసి 13 పాటలు,6 పద్యాలు రాసారు.ఏవి ఎవరురాసారన్నది ఇదమిత్థంగా తెలీదు."తాసిల్దార్ " సినిమాకు 11 పాటలురాసారు.

లంక సత్యం దర్శకత్వంలో తీసిన "భక్తతులసీ దాస్" చిత్రానికి బలిజేపల్లి మాటలు,పాటలు కూడరాసారు. ఇందులో 6 తెలుగుపాటలు 1 పద్యం బలిజేపల్లి రాసారు.4 హిందీపాటలు కూడా ఉన్నాయి. వాటిని పండిట్ చల్లానరసింహశాస్త్రి రాసారు.

"ముగ్గురు మరాఠీలు" కోసం 12 పాటలు,"బ్రహ్మరథం" సినిమాకోసం 13పాటలు,6పద్యాలు రాసారు.

"రక్షరేఖ" లోని "జీవనడోలీ/ జీవనడోలీ/మధురజీవన కేళీ" అనేపాట హైలెట్ అయింది.బలిజేపల్లికి ఈ"డోలీ" అనేపదం బాగా ఇష్టమనిపిస్తుంది. భూకైలాస్ లోని "సుమదోలీకేళీ"అంటూ రాసిన పాట కూడా అలాగే హిట్ అయింది. ఇందులో హీరో తండ్రిపాత్రని బలిజేపల్లే పోషించారు. అక్కినేని,భానుమతి,అంజలి ఇందలి ప్రధానపాత్రలు.

శ్రీ లక్ష్మమ్మ కథ కు మొత్తం15 పాటలు బలిజే పల్లి రాయగా,మాటలు గోపాలరాయ శర్మ రాసారు.

"మాయారంభ" సినిమాకు మాటలు పాటలుతో బాటు"కాపాలిక" అనే ఒకచిన్నపాత్రను కూడా కవిగారు ధరించారు. ఇందులో 13 పాటలు,3పద్యాలు ఉన్నాయి.

"సంక్రాంతి" సి.పుల్లయ్యగారి దర్శకత్వం లో తీసిన ఒకసాంఘిక సినిమా. ఇందులో 9పాటలతో పాటు 2ఇంగ్లీష్ సాంగ్స్ కూడా ఉన్నాయి. ఎఫ్.ఎస్.రావ్ అనే ఒక విచిత్ర పాత్రకి ఈపాటలు పెట్టారు. ఇందులోని "ఆశలమారి ఇల్లాలైతే/ఆసంసారము గతి ఇంతే/ అంటూ రాసిన పాట, ఆరోజుల్లో ఉమ్మడి కుటుంబాల్లోని గయ్యాళి స్త్రీలపెత్తనాన్ని స్ఫురింపజేస్తుంది.

ఈవిధంగా 1934 నుండి 1952 దాకాఅంటే తాను మరణించటానికి ఒక సం॥రం ముందుదాకా బలిజేపల్లి సినిమాల కోసం పాటలు రాస్తూనే ఉన్నారు. సుమారుగా ఆయన మొత్తం 20 సినిమాలకోసం 250పాటలు,30 పద్యాలు రాసారు. ఇవి కాక వీరి హరిశ్చంద్ర నాటకంలోని పద్యాలు మొదటి హరిశ్చంద్ర సినిమాలో 20, రెండవ హరిశ్చంద్ర సినిమాలో25 స్వీకరించటం జరిగింది.

ఇక చెప్పాలంటే సినిమాల తొలినాళ్ళలోని పాటలు విషయప్రధానంగా, కథాప్రధానంగా సాగేవి.మంచిమంచి ప్రతీకలు, గొప్పగొప్ప పోలికలు తొలినాళ్ళలో పెద్దగా కనిపించవు. అంతేకాదు కవిత్వంపాలు తక్కువగా ఉండి కేవలం కథను నడపటానికి పనికివచ్చే పొడిపొడి మాటలతోనే పాటలెక్కువగా సాగేవి. ఆతరువాత తరువాత కృష్ణశాస్త్రి, ఆత్రేయ, శ్రీశ్రీ, వేటూరి, సిరివెన్నెల, చంద్రబోస్ వంటికవులు అటు వృత్తికవులుగాను, ఇటు ప్రవృత్తి కవులుగాను కూడ పాటలకు గొప్ప సాహితీవిలువలను అద్దారు.

ఏది ఏమైనా అసలు ముందు బాటను ఏర్పరచటమే కష్టం. ఆతరువాత దానికి ఎన్నిసొబగులైనా అద్దవచ్చు. అందుకని సినిమాగీతాలకు అసలంటూ ఒకత్రోవనేర్పరచిన తొలితరం కవులను కళ్ళకద్దుకొని తీరాల్సిందే.

అలాంటి తొలితరంకవే బలిజేపల్లి. ఆయన హరిశ్చంద్ర నాటక కర్తగా జగద్విఖ్యాతం పొందినా సినిమా పాటలరచయితగా కూడ ఆయన్ని గుర్తుంచుకో వాల్సిందే. ఆయన కవేకాదు, నటుడు, నాటక రచయిత, సంగీతకళానిధి, దేశికుడు, అవధాని, నాటక నిర్వాహకుడు, సినీకవి, సినీనటుడు, సంభాషణల రచయిత. ఒక్కమాటలో చెప్పాలంటే ఆయన పుంభావ సరస్వతి.



-డాక్టర్. జోస్యుల కృష్ణబాబు,
మొబైల్:9866454340.

విద్యావ్యవస్థ ధ్వంసం-హరగోపాల్

సభలో ప్రసంగిస్తున్న ప్రొ॥ హరగోపాల్

రాష్ట్రంలో ఏడేళ్లుగా విద్యారంగాన్ని విధ్వంసం చేశారని ప్రొఫెసర్ హరగోపాల్ అభిప్రాయపడ్డారు. విద్యా వ్యవస్థను ప్రైవేటీకరించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. కమలానెహ్రూ పాలిటెక్నిక్ కళాశాల మూసివేతకు జరుగుతున్న కుట్రను నిరసిస్తూ కమలానెహ్రూ కళాశాల విద్యార్థులు అలూమ్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. హరగోపాల్ మాట్లాడుతూ ఒకప్పుడు దేశంలోని అయిదు ఉత్తమ యూనివర్సిటీలో ఒకటిగా ఉన్న ఉస్మానియా వర్సిటీ ర్యాంకు రాష్ట్రం సాధించుకున్న తర్వాత దిగజారిపోయిందన్నారు. సామాజికవేత్త దేవి మాట్లాడుతూ మహిళలను విద్యకు దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి. సంధ్య మాట్లాడుతూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న ఎగ్జిబిషన్ సొసైటీపై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులతో పాటు అన్ని రాజకీయ పార్టీలు, మహిళా సంఘాలు ఏకమై కళాశాలను రక్షించేందుకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. అలూమినీ అసోసియేషన్ అధ్యక్షురాలు స్వాతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీవోడబ్ల్యూ అధ్యక్షురాలు రూన్సీ, ఏఐఎస్ఎస్ నాయకురాలు ప్రమీల, ఐద్వా నాయకురాలు నాగలక్ష్మి, జనసేన నాయకురాలు నిహారిక, సత్య, జోత్స్న తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 16న త్యాగరాయ గానసభలో జరిగిన 'మార్నింగ్ కాఫీ' కథల సంపుటి ఆవిష్కరణలో రచయిత్రి డా॥ కేతవరపురాజ్యశ్రీని సత్కరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డా॥ కె.వి. రమణాచారి. వేదికపై పెద్దూరి వెంకటదాసు, బైస దేవదాసు, కళా వి.యస్. జనార్ధనమూర్తి, డా॥ ముక్తేవి భారతి, గుదిబండి వెంకటరెడ్డి.

ఎన్ఆర్ఐ హరినాథ్‌కు జీవన సాఫల్య పురస్కారం ప్రదానం

ఎన్ఆర్ఐ హరినాథ్‌ను సత్కరిస్తున్న బాలకిషన్, జయవింధ్యాల, రాజలింగం, సురేంద్రగౌడ్, అశోక్.

తెలంగాణలో పుట్టి అమెరికాలో స్థిరపడి సేవారంగంలో విశేష సేవలందిస్తున్న హరినాథ్ మేదీకి జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేయడం అభినందనీయమని ప్రముఖ సంఘ సేవకులు బాలకిషన్ అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని ఎన్జీవోస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ కార్యాలయంలో ఈ పురస్కార ప్రదాన సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాలకిషన్ చేతుల మీదుగా హరినాథ్‌మేదికి మెమోంటో, సన్మాన పత్రం అందజేసి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వగ్రామంలో సేవా సంస్థను స్థాపించి తెలంగాణలోని అనేక పాఠశాలలకు , నిరుపేదలకు సేవలందిస్తున్న హరినాథ్‌మేదీ అభినందనీయుడని అన్నారు. బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది జయవింధ్యాల, సూరి, రామదాసు, రాజలింగం, సురేంద్రగౌడ్, గడ్డం అశోక్, జర్నలిస్టు తిరుమల తదితరులు పాల్గొన్నారు.

కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

'బుధవారం బాద్షా'

అడ్మిన్: రమాదేవి కులకర్ణి

పోటీ ఫలితాలు

ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.
నిర్వహణ: **దా॥ప్రతికంఠం మాలతీలత**

గుణపాఠమే

జీవితంలో నేర్చుకోవలసిన
పాఠం గుణపాఠమే....
అన్ని పాఠాలకు బదులు గుణపాఠమే.

బతుకులో వెలితి దారులు ఎన్నో....
పడేసే లోయలు ఎన్నో....
ఒంటరి తనపు నీడలు ఎన్నో....
ప్రతి క్షణం ఓ గుణపాఠమే....
ప్రతి గాయం ఓ అనుభవమే.....

ప్రతి అడుగు ఓ ఆలోచనే....
తాకుతున్న కన్నీటి బొట్టు ఓ గుణపాఠమే....
వెనక్కి రాని నీ గతం ఓ గుణపాఠమే....
నీ బ్రతుకు నీకు ఓ గుణపాఠమే....

నీకు నువ్వే ఓ గుణపాఠం.....
గునపం లాంటి మాటలు గుచ్చే....
ప్రతి గాయపు మరక ఓ గుణపాఠమే.....
నిన్ను చూసి నవ్వే ఈ లోకం నీకు....
ఓ గుణపాఠమే....

శూన్యంలో నీ విహారం ఓ గుణపాఠమే....
నీలో ఉన్న భయాలను తీసేయ్....
నిన్ను నువ్వు ముందుకు నడిపించు....

-కావ్య నరేష్

సముపార్జించుకోవాలి

మానవ జీవితం
ప్రతిక్షణం నేర్చుకోవడానికే.
నేర్చిన ప్రతి పాఠం
నేర్పుతో నెమరువేయడానికే.
పొందిన జ్ఞానంతో
పొంగిపోకుండా
పొందాల్సిన జ్ఞానం వైపు
తొంగిచూడాలి.
సమస్యలు, ఒత్తిళ్లు
సర్వ సాధారణమైన జీవితంలో
పరిష్కారాలు, ఉపశమనాలు
పరిపాటే కదా.
కరుగుతున్న కాలం
ఆయుష్షును తరుగుతున్నా
ఎప్పటికీ తరగని
కీర్తిప్రతిష్టలను సముపార్జించుకోవాలి.
యదార్థానికి
మానవ జీవితానికి
అర్థం, పరమార్థం
యథాశక్తి
పరహితంకై పరితపించడమే...

-బస్వ రాజ్ కుమార్
సిద్ధిపేట

ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ అవార్డు - 2021

కవులకు విజ్ఞప్తి

34వ ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ అవార్డు - 2021 కోసం కవుల నుండి కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నాము.

అవార్డు పరిశీలన కోసం 2021 లో ప్రచురింపబడిన కవితా సంపుటాలను మాత్రమే పంపాలి.

ఎంపికైన ఉత్తమ కవితా సంపుటికి ఆరువేల నగదు మరియు షీల్డ్ తో కవికి సత్కారం ఉంటుంది

05.01.2022 తేదీలోగా నాలుగు ప్రతులను ఈ క్రింది చిరునామాకు పంపాలని విజ్ఞప్తి చేస్తున్నాము

డా. రాధేయ
చైర్మన్- ఉమ్మడిశెట్టి లిటరరీ ట్రస్ట్
13-01-606-1 షిర్డీనగర్, రెవిన్యూ కాలనీ,
అనంతపురం - 515001
సెల్: 9985171411



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 408వ రోజు 'చేతిరుమాలు' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'చేతిరుమాలు' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా - సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం ఏకాంశ కవిత్వం నిర్వహణ:
డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

చిన్న తువ్వాలు

గుడ్డ చిన్నది
అవసరం బహు దొడ్డది
జానెడంత వస్త్రం
జేబులో భద్రం
ఆడామగా అందరికీ ప్రియ నేస్తం.
నాసికా స్రావాలను పీల్చు రుమాలు
మూతి తుడుచుకునే చిన్న తువ్వాలు
హస్త శుభ్రతకు చిరునామా రుమాలు
జిడ్డోడిన ముఖాన్ని మెరిపించు రుమాలు
దుర్గంధామా?!
పెట్టుకో ముక్కుకు అడ్డం
నోటిదుర్వాసనా?!
మూసుకో మూతిని సాంతం
రుమాలు- మాస్కుకు
చక్కని ప్రత్యామ్నాయం
ముత్తెదువల వాయనంలో రుమాలొక భాగం
పలు రంగు రూపాల్లో లభ్యం
కాగితపు రుమాళ్ళకే
ఈనాడు ప్రాముఖ్యం
రైలు, బస్సుల్లో సీటునాపు చేతి రుమాలు
క్లిష్ట సమయాల్లో పరువు నిలుపు రుమాలు
రుమాలు లేని జేబు
వెలితికి ఆనవాలు
రుమాలున్న జేబులు
నిశ్చింతకు చిరునామాలు.

- జె.వి.కుమార్
చేపూరి

పూమాల!

జేబులోంచి నిక్కి నిక్కి చూసే
అందమైన పూమాలా! జేబురుమాలా!
చేతిలో ఇమిడే అమ్మ గుండె!
ఆప్యాయంగా నామొహం తుడుచు!
సున్నితంగా నా కంటి కిచ్చు రక్ష!
గువ్వ పిట్టలా గుప్పిట్లో ఒదిగేను!
ఏమరిచితే ఎక్కడో జారి
రెక్కలొచ్చి ఎగిరేను!?
సర్రున చేజారుజలుబుకి జిర్ర్ అంటే
పక్కనున్న వారు సుర్ర్ అంటే ఆదుకునేది!
కంటినీరు తుడిచేది!.
పెద్దపెట్టున నవ్వకుండా మూతికి అడ్డం!
కరోనాలో మాస్క్ గా కవచం!
హాచ్ అని తుమ్మినా ఆదుకొను
ఎండ వాన చలికి నెత్తిపై కెక్కు
చెవుల చుట్టి ఊసులాడు!.
అతివలకి అందచందాల
రంగు రంగుల డిజైన్లు
పూలు పిట్టల ఎంబ్రాయిడరీతో
సిల్క్ దస్తీ హొంకీలు!.
నర్సరీ కె.జి.పిల్లల జేబులపై ఊగేను!
సెంట్ స్ప్రేలతో గుబాళించేను!.
జానెడుమొదలు మూరెడు దాకా
చదరపు రుమాలా
తెలుపు రంగులలో మగవారి జేబులో
ముచ్చట గా ఇమిడేను!
పాపడి మొదలు తాతదాకా
ఆప్యాయంగా మొహాన్ని తడుముతూ
గుండె మంటలబాధకి కారే కన్నీటికి
ఓదార్పు చేతిరుమాలా!
అందరికీ నీవే కావాలా!?.

-ఎ.రాజ్యశ్రీ

సదా సేవలో

మానవ జాతి ఆరోగ్యానికి
రుమాలు ఎంతో మేలు
వంట గది నుంచి ఇంటి పని
బయటి కాలుష్య నివారణకు
చేతి రుమాలు సేవ అనంతం
మన చుట్టూ ఎన్నో విధాలుగా
వింత విచిత్ర డిజైన్ల లో ఉన్న
ఈ వస్త్రం
పేపర్స్ బిట్స్
మాదిరి అందుబాటులో
సెంటుతో సుగంధ పరిమళ
చేతి రుమాలు
బాక్స్ లలో కవర్స్‌లో ఎన్నో రంగులలో
నేడు పెళ్లి పేరంటం అన్నిటా
దీని వాడకం మెండు
అందరికీ దీని వాడకం ఎంతో
అవసరమే కదా.

- నారు మంచి వాణి ప్రభాకరి

గడసరి

ఉ. చేతిరుమాలు శుభ్రతకు చిహ్నము స్నేహము చేయునెప్పుడున్
ప్రీతినిగూర్చు కల్మషము పేరగ స్వచ్ఛత గూర్చునెప్పుడున్
జాతికి భారతీయతకు సంగడితో నుపవస్త్రమైధరన్
మాతకసమానమై తలరుమాలును రక్షణ శీర్షభాగమున్!

తే.గీ. తనరు కర్చీపు దస్తీయె తనువు వెంట
ముక్కు పేగులు గుడ్డలై మోము చెమట
తుండు చిన్నది పనిచేయు తుదుపు గుడ్డ
రంగు శోభలకనిపించు రాజసమ్ము!!

తే.గీ. చేరుమాలు గడసరిది చెలిమి సతము
కూరగాయలు కొనిరాగ తీరు తృప్తి
ఎండవానల చలిలోననెప్పుడైన
నేను నీకుంటినని చెప్పు నేస్తమగును!!.



-మాడుగుల నారాయణమూర్తి

చేతిరుమాలు- సామాజిక భేదాలు

అగుపడని అగాధం నుండి
నాసిక గొట్టాల ద్వారా
జల జలా జారుతున్న
సెలయేటి ప్రవాహాన్ని
నాజూకుగా అడ్డుకుని...
కష్ట పడి సంపాదించిన
కరెన్సీ నోట్ల కంటే జాగ్రత్తగా
పంట్లాము పక్క జేబులో
పదిల పరచుకుంటారు
గొప్పోళ్లు !.
'దాన్ని'మెయింటైన్ చేయలేక
ఎప్పటి కప్పుడు
విదిలించేస్తారు
బీదోళ్లు !!.

-రామకృష్ణ చంద్రమౌళి

దస్తీ నా దోస్తీ

దస్తి..
తూర్పేస్తుంది
తూడ్పిందంతా
దాచేస్తుంది
సమయానికి
సంచిలా పనిచేస్తోంది
మాస్కు లేకున్నా
రిస్కు కాకుండా
మూతి ముక్కు
మూసేస్తుంది
తలపాగై రక్షిస్తుంది
మాయగాల్ల చేతిలో
క్లోరోఫాంతో తడిచేస్తుంది
ఉన్నది దొచుకోటానికి
ఆయుదమవుతుంది
చొక్కా కాలరు కింద
అమరి
చెమట పీల్చేస్తుంది
చిన్నవి పెద్దవి
రంగుల హంగుల
దస్తీలు ఎన్నో
మగువల చేతిలో
సుకుమారపు
కర్చీపులు ఎన్నో.

- జె.నరసింహారావు

చిన్న తువ్వాల

రకరకాల పేరుతో చెలామణి
చేసే పని మాత్రం ఒక్కటే
ప్యాంటు జేబులోనో
అంగీ జేబులోనో భద్రం
అంగిలాగు తొడగని వారు
నడుముకు చెక్కుకుంటారు
అవసరం అయినప్పుడు
చేతిలోకి తీసుకుంటారు
చెమటలను తుడుచుకొని
హాయిగా ఫీలౌతుంటారు
చేతిరుమాలు లేనప్పుడు
తువ్వాలను ఉపయోగిస్తారు
ముఖాన్ని ముక్కు చేతులను
బహు శుద్ధి చేస్తారు
ఆరోగ్య ద్రావణాల పీల్చ
చేతిరుమాలు ఉపయోగిస్తారు
అప్పుడప్పుడు సీట్ల శుద్ధికి
చేతి రుమాలునే వాడతారు
దగ్గోస్తే రెండు చేతులతో
నోటికి అడ్డంగా పట్టుకుంటారు
ప్రజా రవాణాలలో
ప్రయాణం చేసెటప్పుడు
సీట్లనాప ఉపయోగిస్తారు
నోట్లను కట్టగా కట్టడానికి
కూడ ఉపయోగిస్తారు
బహుళరకాల చేతిరుమాలులు
బహుళ ప్రయోజనాలు
ఎప్పటికప్పుడు శుద్ధి చేయకుంటే
పెను ప్రమాదమే
నాసికా రంధ్రాలకు ఇబ్బంధి
శరీరానికి అనారోగ్యం కల్గించు
జాగ్రత్త వహించాలి
ఆరోగ్యంగా జీవించాలి.

- గుండం మోహన్ రెడ్డి

నేనంటే నేనే

స్వేదాన్ని తుడిచేది నేనే
సేదను తీర్చేది నేనే
ధనాన్ని దాచేది నేనే
ముఖాన్ని శుభ్రపరచేది నేనే.
వాన నుండి రక్షణ నేనే
ఎండ నుండి రక్షణ కూడా నేనే
కార్బన్డైయాక్సయిడ్ హరించేది నేనే.
ఆక్సిజన్ ను దాచిపెట్టేది నేనే
చలి గాలులనుండి
చెవులకు మేలుచేసేది నేనే
నలకల బారి నుండి కండ్లను
కాపాడేది నేనే.
భోజనానికి ముందు
చేతులు శుభ్రపరచేది నేనే
భోజనం తర్వాత
అ